www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ANDHRAJYOTHI
బుధవారం | 18-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 63

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: సప్తమి మ.1.35 తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాభాద్ర రా.12.23 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం:ఉ.7.15-8.49, దుర్ముహూర్తం: ఉ.11.50-12.42, అమృతఘడియలు: సా.4.36-6.09, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.47

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మరో రచ్చకు జగన్ రెడీ!

యోగా దినోత్సవానికి ముందు రగడకు సన్నద్ధం 13

- నేడు పల్నాడులో పర్యటన.. ఏడాదికిందట ఆత్మహత్య చేసుకుంటే ఇప్పుడు పరామర్శ, విగ్రహావిష్కరణ
- వైసీపీ గెలుస్తుందని కోటిన్నర బెట్టింగ్!.. ఇతరుల సొమ్ముతో నాగమల్లేశ్వరరావు పందెం
- డబ్బులివ్వలేక పురుగుమందు తాగి ఆత్మహత్య.. ఆయన చనిపోయింది గత ఏడాది జూన్ 9న..
- కూటమి అధికారంలోకి వచ్చింది 12వ తేదీన.. ప్రభుత్వ వేధింపులే కారణమంటూ వైసీపీ ఆరోపణ

చెల్లిపైనా దొంగ చెవులు!

తెలంగాణలో వైఎస్ షర్మిల ఫోన్ ట్యాపింగ్

జగన్ కోసం కేసీఆర్ పోలీసుల 'ఆపరేషన్'!

- షర్మిల కదలికలు, ఫోన్ కాల్స్‌పై అబ్జర్వేషన్
- ఆమె మాట్లాడే వారి ఫోన్లూ ట్యాప్
- ఎప్పటికప్పుడు జగన్‌కు సమాచారం
- నాడు ఒకేసారి 650 మంది ఫోన్లపై నిఘా
- ఆధారాలు సేకరించిన తెలంగాణ 'సిట్'
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 'హద్దులు' దాటిన ట్యాపింగ్ వ్యవహారం



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అప్పట్లో... తెలంగాణలో కేసీఆర్ సర్కార్! ఏపీలో... ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్! ఇద్దరి మధ్యా మంచి సన్నిహిత సంబంధాలు! దీంతో... తెలంగాణ పోలీసుల ద్వారా సొంత చెల్లెలు షర్మిలపైనే జగన్ 'నిఘా' వేసినట్లు తేలింది. ఆమె కదలికలు, ఫోన్ సంభాషణలను ఎప్పటికప్పుడు ఆరా తీసినట్లు స్పష్టమైంది. షర్మిల ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకుని... వారి ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు ఫోన్ ట్యాపింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. వెరసి... తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సరిహద్దులు దాటింది. షర్మిల మాత్రమే కాదు... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరి కొందరు రాజకీయ నాయకుల ఫోన్లనూ అప్పటి ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) 'అబ్జర్వేషన్'లో పెట్టినట్లు

మిగతా 14వ పేజీలో...

యుద్ధంలోకి అమెరికా?

ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులకు సిద్ధం!



- ఈశాన్య సిరియా నుంచి అమెరికా బలగాల తరలింపు!
- డీగో గార్షియాలో ఇప్పటికే అమెరికా బీ2 స్టెల్త్ బాంబర్లు
- ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో మాకు తెలుసు
- ప్రస్తుతానికి హతమార్చం.. ఇరాన్ లొంగిపోవాలి
- ఆ దేశం వద్ద అణ్వాయుధం అనేది ఉండకూడదు
- సమస్యకు నిజమైన ముగింపు కోరుకుంటున్నాం
- టెహ్రాన్‌ను అక్కడి పౌరులు తక్షణం వీడి వెళ్లిపోవాలి
- ట్రంప్ హెచ్చరిక.. జీ7 నుంచి అర్ధంతరంగా అమెరికాకు
- కాల్పుల విరమణ కోసం కాదు.. విషయం పెద్దది: ట్రంప్



ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ సమీపంలోని ఓ చమురు నిల్వ కేంద్రం తగలబడుతున్న దృశ్యం

టెహ్రాన్, టెల్అవీవ్, జూన్ 17: పతాకస్థాయికి చేరిన ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో.. అమెరికా కూడా జోక్యం చేసుకోనుందా? ఇజ్రాయెల్‌కు తోడుగా అగ్రరాజ్యం కూడా యుద్ధరంగంలోకి దిగనుందా? గడిచిన 24 గంటలుగా శరవేగంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తోంది. ఎన్నిసార్లు హెచ్చరించినా తమతో అణు ఒప్పందం కుదుర్చుకోలేదన్న కోపంతో ఇరాన్‌పై రగిలిపోతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. "ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు. ఈ విషయాన్ని నేను పదే పదే చెబుతున్నాను. టెహ్రాన్ ప్రజలంతా తక్షణమే ఆ నగరాన్ని వీడి వెళ్లిపోండి" అని హెచ్చరిస్తూ సోమవారం తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. అనంతరం.. కెనడాలో జరుగుతున్న జీ7 సమావేశాన్ని వీడి అర్ధంతరంగా అమెరికాకు పయనమయ్యారు. జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశం నిర్వహించడానికి 'సిచ్యువేషన్ రూమ్'ను సిద్ధం చేయాలని శ్వేతసౌధం వర్గాలను ఆదేశించారు. "సుప్రీం లీడర్‌గా చెప్పుకొంటున్న సదరు నేత ఎక్కడ దాక్కున్నాడో మాకు పక్కాగా తెలుసు. ఆయన్ను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం మాకు చాలా సులువు. కానీ, అక్కడ ఆయన క్షేమంగానే ఉన్నారు. ఆయన్ను మేం చంపం.. కనీసం ప్రస్తుతానికి!" అని మంగళవారం మరో

మిగతా 2వ పేజీలో...

టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌ను తాకిన ఇరాన్ క్షిపణి
- హైఫా రిఫైనరీ వద్ద ఆగని మంటలు

ఇజ్రాయెల్ చేతికి బంకర్ బస్టర్ బాంబ్
- ఇరాన్‌పై దాడికి అమెరికా సహకారం?

పశ్చిమాసియాలో గగనతలం మూసివేత!
- చిక్కుకుపోయిన వేల మంది ప్రయాణికులు
- ఇరాన్‌లో పది వేల మంది భారతీయ విద్యార్థులు
- వారిని తీసుకొచ్చే యత్నాల్లో విదేశాంగ శాఖ

చెవిరెడ్డి అరెస్టు



విదేశాలకు పారిపోతుండగా అదుపులోకి

లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం

- బెంగళూరు ఎయిర్‌పోర్టులో నాటకీయంగా అరెస్టు
- జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు
- కేసులో 38వ నిందితునిగా చేర్చిన సిట్
- దేశం దాటిపోయేందుకు ప్రయత్నం
- బినామీ వెంకటేశ్‌నాయుడితో కలిసి పథకం!
- శ్రీలంక వెళ్లేందుకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు
- అప్పటికే లుకౌట్ నోటీసులిచ్చిన సిట్
- వారిద్దరినీ అరెస్టుచేసిన ఇమ్మిగ్రేషన్ అధికారులు
- వారి సాయంతో అదుపులోకి తీసుకున్న సిట్
- నేడు విజయవాడ ఏసీబీ కోర్టుకు..

'సిట్' అధికారులు హింసించారు
- డీజీపీకి చెవిరెడ్డి గన్‌మ్యాన్ లేఖ
- మమ్మల్నే ఆయన బెదిరించారు
- ఆరోపణలు అవాస్తవం: సిట్

హక్కుల ఉల్లంఘన జరగలేదని స్పష్టీకరణ

అమరావతి, బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో మరో కీలక సూత్రధారి, మాజీ సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. విదేశాలకు పరారవుతుండగా చెవిరెడ్డిని అత్యంత నాటకీయంగా బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడకు తరలించారు. బుధవారం ఏసీబీ కోర్టులో వైసీపీ నేతను ప్రవేశపెట్టనున్నారు. లిక్కర్ కేసు దర్యాప్తులో భాగంగా ఒక్కొక్క అనుమానితుడిని పిలిచి సిట్ అధికారులు విచారించడంతో మద్యం ముడుపులతో చెవిరెడ్డికి ఉన్న లింకులు బయటికొచ్చాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కేసులో 38వ నిందితునిగా చేర్చారు. దీంతో అరెస్టు తప్పదని భావించిన ఆయన, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన తన మిత్రుడు, బినామీ వెంకటేశ్‌నాయుడుతో కలిసి పక్కా పథకం రచించారు. ఇద్దరూ విదేశాలకు పరారయ్యేందుకు సిద్ధమయ్యారు. ముందు శ్రీలంకకు వెళ్లి

మిగతా 14వ పేజీలో...



బనకచర్లతో తెలంగాణకు

నష్టం లేదు

- రాజకీయ దురుద్దేశాలతోనే ఆ రాష్ట్ర నేతల ఫిర్యాదులు
- కాళేశ్వరం అవినీతిపై విచారణను పక్కదోవ పట్టించేందుకే: నిమ్మల
- కడలిపాలయ్యే వరద జలాలనే తరలిస్తాం
- అనుమతులన్నీ పొందాకే పథకం నిర్మిస్తాం
- జగన్ నోరు విప్పడం లేదెందుకు?
- గోదావరి- కృష్ణా అనుసంధానంపై ఆయన, కేసీఆర్ అవగాహనకు రాలేదా?
- రోజుకు 4 చొప్పున 100 రోజుల్లో 400 టీఎంసీలు తరలిస్తామనలేదా?
- బోర్డుల అనుమతుల్లేకుండా తెలంగాణ ప్రాజెక్టులు నిర్మించలేదా?
- బాబు అడ్డుకుని ఉంటే అవి పూర్తయ్యేవా?
- నిలదీసిన మంత్రి రామానాయుడు

12



ఎవరిదీ 'చెత్త' పాపం?

పదుల సంఖ్యలో మినీ ట్రాక్టర్లు, హైడ్రాలిక్ ట్రక్కులు, బ్యాటరీ ఆటోరిక్షాలు.. ఒకే చోట పోగేసి కనిపిస్తున్నాయి కదూ! పనికిరాని, తుక్కుగా మారిన వాహనాలను 'డంపింగ్' చేసినట్లు అనిపిస్తోంది కదూ! ఇవన్నీ అసలు ఇక్కడ.. ఎందుకున్నాయి? అవి ఇలా నాశనం కావడానికి కారకులెవరు? ...12లో

కొత్త వైద్య కాలేజీలకు వైసీపీ శాపం!

- జగన్ ప్రభుత్వ మితిమీరిన నిర్లక్ష్యంతో ఐదు వైద్య కళాశాలల్లో సౌకర్యాల లేమి
- పూర్తిస్థాయిలో లేని బోధనా సిబ్బంది
- అభ్యంతరం వ్యక్తంచేసిన మెడికల్ కౌన్సిల్
- లోపాలు సరిదిద్దని అప్పటి జగన్ ప్రభుత్వం
- అడ్మిషన్లకు ముందు సరిచేస్తామని హామీ
- ఆ తర్వాత పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



- ఎన్ఎంసీ నుంచి సర్కారుకు లేఖ
- వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశం
- ఢిల్లీ వెళ్లిన సెక్రటరీ, డీఎంఈ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీలు గత వైసీపీ సర్కారు నిర్వాకం కారణంగా కొరగాకుండా పోయాయి. ప్రచార ఆర్భాటం కోసం ఏర్పాటు చేసిన ఈ కళాశాలల్లో కనీస

మిగతా 3వ పేజీలో...

అమరావతికి మరింత జోష్

రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- 1,458 కోట్లతో ఉమ్మడి కేంద్ర సచివాలయం
- 1,329 కోట్లతో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్స్ కూడా..
- ఐనవోలులో గతంలోనే 17 ఎకరాలు కేటాయింపు
- వీటికి మళ్లీ అక్కడే భూములివ్వనున్న సీఆర్‌డీఏ



రాజధాని అమరావతిలో రాత్రివేళా సాగుతున్న నిర్మాణ పనులు

విజయవాడ/న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కేంద్ర సచివాలయం (కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ -సీఎస్ఎస్), జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ (జీపీఆర్ఏ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. కూటమి ప్రభుత్వ చొరవతో రాజధాని నిర్మాణ పనులు ఊపందుకుంటున్న తరుణంలో ఈ శుభవార్త వినిపించింది. పెండింగ్‌లో ఉన్న ఈ రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను రూ.2,787 కోట్ల వ్యయంతో

మిగతా 12వ పేజీలో...



రోబోలకూ స్పర్శ అనుభూతి!

- వేడి, నొప్పిని గుర్తించే రోబోటిక్ చర్మం అభివృద్ధి
- కేంబ్రిడ్జ్ పరిశోధకుల ఆవిష్కరణ
- ఈ చర్మంతో సున్నితమైన, తెలివైన సెన్సర్‌గా మారనున్న రోబోటిక్ చేయి

11

ప్లాస్టిక్ రహితంగా నగరాలు



- అక్టోబరు 2కల్లా ప్రధాన నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కట్టడి చేయాలి 13
- 2 నెలల్లో సర్క్యులర్ ఎకానమీపై కొత్త పాలసీ
- ఏడాదిలోగా 3 సర్క్యులర్ ఎకానమీ పార్కులు
- వ్యర్థాల నిర్వహణలో ప్రతిభకు స్వచ్ఛత అవార్డులు
- పేరుకున్న చెత్తను వెంటనే తొలగించాలి: సీఎం

కుప్పం దా..రుణంపై సీఎం సీరియస్

- మహిళను కట్టేసిన వారిపై కఠిన చర్యలు
- రూ.5 లక్షల తక్షణ సాయం.. ఫోన్‌లో పరామర్శ

14

కెనడాలో మోదీపై దాడికి ఖలిస్థానీల కుట్ర



కెనడాలో మోదీకి స్వాగతం

టొరంటో, జూన్ 17: ప్రధాని మోదీ కెనడా పర్యటన సందర్భంగా ఖలిస్థానీ వేర్పాటువాదులు ఆకస్మిక దాడికి కుట్రపన్నారు. జీ7 సదస్సులో పాల్గొనేందుకు మోదీ మంగళవారం కెనడాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అల్బెర్టా రాష్ట్రంలోని కల్గరీ నగరంలో నిరసన తెలిపేందుకు ఖలిస్థానీ వేర్పాటువాదులు గుమిగూడారు. ఈ కార్యక్రమాన్ని మోదీకి వ్యతిరేకంగా 'ఆకస్మిక దాడి'గా వేర్పాటువాదులు అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా హింసాత్మక నినాదాలు చేశారు. 'మోదీ రాజకీయాలను చంపేయండి(కిల్ మోదీ పాలిటిక్స్)' అంటూ కెనడా ప్రధాని మార్క్ కార్నీకి నిరసనకారులు పిలుపునిచ్చారు. అలాగే, 'భారత రాజకీయాలను చంపేయండి(కిల్ ఇండియా పాలిటిక్స్)' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరసనకారులు పిలుపునిచ్చారు. కొందరు నిరసనకారులు దూకుడుగా దూసుకొచ్చి త్రివర్ణ పతాకాన్ని కిందపడేసి తొక్కారని, చించివేశారని కెనడా జర్నలిస్టు డానియెల్ బార్డ్‌మన్ తెలిపారు. సిక్స్ ఫర్ జస్టిస్ సంస్థ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాదుల తీరును సిక్కు సంస్థలు ఖండించాయి.

క్వాంటమ్ కమ్యూనికేషన్‌తో డేటా సురక్షితం

» సైబర్ సెక్యూరిటీలో కీలక ముందడుగు

న్యూఢిల్లీ, జూన్ 17: డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీ కలిసి క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో ప్రయోగాత్మక పురోగతి సాధించాయి. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌ను ఉపయోగించి వారు ఒక కిలోమీటరు దూరం నుంచి ఫ్రీ-స్పేస్ క్వాంటమ్ ద్వారా సమాచారాన్ని సురక్షితంగా చేరవేశారు. క్వాంటమ్ కమ్యూనికేషన్ డొమైన్‌లో భారత్ ప్రయోగాత్మక పురోగతి ప్రదర్శించిందని, ఇది సైబర్ భద్రతలో కీలక ముందడుగు అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్ అనేది క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో చాలా కీలకం. ఇది రెండు లేదా అంతకంటే ఎక్కువ క్వాంటమ్ కణాల మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. ఇవి ఎంత దూరంలో ఉన్నా ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉంటాయి. డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీ బృందం ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి సురక్షితమైన కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా శాస్త్రవేత్తలు ఫైబర్‌ను కాకుండా గాలిని ఉపయోగించారు. ఈ పురోగతి క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ (క్యూకేడీ), క్వాంటమ్ నెట్‌వర్క్‌ల అభివృద్ధి, క్వాంటమ్ సైబర్ భద్రతలో రియల్ టైమ్ అనువర్తనాలకు మార్గం సుగమం చేస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. "ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ లింక్ ద్వారా క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌ను ఉపయోగించి ఒక కిలోమీటరు కంటే ఎక్కువ దూరం సమాచారాన్ని సురక్షితంగా పంపించాం" అని ప్రకటించింది. దీంతో భారత్ కొత్త క్వాంటమ్ యుగంలోకి ప్రవేశించిందని తెలిపింది. ఈ చరిత్రాత్మక విజయాన్ని అందించిన డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. భవిష్యత్తు యుద్ధాల్లో ఇది 'గేమ్ చేంజర్' అవుతుందని చెప్పారు.

గుజరాత్‌లో హత్యాకాండ జరిగితే మోదీ ఎందుకు రాజీనామా చేయలేదు?

» బీజేపీ నేతలకు కర్ణాటక సీఎం సిద్దరామయ్య ప్రశ్న

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో 2002లో జరిగిన హత్యాకాండలో అన్ని మతాలకు చెందిన రెండు వేలమంది అమాయకుల ప్రాణాలు కోల్పోతే అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఎందుకు రాజీనామా చేయలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. ఆర్‌సీబీ విజయోత్సవాల సమయంలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం, ఉపముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆందోళనలు చేయడంపై ఆయన మండిపడ్డారు. బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అప్పట్లో బీజేపీ అగ్రనేత, ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సీఎం పదవికి రాజీనామా చేయాలని మోదీకి సూచించారని, అయినా మోదీ పాటించలేదని పేర్కొన్నారు.

వారికి వైద్యపరీక్షలు చేసి.. నివేదికివ్వండి

» కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తమపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, కడప వెలుపల ఏదైనా ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిలో గానీ, స్వతంత్ర వైద్యుడితో గానీ వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీ కౌన్సిలర్లు పి.కిషోర్, మరికొందరు వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లకు మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల ఎలాంటి నష్టం లేదని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొంది. పరీక్షలు చేసి, నివేదికను తమ ముందు ఉంచాలని కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఓ కేసులో అరెస్టయిన తమపై పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐలు చాంద్ బాషా, రమణ థర్డ్ డిగ్రీ ప్రయోగించడమే కాక, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జరిపిన వైద్య పరీక్షల నివేదికలో తమ ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని ప్రభుత్వాసుపత్రి వైద్యుల చేత తప్పుడు నివేదిక ఇప్పించారని పులివెందుల మున్సిపాలిటీ కౌన్సిలర్లు పి.కిషోర్, మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు.

'నో ఫ్లై జోన్'లుగా అమర్‌నాథ్ యాత్ర మార్గాలు

శ్రీనగర్, జూన్ 17: భద్రత కారణాల దృష్ట్యా అమర్‌నాథ్ యాత్ర మార్గాలను 'నో ఫ్లై జోన్'లుగా ప్రకటిస్తూ జమ్మూ-కశ్మీర్ యంత్రాంగం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. యాత్ర సాగే పహల్గాం, బల్తాల్ మార్గాలకు ఇది వర్తిస్తుంది. దీని ప్రకారం విమానాలు, హెలికాప్టర్లు తిరగడం సహా యూఏవీలు, డ్రోన్లు, చివరకు బెలూన్లు ఎగురవేయడం కూడా నిషేధం. జులై ఒకటో తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, భద్రతా దళాల నిఘా విషయంలో ఇందుకు మినహాయింపు ఉంది.

యుద్ధంలోకి అమెరికా?



యుద్ధంలో కుమారుడిని కోల్పోయిన ఓ తల్లి రోదన

(మొదటి పేజీ తరువాయి)

పోస్టు పెట్టారు. పౌరులపైన, అమెరికా సైనికులపైన క్షిపణి దాడులను తాము సహించబోమని.. తమ సహనం నశిస్తోందని అందులో పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరిస్తూ మరో పోస్టు పెట్టారు. ఇరాన్ గగనతలం మొత్తం పూర్తిగా తమ నియంత్రణలో ఉందని హెచ్చరించారు. "ఇరాన్ వద్ద మంచి స్కై ట్రాకర్లు, ఇతర రక్షణ పరికరాలు ఉండొచ్చు. కానీ, వాటికి మా పరికరాలతో పోలికే లేదు" అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈశాన్య సిరియాలో ఉన్న రెండు బేస్‌ల నుంచి అమెరికా బలగాలు వైదొలగాయి. ఆ బలగాలను ఎక్కడికి తరలించిందీ తెలియట్లేదు. ఇంకోవైపు.. అమెరికా నౌకాదళం తన సూపర్ క్యారియర్ (విమాన వాహక నౌక) యూఎస్ఎస్ నిమిట్జ్‌ను దక్షిణ చైనా సముద్రం నుంచి మధ్యప్రాచ్యం దిశగా.. వాయుసేనకు చెందిన 21 రీఫ్యూయెలింగ్ ట్యాంకర్లను (కేసీ-135 ఆర్, కేసీ-46ఏ) అమెరికా నుంచి యూరప్‌కు పంపుతున్నట్టు 'ద వార్‌జోన్' వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. మరోవైపు.. మధ్య టెహ్రాన్‌లో 3.3 లక్షల మంది ఉండే ఒక ప్రాంతాన్ని తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక జారీ చేసింది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధంలో అమెరికా కూడా జోక్యం చేసుకుంటుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ గెలవదు..

జీ7 సదస్సు నిమిత్తం కెనడాకు వెళ్లిన ట్రంప్.. ఈ యుద్ధంలో అమెరికా జోక్యంపై మీడియా అడిగిన ప్రశ్నకు తొలుత సమాధానం చెప్పడానికి నిరాకరించారు. అయితే.. ఇరాన్ ఈ యుద్ధాన్ని గెలవలేదని అక్కడ ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా మించిపోలేదని.. పరిస్థితులు చేయిదాటిపోకముందే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని కట్టిపెట్టాలని హెచ్చరించారు. ఇరాన్ తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. తర్వాత అర్ధంతరంగా జీ7 సమావేశాన్ని వీడి వెళ్లిపోయే ముందు.. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు" అని ట్రూత్ సోషల్‌లో మరో పోస్ట్ పెట్టారు. అధ్యక్ష విమానంలో అమెరికాకు వెళ్లే సమయంలో కూడా మీడియాతో ఆయన ఇదే మాట చెప్పారు (ఇదే మాటను ఆయన పదేపదే చెబుతుండడం గమనార్హం). ఇరాన్‌తో అణు వివాదానికి శాశ్వత ముగింపు పలకడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "కాల్పుల విరమణ కాదు. ఈ అంశానికి ఒక ముగింపు.. నిజమైన ముగింపు కావాలి" అని వ్యాఖ్యానించారు. ఇందుకోసం ఇరాన్‌తో చర్చలకు తమ ప్రత్యేక రాయబారి స్టీవెన్ విట్కాఫ్‌ను గానీ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌నుగానీ పంపిస్తానని తెలిపారు. ట్రంప్ ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు కృషి చేస్తున్నారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యను తిరస్కరించిన ట్రంప్.. "జీ7 సదస్సు నుంచి నేను తిరిగి వెళ్తున్నది (ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య) కాల్పుల విరమణ ఒప్పందం కోసమని.. ఎప్పుడూ ప్రచారాన్ని కోరుకునే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పొరపాటుగా చెప్పారు. అది తప్పు. నేను వాషింగ్టన్‌కు ఎందుకు వెళ్తున్నానో ఆయనకు అస్సలు తెలియదు. నేను వెళ్తున్నది మాత్రం కాల్పుల విరమణ కోసం కాదు. విషయం దానికంటే చాలా పెద్దది. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదని నేను మొదట్నుంచీ చెబుతూనే ఉన్నాను" అని పేర్కొన్నారు.

అమెరికా తోడు.. అందుకేనా?

ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆ దేశంపై దాడులు ప్రారంభించినప్పటికీ.. ఒక్క నతాంజ్ యురేనియం శుద్ధి కర్మాగారాన్ని మాత్రమే ఒకింత దెబ్బతీయగలిగింది. ఇరాన్ అణు కార్యక్రమానికి అత్యంత కీలకమైన ఫార్డో యురేనియం శుద్ధి కేంద్రాన్ని ధ్వంసం చేయలేకపోయింది. కొండల నడుమ భూగర్భంలో 200 అడుగుల లోతున ఏర్పాటు చేసిన ఆ కేంద్రంలో యురేనియాన్ని 60 శాతం వరకూ శుద్ధి చేయడానికి ఉపయోగించే ఆర్ఐ-6 సెంట్రీఫ్యూజ్‌లు 2000 దాకా ఉన్నట్టు అంచనా. ఈ కేంద్రాన్ని కాపాడేందుకు రష్యన్ ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ నియోగించింది. మరోవైపు.. ఖమేనీ సైతం టెహ్రాన్ నగరానికి 340 కిలోమీటర్ల దూరంలోని లవీజాన్ ప్రాంతంలో భూగర్భంలో 200 అడుగుల లోతున ఉన్న ఒక బంకర్‌లో తలదాచుకున్నట్టు సమాచారం. ఖమేనీతోపాటు ఆయన కుమారుడు, మరికొందరు కుటుంబసభ్యులు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ బంకర్లను ధ్వంసం చేయడానికి.. ఇజ్రాయెల్ వద్ద ఉన్న బంకర్ బస్టర్ బాంబులు సరిపోవు. దానికి అత్యంత శక్తిమంతమైన 14 వేల కిలోల జీబీయూ-57 పెనెట్రేటర్లు కావాలి. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. వాటిని ప్రయోగించడానికి అవసరమైన బీ-2 స్టెల్త్ బాంబర్లు కూడా అమెరికా వద్ద ఉన్నాయి. రేడార్లకు చిక్కని స్టెల్త్ సామర్థ్యం గల ఈ బీ2 బాంబర్లు అమెరికా వద్ద 20 ఉన్నాయి. 200 అడుగుల లోతులో ఉన్న బంకర్లను సైతం తునాతునకలు చేసే జీబీయు-57 బాంబులను ప్రయోగించే ఏకైక యుద్ధ విమానం ఇదే. అందుకే ఈ విషయంలో ఇజ్రాయెల్ అమెరికా సాయాన్ని ఆశిస్తోంది.



ఇజ్రాయెల్ దాడితో ఇరాన్ స్టేట్ మీడియా సెంటర్‌లో మంటలు



బీ 2 బాంబర్ల మోహరింపు..

ట్రంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టాక ఇరాన్ అణు కార్యక్రమంపై దృష్టి సారించి ఈ ఏడాది మార్చిలోనే.. ఆరు బీ2 స్టెల్త్ బాంబర్లను హిందూ మహాసముద్రంలోని డీగో గార్షియా దీవిలో మోహరించారు. మే నెలలో బీ 52 బాంబర్లను కూడా అక్కడికి తరలించారు. ఈ ద్వీపం ఇరాన్‌కు 4,842 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ, బీ2 బాంబర్ల రేంజ్ 11 వేల కిలోమీటర్లు. అంటే.. అమెరికా తల్చుకుంటే బీ2 బాంబర్లు సురక్షితంగా ఇరాన్‌కు వెళ్లి అణు శుద్ధి కేంద్రాలున్న బంకర్లపై బాంబులు జారవిడిచి, వెనక్కి తిరిగి వచ్చేయగలవు. అలా వెళ్లాలంటే ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్‌కు లేదా అమెరికాకు నియంత్రణ కావాలి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ గగనతలంపై తమకు పూర్తి నియంత్రణ ఉందని ఇజ్రాయెల్ సైన్యం సోమవారమే ప్రకటించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి మొదలుపెట్టిన రోజే ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, క్షిపణి వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని.. వాటిని తీవ్రంగా బలహీనం చేసిన సంగతి తెలిసిందే మంగళవారంనాడు ట్రంప్ సైతం.. ఇరాన్ గగనతలంపై తమకు పూర్తి నియంత్రణ ఉందని ప్రకటించారు. అంటే.. అమెరికా బీ2 బాంబర్లకు మార్గం సుగమమైనట్టే. అదే జరిగితే.. ఈ యుద్ధంలో అమెరికా కూడా అడుగుపెట్టినట్టే.

హోర్ముజ్ జలసంధిలో రెండు నౌకల ఢీ

గల్ఫ్ దేశాల నుంచి ప్రపంచానికి చమురు చేరవేతలో కీలక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిలో.. మంగళవారం రెండు నౌకలు పరస్పరం ఢీకొని తగలబడిపోయాయి! ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఈ జలసంధిని మూసేసే యోచనలో ఇరాన్ ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి ఉద్రిక్త సమయంలో ఆ జలసంధిలో రెండు నౌకలు తగలబడిపోతున్నాయన్న వార్త ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అయితే.. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి భద్రతాపరమైన కారణాలూ లేవని, నౌకల ఎలక్ట్రానిక్ సంకేతాలకు అంతరాయం కలగడం వల్లే ఒకదాన్నొకటి ఢీకొన్నాయని బ్రిటిష్ మారిటైమ్ సెక్యూరిటీ సంస్థ అంబ్రే తెలిపింది. ఈ నౌకల్లో ఒకటి ఫ్రంట్‌లైన్ ఈగిల్ ట్యాంకర్ కాగా.. రెండోది అడలిన్ ట్యాంకర్. ఫ్రంట్‌లైన్ ఈగిల్ ట్యాంకర్ ఇరాక్ నుంచి చైనాలోని ఝౌషాన్‌కు 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇక, అడలిన్ నౌక.. భారతదేశంలోని గ్లోబల్ షిప్పింగ్ హోల్డింగ్ లిమిటెడ్ కంపెనీకి చెందినది. ఈ నౌకలో ఉన్న 24 మందినీ కాపాడినట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీర రక్షకదళం ప్రకటించింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ మార్గంలో వెళ్లే వాణిజ్య నౌకల నేవిగేషన్ వ్యవస్థలకు అంతరాయం కలుగుతున్నట్టు సమాచారం.

పశ్చిమాసియాలో.. గగనతలం మూసివేత!

నిలిచిపోయిన విమానాల రాకపోకలు



మంగళవారం ఇరాన్ నుంచి బస్సుల్లో వెళ్లిపోతున్న పాకిస్తానీయులు

» ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్

» టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

» టెల్‌అవీవ్‌లోని మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌ను తాకిన ఇరాన్ క్షిపణి

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 17: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం మరింత విస్తరిస్తుండడంతో పశ్చిమాసియాలో చాలా వరకు దేశాలు గగనతలాన్ని మూసివేశాయి. ఇరు దేశాల నుంచి బాలిస్టిక్ క్షిపణి దాడులు కొనసాగుతుండడంతో.. విమానాల రాకపోకలను నిలిపివేశాయి. దీంతో.. లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లో విమాన ప్రయాణాలు ఆగిపోయాయి. పశ్చిమాసియాలో దాదాపు 10 వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయి ఉంటారని విశ్రాంత పైలట్, విమానయాన భద్రత నిపుణుడు జాన్ కాక్స్ పేర్కొన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ కూడా యుద్ధం ఆరంభం నుంచే విమానాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే..! అయితే.. విదేశాల్లో చిక్కుకుపోయిన 2 లక్షల మంది పౌరులను వెనక్కి రప్పించేందుకు బుధవారం నుంచి పరిమితంగా విమానాలను అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అత్యవసర పరిస్థితుల కారణంగా విదేశాల్లో ఉన్న 700 మంది ఇజ్రాయెలీ వైద్యులను సైప్రస్ నుంచి నౌకల ద్వారా స్వదేశానికి తీసుకువస్తోంది. దేశంలో చిక్కుకుపోయిన 1500 మంది విదేశీయులను నౌకల్లో తరలిస్తున్నట్లు తెలిపింది. కాగా.. ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను రప్పించే ప్రయత్నం ప్రారంభమైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. తొలిరోజు 110 మంది విద్యార్థులను అర్మేనియా మీదుగా ఇరాన్ సరిహద్దు దాటించినట్లు పేర్కొంది. కాగా.. ఇరాన్‌లో సుమారు 10 వేల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరిని అర్మేనియాతోపాటు.. అజర్‌బైజాన్, తుర్కమెనిస్థాన్ మీదుగా భారత్‌కు రప్పిస్తామని విదేశాంగ శాఖ అధికారులు వివరించారు. ఇరాన్‌లోని భారతీయులు +98 9128109115, +98 9128109109 నంబర్లకు ఫోన్ ద్వారా, +98 901044557, +98 9015993320, +91 8086871709, +98 9177699036 నంబర్లకు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని ఇరాన్‌లోని భారతీయులకు సూచించారు.

టెహ్రాన్‌పై వైమానిక దాడులు

ఇరాన్ గగనతలాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నామని సోమవారం ప్రకటించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) మంగళవారం తెల్లవారుజాము నుంచి వైమానిక దాడులను ప్రారంభించింది. ఇరాన్ వ్యాప్తంగా 200కు పైగా క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. తమ దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన ఖతమ్-అల్-అంబియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ జనరల్ అలీ షాద్మనీ చనిపోయినట్లు వెల్లడించింది. టెహ్రాన్ నుంచి ఇతర ప్రాంతాలకు ఇరానీల వలసలు పెరిగాయి. దీంతో.. పెట్రోల్ బంకులకు వాహనాలు పోటెత్తాయి. "టెహ్రాన్‌లోని పౌరులు వెంటనే నగరాన్ని ఖాళీ చేయాలి" అని అమెరికా అధ్యక్షుడు ఎక్స్‌లో హెచ్చరించడంతో.. పౌరులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. కాగా.. ఇరాన్‌పై దాడికి వాడిన డ్రోన్లను తయారు చేసేందుకు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీని ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.

ఇజ్రాయెల్‌కూ భారీ నష్టం

ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్‌లో కూడా భారీ నష్టం జరుగుతోంది. హైఫా వద్ద ఉన్న బజాన్ చమురు రిఫైనరీపై సోమవారం దాడులు జరిగిన విషయం తెలిసిందే..! ఈ దాడుల్లో ప్రధాన ప్లాంట్‌కు నష్టం వాటిల్లకున్నా.. ఆవరణలో పార్క్ చేసిన భారీ ఆయిల్ ట్యాంకర్ ట్రక్కులు దహనమయ్యాయి. టెల్‌అవీవ్ శివార్లలోని రామత్ హాషరోన్ పట్టణంలోనూ ఇరాన్ దాడులతో ఆవాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. గ్లిలోట్‌లోని అమన్ హెడ్‌క్వార్టర్స్‌ను కూడా ఇరాన్ క్షిపణులు ధ్వంసం చేసినట్లు తెలిపాయి. ఐడీఎఫ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులను గాల్లోనే అడ్డుకున్నామని వివరించింది. "ఇరాన్ దాడులను ఇలాగే కొనసాగిస్తే.. ఖమేనీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరించారు.

పౌరుల భద్రతపై చేతులెత్తేసిన ఇరాన్!

తమ పౌరుల భద్రతపై ఇరాన్ చేతులెత్తేసిందా? ఎవరి భద్రత వారే చూసుకోవాలని స్పష్టం చేసిందా? ఈ ప్రశ్నలకు ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ గ్రేటర్ టెహ్రాన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ పర్వీజ్ సర్వారీ మంగళవారం చేసిన ఓ ప్రకటన అవుననే సమాధానం చెబుతోంది. "ఈ సంక్షోభ సమయంలో పౌరులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికిప్పుడు సురక్షిత ప్రాంతాలను, కొత్త షెల్టర్లను నిర్మించడం సాధ్యం కాదు. అందుబాటులో ఉన్న వనరులను వాడుకోండి. సబ్‌వేలు, మెట్రో స్టేషన్లను ఆశ్రయించండి" అని ఆయన స్పష్టం చేశారు.

ఇరాన్ బ్యాంకులపై సైబర్ దాడులు!

ఇరాన్‌లోని బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున సైబర్ దాడులు జరుగుతున్నట్లు అరబ్ వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఇరాన్ వార్తాసంస్థ ఫార్స్ న్యూస్ సైతం.. ద బ్యాంక్ ఆఫ్ సెపాపై పెద్ద ఎత్తున సైబర్ దాడి జరిగినట్లు పేర్కొంది. దీంతో.. ఇరాన్ వ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడింది. మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్ వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి.

ఖమేనీ అధికారాలు కౌన్సిల్‌కు

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ తన పరిధిలోని అధికారాలను ఐఆర్‌జీసీ సుప్రీం కౌన్సిల్‌కు బదిలీ చేశారు. దీంతో.. ఇప్పుడు యుద్ధంపై కౌన్సిల్ పూర్తిస్థాయిలో నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ మేరకు 'ఇరాన్ ఇంటర్నేషనల్' ఓ బ్రేకింగ్ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం సుప్రీంలీడర్ బంకర్‌లోనే ఉన్నారని వెల్లడించింది. "ఇకపై యుద్ధ నిర్వహణ కౌన్సిల్ అధీనంలో ఉంటుంది" అని వివరించింది.

ఫోర్డో అణు కేంద్రమే లక్ష్యంగా..



ఫోర్డో అణు కేంద్రం ఉపగ్రహ చిత్రం

శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబును ఇజ్రాయెల్‌కు అమెరికా ఇవ్వనున్నట్టు ప్రచారం

బ్యాంకాక్, జూన్ 17: ఇరాన్ అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా టెల్‌అవీవ్ అక్కడి అణు స్థావరాలపై బాంబుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఇరాన్‌లో కొండ కింద భూగర్భంలో నిర్మించిన ఫోర్డో అణు కేంద్రాన్ని పేల్చేయడం ఇజ్రాయెల్‌కు సాధ్యం కావట్లేదు. దీంతో.. ఆ కేంద్రాన్ని నాశనం చేసే శక్తి ఉన్న జీబీయూ-57 ఏ/బీ బంకర్ బస్టర్ బాంబులను ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అందించనున్నట్టు ప్రచారం సాగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన ఏమీ వెలువడలేదు. సాధారణ క్షిపణులు నేలపై పడగానే పేలిపోయి విధ్వంసం సృష్టిస్తాయి. అయితే బంకర్ బస్టర్ బాంబులు మాత్రం నేలను తొలుచుకుంటూ లోపలకు వెళ్లి భూగర్భంలో పటిష్ఠంగా నిర్మించిన బంకర్లలోకి చొచ్చుకెళ్లిన తర్వాత పేలుతాయి. దీంతో అండర్‌గ్రౌండ్‌లో బంకర్‌లో దాక్కున్న వారంతా క్షణాల్లో ప్రాణాలు కోల్పోతారు. కాగా.. యురేనియంను అధిక స్థాయిలో శుద్ధి చేసే సామర్థ్యం కలిగిన ఫోర్డో అణు కేంద్రాన్ని బ్యాంకర్ బస్టర్ బాంబు ఢీ కొడితే భారీస్థాయిలో రేడియేషన్ విడుదలయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

'ఫోర్డో' ఎందుకంత కీలకం

ఇరాన్ అణు కేంద్రాల్లో నంతాజ్ తర్వాత ఫోర్డోనే అత్యంత కీలకం. టెహ్రాన్‌కు 95 కిలోమీటర్ల దూరంలో కోమ్ నగరానికి సమీపంలోని ఒక పర్వతం కింద అత్యంత రహస్యంగా నిర్మితమైన ఈ కేంద్రం నతాంజ్ అణు శుద్ధి కేంద్రం కంటే చిన్నది. రాతి నేల కింద భూగర్భంలో 260 అడుగుల లోతున దీని నిర్మాణం 2006లో ప్రారంభమైందని చెబుతారు. 2023లో ఈ కేంద్రంలో 83.7 శాతం శుద్ధి చేసిన యురేనియంను ఐఏఈఏ గుర్తించింది. ఇక్కడ 2,700 సెంట్రిఫ్యూజ్‌లు ఉన్నాయని పేర్కొంది. అణుబాంబు తయారీకి అవసరమైన 90 శాతానికి ఇది చాలా చేరువలో ఉండటం ఆందోళనకరంగా మారింది. ఈ క్రమంలోనే.. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నామరూపాల్లేకుండా చేయాలంటే ఫోర్డో కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేయడమే మార్గమని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి.

ఇజ్రాయెల్ ముందున్న ప్రత్యామ్నాయాలివీ..

బంకర్ బస్టర్ బాంబులు ఇవ్వడానికి అమెరికా నిరాకరిస్తే ఏం చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ ముందు కొన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఫోర్డో చుట్టూ ఉన్న విద్యుత్తు ఉత్పత్తి, ప్రసార వ్యవస్థలను ధ్వంసం చేయడం ద్వారా ఈ అణుకేంద్రంలో కార్యకలాపాలను తాత్కాలికంగా అడ్డుకోవచ్చు. భూగర్భంలో ఉన్న ఈ కేంద్రం ప్రవేశ ద్వారాలపై దాడులు చేసి సిబ్బందిని లోపలే చిక్కుకుపోయేలా చేయవచ్చు. అందులోని పరికరాలను నిరుపయోగంగా మార్చవచ్చు. ఇజ్రాయెల్ కమాండోలు సాహసం చేసి లోపలకు చొరబడి బాంబులు అమర్చడం ద్వారా కేంద్రాన్ని నాశనం చేసే అవకాశం కూడా ఉంది.

బంకర్ బస్టర్ బాంబు ప్రత్యేకతలు

- పొడవు - 20 అడుగులు
- బరువు - 30 వేల పౌండ్లు (దాదాపు 13,600 కిలోలు)
- ప్రయోగం - అమెరికాకు చెందిన బీ-2 స్పిరిట్ విమానాల ద్వారా
- ఉపయోగం: భూగర్భంలో లోతుగా నిర్మించిన బంకర్లను ధ్వంసం చేయడం

అణుబాంబు తయారీకి ఇరాన్‌కు మూడేళ్ల సమయం!

అమెరికా ఇంటెలిజెన్స్ నివేదిక.. 3 నెలలే పడుతుందన్న ఇజ్రాయెల్

న్యూఢిల్లీ, జూన్ 17: ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి దిగడానికి కారణమైన 'అణుబాంబు తయారీ' వ్యవహారంపై అమెరికా ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక ఇచ్చింది. ఇరాన్ అణుబాంబు తయారు చేసేందుకు మూడేళ్ల సమయం పడుతుందని.. ఇజ్రాయెల్ చెబుతున్నట్టు మూడు మాసాలు కాదని స్పష్టం చేసింది. కానీ, ఇజ్రాయెల్ మాత్రం కొన్ని మాసాల వ్యవధిలోనే ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తుందని, దాని నుంచి రక్షణ కోసమే తాము యుద్ధానికి దిగామని పేర్కొంది. అయితే.. ఇంటెలిజెన్స్ మాత్రం అణ్వాయుధాల విషయంలో ఇరాన్ ఇప్పటి వరకు చురుగ్గా ఏమీలేదని తెలిపింది. అణ్వాయుధాన్ని తయారు చేసేందుకు ఎంత లేదన్నా ఇరాన్‌కు మూడేళ్ల సమయం పడుతుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని అణు కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరుపుతున్న క్షిపణి దాడుల్లో కీలకమైన నటాంజ్ అణు కేంద్రం ధ్వంసమైనట్టు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఇరాన్‌లోని అత్యంత కీలకమైన అణుకేంద్రం. అదేవిధంగా అణు పరీక్షల కేంద్రం 'ఇస్ఫహాన్'పై కూడా ఇజ్రాయెల్ క్షిపణులు దాడులు చేశాయి. మరో ప్రధాన అణు కేంద్రం ఫోర్డోపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి దాడి జరగలేదు. అయితే, అమెరికా మద్దతు లేకుండా ఇజ్రాయెల్ దీని జోలికి పోయే అవకాశం లేదని రక్షణ రంగ నిపుణులు పేర్కొన్నారు.



అమర జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులకు రూ.50 లక్షల చెక్కు, భూమి, ఇంటి స్థలం పత్రాలను అందజేస్తున్న మంత్రి సవిత

అమర జవాన్ కుటుంబానికి ప్రభుత్వ సాయం

- రూ.50 లక్షల చెక్కు, ఐదెకరాల పొలం, స్థలం పత్రాలు అందజేసిన మంత్రి సవిత

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత అన్నారు. మంగళవారం ఆమె మురళీనాయక్ స్వగ్రామమైన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాలోని మురళీ నాయక్ ఇంటిని సందర్శించారు. తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాములు నాయక్‌ను ఓదార్చారు. అమరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు.. వారికి రూ.50 లక్షల చెక్కు, ఐదెకరాల భూమి, ఇంటి స్థలం పత్రాలను అందజేశారు. అనంతరం వీరజవాన్ ఘాట్‌వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. మురళీ నాయక్ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయారన్నారు. ఆ కుటుంబానికి ఏ కష్టమొచ్చినా సంప్రదిస్తే వెన్నుదన్నుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కళ్లి తండా నుంచి జవాన్ ఘాట్ వరకు రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, జవాన్ స్మారకార్థం ఘాట్ నిర్మిస్తామని తెలిపారు. గోరంట్ల, పుట్టపర్తిలో మురళీనాయక్ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కళ్లి తండా పేరును మురళీ నాయక్ తండాగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరజవాన్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలిపారు.

జువైనెల్ హోంకు తరలిస్తుండగా పరారీ

- విజయవాడలో తప్పించుకున్న ఇద్దరు బాల నేరస్థులు

బాపట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీ కేసులో బాపట్ల టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇద్దరు మైనర్లను మంగళవారం విజయవాడలోని జువైనెల్ హోంకు తరలిస్తుండగా పరారవడం సంచలనం రేపింది. బైక్ దొంగతనాల కేసులో ఇద్దరు బాల నేరస్థులను సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టగా, విజయవాడలోని జువైనెల్ హోంకు తరలించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారిని హోంకు తరలిస్తుండగా విజయవాడ బస్‌స్టేషన్‌లో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో సమగ్ర విచారణకు ఆదేశించడంతో పాటు ఎస్కార్ట్‌గా వెళ్లిన పోలీసుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించినట్టు సమాచారం. తప్పించుకున్న మైనర్ల కోసం రెండు పోలీసు బృందాలతో గాలిస్తున్నారు.

కొత్త వైద్య కాలేజీలకు వైసీపీ శాపం!

(మొదటి పేజీ తరువాయి)

వసతులు, సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇప్పుడు అనేక సమస్యలు చుట్టుముట్టాయి. వైసీపీ మరో ఏడాదిలో అధికారం కోల్పోతుందనగా హడావుడిగా 5 మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) నుంచి అనుమతులు తీసుకువచ్చారు. అయితే.. ఈ అనుమతులు ఇచ్చేందుకు ఎన్‌ఎంసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మెడికల్ కాలేజీలకు అవసరమైన భవనాలు నిర్మించలేదని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు లేవని పేర్కొంటూ తొలుత ఆయా కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు. అయితే, అప్పటి జగన్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చింది. అలా అనుమతులు తెచ్చుకునే సమయంలో.. ఆయా కాలేజీలకు రెండేళ్లలో భవనాలు పూర్తి చేస్తామని, ఫ్యాకల్టీని నియమిస్తామని, క్లినికల్, నాన్ క్లినికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఎంసీ ఆ ఐదు మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లకు కండిషనల్‌గా అనుమతులిచ్చింది. కానీ, ఆ తర్వాత.. ఎన్‌ఎంసీ పెట్టిన కండిషన్లపై వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టలేదు. దీంతో ఆయా కాలేజీలు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టుగా మారాయి. ఆయా



కాలేజీల్లో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టకపోవడం, ఫ్యాకల్టీ అందుబాటులో లేకపోవడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కొరత ఉండడంతో ఎన్‌ఎంసీ అధికారులు తాజాగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఎన్నిసార్లు హెచ్చరించినా కాలేజీల్లో సౌకర్యాల కల్పన చేయడం లేదని, వెంటనే దీనికి సమాధానం చెప్పాలని పేర్కొంటూ ఈ నెల 13న ప్రభుత్వానికి, డీఎంఈకి లేఖలు సంధించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను నిశితంగా ప్రశ్నించారు.

సమయం ఇస్తారా?

ఎన్‌ఎంసీ లేఖ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆరోగ్యశాఖ సెక్రటరీ డాక్టర్ మంజుల, డీఎంఈ డాక్టర్ నరసింహం ఆగమేఘాల మీద ఢిల్లీకి పరుగులు తీశారు. బుధవారం ఢిల్లీలో జరిగే సమావేశంలో పాల్గొని ఐదు కాలేజీల్లో ఇప్పటి వరకు చేసిన పనులు, ఫ్యాకల్టీ నియామకం గురించి వివరించనున్నారు. ఐదు మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, లోపాలను సరిదిద్దేందుకు కొంత సమయం కావాలనీ ఎన్‌ఎంసీకి విన్నవించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే సమావేశంలో ఎన్‌ఎంసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఎన్‌ఎంసీ లేవనెత్తిన లోపాలను సరిదిద్దకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే రెండేళ్ల అడ్మిషన్లు పూర్తి చేశారు. ఇప్పుడు ఐదు మెడికల్ కాలేజీల్లో కలిపి 1,500 మంది ఎంబీబీఎస్ విద్యార్థులున్నారు. ఈ ఏడాది మరో 750 మంది విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరనున్నారు. ఇప్పుడు లోపాలపై ఆగ్రహంతో ఉన్న ఎన్‌ఎంసీ.. ఆయా కాలేజీల్లో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వకపోతే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హామీ ఇచ్చి తప్పించుకున్నారు!

ఏ ప్రభుత్వం అయినా ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం కొత్త మెడికల్ కాలేజీల భవనాలు పూర్తి చేసి, ఫ్యాకల్టీని నియమించి, సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ఆయా కాలేజీలకు అనుమతుల కోసం అభ్యర్థించాలి. కానీ అప్పటి జగన్ ప్రభుత్వం ఫ్యాకల్టీని నియమించకుండా, భవన నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అడ్మిషన్ల ప్రక్రియకు తెరదీసింది. పైగా ఎన్‌ఎంసీ అనేకసార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. అక్కడి అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ అనుమతులు తీసుకువచ్చారు. పైగా తాము ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చి మరీ వచ్చారు. ఎన్‌ఎంసీ అనుమతులు ఇచ్చిన తర్వాత కనీసం ఆ కాలేజీల వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అప్పటి నిర్లక్ష్యం ఇప్పుడు వైద్య విద్యార్థులకు శాపంగా మారింది.

ఇంజనీరింగ్ అఫిలియేషన్లలో జాప్యం

- తనిఖీలు ప్రారంభించని ఉన్నత విద్యాశాఖ
- గతేడాది జూలై 1 నుంచే అడ్మిషన్ల ప్రక్రియ
- ఈ ఏడాది ఆలస్యం.. విద్యార్థుల ఆందోళన

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. గతేడాది ఈ సమయానికి దాదాపుగా అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తికాగా, ఈ సంవత్సరం ఇంతవరకు ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసింది. దీనికి అనుగుణంగా ఉన్నత విద్యాశాఖ కాలేజీల్లో సీట్ల భర్తీకి అనుమతులు ఇవ్వాలి. మరోవైపు కాలేజీల్లో తనిఖీలు చేపట్టి అఫిలియేషన్లు రెన్యువల్ చేయాలి. ఈ ఏడాది ఇప్పటికీ తనిఖీలు ప్రారంభించకపోవడంతో అడ్మిషన్లలో జాప్యం జరుగుతుందని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గతేడాది జూలై 1 నుంచి రాష్ట్రంలో తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ సంవత్సరం ఇంకా అఫిలియేషన్ల ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమయ్యే అవకాశం నెలకొంది. కాలేజీల తనిఖీలకు ఒక్కో కాలేజీకి ముగ్గురు చొప్పున అధికారులు కావాలి. రాష్ట్రంలో 287 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. అన్ని కాలేజీల్లో తనిఖీలకు నెలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలో అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తయింది. దీంతో ఏపీ విద్యార్థుల్లో కొందరు తెలంగాణలో చదివేందుకు మొగ్గు చూపుతారేమోనని కాలేజీలు ఆందోళన చెందుతున్నాయి. గతేడాది కొత్త ప్రభుత్వం వచ్చాక జూలైలోనే అడ్మిషన్ల ప్రక్రియ ముగించింది. దీంతో 20 వేల వరకు అడ్మిషన్లు పెరిగాయి. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పెరుగుతాయనే అంచనా ఉంది. కానీ, అఫిలియేషన్లలో జాప్యం అడ్మిషన్లపై ప్రభావం చూపుతుందేమోనని కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ పేరుతో దోపిడీ

పలు ప్రైవేటు కాలేజీలు రిజిస్ట్రేషన్ పేరుతో దోపిడీ చేస్తున్నాయి. 'మీ కోసం సీటు నిలిపి ఉంచుతా'మంటూ చేస్తామంటూ విద్యార్థుల నుంచి రూ.10 నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నాయి. కన్వీనర్ కోటాలో కోరుకున్న సీటు వస్తుందో రాదోనన్న అనుమానం ఉన్నవారు కొన్ని కాలేజీలకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తున్నారు. ఒకవేళ కన్వీనర్ కోటాలో మంచి సీటు లభిస్తే ఆ రిజిస్ట్రేషన్ డబ్బులు పోయినట్లే. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు తీసుకున్నా చేరిన కాలేజీ తప్ప మిగిలిన కాలేజీల్లో కట్టిన రిజిస్ట్రేషన్ రుసుము వెనక్కి ఇవ్వరు. దీంతో విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంది.


అనంతపురం జిల్లా గుంతకల్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన లబ్ధిదారు ఆదిలక్ష్మి తదితరులు

ఫైనాన్స్ కంపెనీలకు 'వందనం'

- బ్యాంకు ఖాతాల్లోంచి 'ఆటోమేటిక్'గా పోతున్న నగదు
- బజాజ్ ఫైనాన్స్‌పై పోలీసులకు లబ్ధిదారుల ఫిర్యాదు

గుంతకల్లు టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చిన్నారుల చదువుల కోసం తల్లుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తున్న 'తల్లికి వందనం' సొమ్ము 'ఆటోమేటిక్'గా ఫైనాన్స్ కంపెనీలకు వెళ్లిపోతోంది. దీంతో అనంతపురం జిల్లా గుంతకల్లులో మంగళవారం పలువురు మహిళలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బజాజ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి గతంలో టీవీ, ఫ్రిడ్జ్ తదితర వస్తువులు కొనుగోలు చేశామని, వాటికి నెలనెలా ఈఎంఐలు చెల్లించినా.. ఇంకా డబ్బులు కట్ చేస్తున్నారని దుర్గ, ఆదిలక్ష్మి, ముంతాజ్ బేగం తదితరులు చెప్పారు. ఓ మహిళ టీవీ కొనుగోలు చేసి, ఈఎంఐలు కట్టకపోవడంతో రెండేళ్ల కిందటే ఆ టీవీని కంపెనీ ప్రతినిధులు తీసుకుపోయారని.. అయినా డబ్బులు కట్ చేస్తున్నారని చెప్పారు. చదువు రాని వారికి వస్తువులు ఇచ్చి, రుణాల పేరుతో ఏళ్ల తరబడి డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. బాకీ తీరినా.. రుణాన్ని క్లోజ్ చేయడం లేదన్నారు. తల్లికి వందనం డబ్బులను తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మంది అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మందిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి మ్యూల్ బ్యాంకు అకౌంట్లను సరఫరా చేస్తున్న అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఒకరిని ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతన్ని విచారించగా బెంగళూరులోని బిలేకహళ్లిలో డెన్ నిర్వహిస్తున్నట్టు తెలిపాడు. సాంకేతికతను వినియోగించి డెన్‌పై సైబర్‌క్రైం పోలీసులు దాడి చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 45 సెల్ ఫోన్లు, 130 బ్యాంకు పాస్‌బుక్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, 33 ఏటీఎం కార్డులు, రెండు కౌంటింగ్ మెషీన్లను సీజ్ చేశారు. వీరంతా పలు రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. పరిచయాలు పెంచుకుని మ్యూల్ అకౌంట్లను సేకరించి వారిని బెట్టింగ్ కార్యకలాపాలకు వినియోగిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారు. వీరంతా బృందాలుగా ఏర్పడి.. రెడ్డి అన్నా 462, బెట్ భాయ్ బుక్ 52 పేరుతో వెబ్‌సైట్స్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు, రూ.25 వేలు జరిమానా

- కర్నూలు పోక్సో కోర్టు తీర్పు

కర్నూలు లీగల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యాచారం కేసులో కర్నూలు జిల్లా పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. నంద్యాల జిల్లా వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బాలికను గర్భవతిని చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు మంగళవారం తీర్పు చెప్పారు. వెలుగోడు పోలీసుల చార్జ్‌షీటు మేరకు మండల పరిధిలోని ఓ గ్రామంలో బాధితురాలు 9వ తరగతి చదువుకునేది. ఆమె తండ్రి మృతి చెందడంతో తల్లి కూలి పనికి వెళ్లేది. 2022 జూలై 14వ తేదీన బాధితురాలు తనకు కడుపు నొప్పి వస్తోందని తల్లికి చెప్పడంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆరునెలల గర్భవతి అని తెలపడంతో చికిత్స చేయించుకోకుండానే గ్రామానికి వెనుదిరిగారు. గ్రామానికి వచ్చిన తర్వాత తల్లి బాలికను నిలదీయడంతో అదే వీధిలో ఉండే తెలుగు గంగాధర్ తనకు మాయమాటలు చెప్పి లోబర్చుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో పలుమార్లు అత్యాచారం చేశాడని వాపోయింది. దీంతో బాధితురాలి తల్లి వెలుగోడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఆత్మకూరు ఇన్‌చార్జి డీఎస్పీ సిమహేశ్వరరెడ్డి పోక్సో కేసు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితురాలికి ఒక మగశిశువు పుట్టి మృతి చెందాడు. శిశువు రక్త నమూనాలు సేకరించిన పోలీసులు డీఎన్‌ఏ టెస్టుకు పంపించారు. ఆ నమూనాలు నిందితుడి డీఎన్‌ఏతో సరిపోయాయని పోలీసులు కోర్టుకు నివేదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. అదే విధంగా రూ.25 వేలు బాధితురాలికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది.

రైతుకు పెరిగిన రుణ పరపతి

- 2025-26లో పంటల సాగుకు వర్తింపు
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేసిన ఎస్‌ఎల్‌టీసీ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు రుణ పరపతి సౌకర్యం పెరిగింది. 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగుకు రుణ పరిమితిని బ్యాంకర్ల కమిటీ పెంచింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు, పట్టు, పాడి పశువులు, కోళ్లు, చేపలు, రొయ్యల పెంపకానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ని స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ ఖరారు చేసింది. దీని ప్రకారం గతేడాది కన్నా ఈ ఏడాది ఎకరానికి ఎర్ర మిర్చి సాగుకు రూ.35-50వేలు, పచ్చి మిర్చికి రూ.10వేలు ఖరారు చేశారు. వరికి రూ.ఐదారువేలు, పత్తికి రూ.నాలుగైదు వేలు పెరిగింది. ఖరీఫ్ వరికి రూ.46-52వేలు, రబీలో రూ.50-55వేలు, శ్రీవరికి రూ.35-40వేల చొప్పున బ్యాంకులు రుణాలివ్వనున్నాయి. పత్తికి ఇరిగేషన్ ఏరియాలో రూ.48-55వేలు, వర్షాధార ప్రాంతాల్లో రూ.46-51వేలు, పచ్చిమిర్చికి రూ.లక్ష నుంచి రూ.లక్షా10వేలు, ఎర్రమిర్చికి రూ.రూ.1.50లక్షల నుంచి రూ.1.75లక్షలకు రుణ పరిమితి పెంచారు. గతేడాది కన్నా వర్జీనియా పొగాకుకు రూ.10వేలు, చెరకుకు రూ.5వేలు పెంచారు. కందికి రూ.6వేలు, మినుముకు రూ.6-8వేలు, పెసరకు రూ.2వేలు, శనగకు రూ.3వేలు, సన్‌ఫ్లవర్‌కు రూ.5వేలు, వేరుశనగకు రూ.3వేలు, ఆయిల్‌పామ్‌కు రూ.5వేలు పెంచారు. అరటికి రూ.6-10వేలు, మామిడి సహా ఉద్యాన తోటలకు రూ.3-5వేలు పెంచారు. చేపల పెంపకానికి 30వేలు, రొయ్యలకు 34-36వేలు, పట్టుసాగుకు 15వేలు, బాయిలర్ కోడికి 10-20, లేయర్ కోడికి 20 పెంచారు.

ఊపందుకున్న రాయితీ విత్తన పంపిణీ

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు కోసం రైతులకు రాయితీపై వరి, వేరుశనగ, పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ ఊపందుకుంది. ఈ సీజన్‌లో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వేరుశనగ సాగుకు 45,449 క్వింటాళ్లను వ్యవసాయ శాఖ పంపిణీ చేసింది. కోస్తా ప్రాంత అన్నదాతలకు 15,560 క్వింటాళ్ల వరి వంగడాలను పంపిణీ చేశారు. తొలకరిలో సాగుకు పచ్చి రొట్ట విత్తనాలు 22,139క్వింటాళ్లు పంపిణీ చేశారు. జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాల మిశ్రమాన్ని మినీకిట్స్‌గా రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

తోతాపురిని దశలవారీగా అమ్మండి: ఉద్యాన శాఖ డైరెక్టర్

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రమ వృధా కాకుండా తోతాపురి మామిడిని కొనుగోలు చేస్తామని ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు చెప్పారు. తోతాపురి కిలోకు రూ.12 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, ఇందులో రూ.4ను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలనే కోయాలని రైతులకు సూచించారు. కోతకు ముందు ఉద్యాన అధికారుల సూచనలు తీసుకుని, విడతల వారీగా ప్రాసెసింగ్ యూనిట్లు, మండీల వద్దకు తీసుకెళ్లాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోకో గింజల ధరను మనమే నిర్ణయించాలి

- కోకో రైతు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు



కోకో రైతుల సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మనం పండించిన పంటకు మనమే ధర నిర్ణయించే స్థాయికి కోకో రైతులు సంఘటితం కావాలని కోకో రైతు సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కోకో గింజలు ప్రాసెస్ చేస్తే.. మార్కెట్టే మన కాళ్ల దగ్గరకు వస్తుందన్నారు. రాష్ట్ర నాయకులు బల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, సూర్యనారాయణ, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విధుల్లోకి ఐఎన్ఎస్ 'అర్నాల'

విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో జలప్రవేశం



విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. సముద్ర గస్తీ, అన్వేషణ, సహాయ కార్యక్రమాలకు ఉపయోగించేలా రూపొందించిన తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యు-ఎస్‌డబ్ల్యుసీ) ఐఎన్ఎస్ 'అర్నాల' బుధవారం జలప్రవేశం చేయనుంది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అధ్యక్షత వహిస్తుండగా, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ఆతిథ్యం ఇస్తున్నారు. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ డిజైన్ చేసి తయారు చేసింది. పీపీపీలో భాగంగా ఎల్ అండ్ టీ షిప్ బిల్డర్స్ దీనికి సహకారం అందించింది. ఈ తరహా నౌకలు మొత్తం 16 తయారు చేయాలని నేవీ నిర్ణయించింది. అందులో అర్నాల మొదటిది. మహారాష్ట్రలోని చారిత్రాత్మక అర్నాల కోటకు గుర్తుగా దీనికి ఈ పేరు పెట్టారు. గత నెల 8న దీన్ని నేవీ చేతికి అందించగా.. విశాఖలో బుధవారం జలప్రవేశం చేయిస్తున్నారు. అర్నాల 77.6 మీటర్ల పొడవు, 1,490 టన్నుల బరువు ఉంటుంది.

'పల్నాడు'లో ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్య

- ఒకే రోజు అప్పులకు బలి
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఉన్నతాధికారులు


నాసం ఆదినారాయణ, సిరిబోయిన గోపాలరావు, బండి కొండయ్య

నాదెండ్ల/ఈపూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నష్టాలతో అప్పుల పాలైన ముగ్గురు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లాలో మంగళవారం జరిగింది. నాదెండ్ల మండలం నాదెండ్ల గ్రామంలోని రామాపురం కాలనీకి చెందిన నాసం ఆదినారాయణ(45) ఏడు సంవత్సరాలుగా తన ఎకరన్నరతో పాటు సుమారు 50కి పైగా ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి, శనగ తదితర పంటలు సాగు చేస్తున్నాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పోవటంతో పాటు పైర్లు తెగుళ్ల బారిన పడటం, గిట్టుబాటు ధర లేక పోవటంతో సుమారు రూ70 లక్షల అప్పులపాలయ్యాడు. రుణదాతలు ఇంటికి వచ్చి ఒత్తిడి చేయటంతో తట్టుకోలేక గ్రామ సమీపంలోని పొలాల్లో సోమవారం రాత్రి పురుగు మందు తాగాడు. మంగళవారం ఉదయం ఆదినారాయణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అదే విధంగా మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు(44) తన 30 సెంట్లతో పాటు సుమారు 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది మిర్చి పైరుకు తెగుళ్ల సోకటంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. పొగాకు పండించినా కొనే వారు లేక పోవటంతో నిల్వ చేసి పట్టాలు కప్పాడు. సుమారు రూ.20 లక్షల మేర అప్పులపాలయ్యాడు. సోమవారం సాయంత్రం తన ట్రాక్టర్‌ను అప్పు ఇచ్చిన వారు తీసుకెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఇంటికి సమీపంలోని డొంక వద్దకు వెళ్లి పురుగు మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ పుల్లారావు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతులు గోపాలరావు, ఆదినారాయణ కుటుంబాలను వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.డిల్లీరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. రైతుల ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయాలకు నివాళులర్పించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరుగుతుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కాగా.. ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బండి కొండయ్య (52) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మూడు ఎకరాల్లో మిర్చి, ఎకరన్నరలో వరి, అర ఎకరంలో పొగాకు సాగు చేశాడు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాక, అప్పులు రూ.4 లక్షలు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది కౌలుకు తీసుకున్న పొలంలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని చిన్న కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఆయిల్, గ్యాస్ కోసం అన్వేషణ

గుంటూరు జిల్లాలో ఓఎన్‌జీసీ భారీగా డ్రిల్లింగ్
వట్టిచెరుకూరు, ఫిరంగిపురంలో పెద్దఎత్తున శోధన

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) గుంటూరు జిల్లాలో ఇంధన, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ చేస్తోంది. దీనికోసం జిల్లాలోని పలు మండలాల్లో సర్వే చేపట్టింది. కొన్ని రోజులుగా పొలాల్లో యంత్రాలతో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనులు చేపడుతోంది. ఇంధన, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో భాగంగానే తాము ఈ పనులు చేపడుతున్నామని ఆ సంస్థ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, వట్టిచెరుకూరు మండలంలోని పల్లపాడు తదితర గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఈ అన్వేషణ జరుగుతున్నది. అన్వేషణలో భాగంగా ఏకంగా 24 వేల బోర్లు వేసి ఆయిల్, గ్యాస్ నిక్షేపాల ఉనికి ఉందో, లేదో తేల్చేందుకు ముమ్మరంగా డ్రిల్లింగ్ పనులు చేస్తున్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగానే ఈ బోర్లు వేస్తున్నారు. ఈ సర్వే కోసం మొత్తం రూ. 13.44 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తడ నుంచి ఇచ్ఛాపురం వరకు జోన్లుగా విభజించి అన్వేషణ సాగిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఓఎన్‌జీసీ నిర్ణయించింది. అందులో భాగంగా ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను గుర్తించి గ్యాస్ పంపిణీ సామర్థ్యాన్ని పెంచేందుకు మినీ లిక్విఫయింగ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అమెరికా చరిత్రలో కనీవినీ ఎరుగనంతమంది అక్రమవలసదారులను దేశంనుంచి వెళ్ళగొడతానని ఎన్నికలప్రచారంలో తన ఓటర్లకు హామీ ఇచ్చారు డోనాల్డ్ ట్రంప్. అందుకు అనుగుణంగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు, తీసుకుంటున్న నిర్ణయాలు అత్యంత వివాదాస్పదమవుతున్నాయి. ఒకవైపు కవాతు, మరోవైపు అణచివేత, మధ్యలో పుట్టినరోజు అంటూ ఒక పత్రిక మొన్న శనివారం నాడు అమెరికాలో నెలకొన్న పరిస్థితిని చక్కగా అభివర్ణించింది. ఆర్మీ 250వ వార్షికోత్సవం, ట్రంప్ పుట్టినరోజు కూడా ఆనాడే కావడంతో అమెరికా వ్యాప్తంగా భారీ నిరసనలతో 'నో కింగ్స్' ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకుపోవాలని నిరసనకారులు నిర్ణయించడంతో, ఊహించినట్టుగానే ప్రదర్శనలు హింసాయుతంగా మారాయి. యాభై రాష్ట్రాల్లోని రెండువేల పైచిలుకు ప్రాంతాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో లక్షలాది మంది పాల్గొన్నారు. వీధులు, పార్కులు, బహిరంగస్థలాలు అన్ని చోట్లా జనం నిండిపోయారని, మహానగరాల నుంచి చిన్నపట్టణాల వరకూ జనం ర్యాలీలు నిర్వహించి, అద్భుతమైన నినాదాలతో ట్రంప్ నిరంకుశత్వాన్ని చీల్చిచెండాడారని వార్తలు వచ్చాయి. నిరంకుశత్వం కూడదన్న హెచ్చరికతో పాటు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటామని, తమ వలసహక్కులను కాపాడుకుంటామని వారంతా ప్రతిజ్ఞలు చేశారు. ఆ ఒక్కరోజే ఒక కోటి ఇరవైలక్షల మంది నిరసనల్లో పాల్గొనడంతో ట్రంప్ దిగొచ్చేవరకూ ఈ తరహా ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని నో కింగ్స్ కొయిలిషన్ నిర్వాహకులు ఉత్సాహంగా ప్రకటించారు. ట్రంప్ సహజంగానే ఈ తిరుగుబాటును సహించలేకపోయారు. తలెగరేసిన వారినందరినీ కటకటాల్లోకి తోసేయాలనీ, ట్రంప్ మస్ట్ గో అన్న ప్రతీ వ్యక్తినీ దేశం నుంచి గెంటేయాలని ఆయన సంకల్పించారు.

వలసలపై కక్ష

ఈ భారీ నిరసన ప్రదర్శన జరిగిన మర్నాడే అమెరికా అధ్యక్షుడు తన ఇమ్మిగ్రేషన్ అధికారులకు విస్పష్టమైన ఆదేశాలు జారీచేస్తూ, విపక్షం మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. రోడ్లమీదకు వచ్చి, తనకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన, తన విధానాలను ప్రశ్నించినవారంతా డెమొక్రాటిక్ పార్టీ ఓటర్లనీ, కోట్లాదిమంది అక్రమవలసదారులను వెనకేసుకొస్తూ ఆ పార్టీ అమెరికా రాజకీయాల్లో బతుకునెట్టుకొస్తోందని ట్రంప్ విమర్శించారు. నికార్సయిన అమెరికన్ల కష్టార్జితాన్ని కొల్లగొడుతూ, శ్రమకు వెరవని అమెరికన్ల ఉద్యోగాలను తన్నుకుపోతూ, ప్రభుత్వ సంక్షేమ నిధులను పూర్తిగా స్వాహాచేస్తున్న విదేశీశక్తులంటూ తీవ్రంగా శపించారాయన. వారిని ఏరివేస్తున్నందుకు, అమెరికాను ఇమ్మిగ్రేషన్ అధికారులు జల్లెడపడుతున్నందుకు అసలు సిసలు అమెరికన్లు ఆనందిస్తున్నారని, జేజేలు పలుకుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

తదనుగుణంగా ఆయన ఇప్పుడు డెమొక్రాట్ల ఏలుబడిలో ఉన్న న్యూయార్క్ తదితర నగరాల నుంచి అక్రమవలసదారుల ఏరివేతకు అగ్రప్రాధాన్యం ప్రకటించారు. ఇమ్మిగ్రేషన్ అధికారులకు కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్ ఏంజెలెస్ నగరంలో ఈ మధ్యన ఎదురైన ప్రతిఘటన వలసదారులకు ఒక కొత్త ఉత్తేజాన్నిస్తే, ట్రంప్‌కు ఆయుధంగా ఉపకరించిన విషయం తెలిసిందే. ఆరున్నర దశాబ్దాల తరువాత ఆ రాష్ట్రం అనుమతి లేకుండా కేంద్ర బలగాలను అక్కడకు పంపి, డెమొక్రాటిక్ పార్టీని ఆయన రెచ్చగొట్టారు. ఆ నిర్ణయాన్ని ప్రశ్నించిన గవర్నర్‌ను జైల్లోకి నెడతానని, నిధులు ఆపేస్తానని హెచ్చరించారు. కాలిఫోర్నియా నుంచి ఫెడరల్ గవర్నమెంట్‌కు వెళ్ళే నిధులను నేను ఆపేస్తానంటూ ఆ రాష్ట్ర గవర్నర్ దీటుగా సమాధానం ఇచ్చారు. ఈ అత్యంత ధనిక రాష్ట్రంలో వలసలు కూడా అధికంగానే ఉండటంతో అధ్యక్షుడికీ విపక్షాలకూ మధ్య యుద్ధానికి ఇది కేంద్రస్థానమైంది. అత్యాధునిక ఆయుధాలతో ఫెడరల్ సైన్యాలు లాస్ ఏంజెలెస్ నగరంలో తిరుగుతున్న దృశ్యాలను దేశమంతటా చూడాలని ట్రంప్ కోరిక. విదేశీ చొరబాటుశక్తుల నుంచి తన ప్రజలను కాపాడటానికి న్యాయస్థానాల్లో పోరాడుతానని, ఎన్ని చట్టాలనైనా ఉల్లంఘిస్తానని ఆయన ప్రకటిస్తున్నారు. పూర్వ అధ్యక్షులు ఎన్నడూ వాడని చట్టాలను సైతం వెలికితీసి తన రాజకీయ ప్రయోజనాల కోసం అస్త్రాలుగా మలచడంలో ఆయనకు ఆయనే సాటి. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు ఇత్యాది విలువలమీద నమ్మకం లేదు కనుక, అక్రమవలసదారుల ఏరివేత కార్యక్రమాన్ని ఎంత నిరంకుశంగానైనా అమలు చేయగలడు. ఎంతమందిని ఏరివేశామన్న కంటే, ఆ ప్రక్రియ తన ఓటుబ్యాంకును ఎంత పెంచిందనేది ఆయనకు ముఖ్యం.

దేశ ప్రగతిలో 'నల్ల బంగారం'

ప్రస్తుతం మన దేశ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 1,395 యూనిట్లు మాత్రమే. ఇది ప్రపంచ సగటు విద్యుత్ వినియోగం కంటే చాలా తక్కువ. యూఎస్‌ఏ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 12,497 యూనిట్లు. చైనా సగటు తలసరి విద్యుత్ వినియోగం 6,150 యూనిట్లు. మన దేశ తలసరి విద్యుత్ వినియోగం కంటే ఖతార్, కువైట్, సౌదీ అరేబియా దేశాల తలసరి విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ. దేశ ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం తలసరి విద్యుత్ వినియోగాన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఉంది.

2024–25 ఆర్థిక సంవత్సరంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత దేశం విశేష పురోగతి సాధించింది. గత ఏడాది దేశం 29.52 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంది. దీంతో మొత్తం సామర్థ్యం 220.10 గిగావాట్లకు పెరిగింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2030 నాటికి మన దేశం శిలాజేతర ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు పెంచుకోవాలనే లక్ష్యంతో ముందుకుపోతోంది.



అంతర్జాతీయంగా ఈ ప్రయత్నాలు ఎన్నో ప్రశంసలు పొందుతున్నప్పటికీ భారతదేశ ఇంధన రంగంలో బొగ్గు రంగం పాత్ర మరువలేనిది. ఈ ఏడాది మార్చి 31 నాటికి భారతదేశ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 483.26 గిగావాట్లు. ఇందులో బొగ్గు ఆధారిత విద్యుత్ స్థాపిత సామర్థ్యం 210 గిగావాట్లు. భారతదేశం తన ఇంధన మిశ్రమంలో దాదాపు 55 శాతం బొగ్గుపై ఆధారపడి ఉంది. దేశంలోని విద్యుత్తులో దాదాపు 74 శాతం బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఓ కీలక మైలురాయిని అధిగమించింది. మోదీ క్రియాశీల నాయకత్వంలో బొగ్గు రంగంలో స్వావలంబన వైపు కదులుతూ ఇంధన భద్రత, ఆర్థికవృద్ధి సాధించేలా భారతదేశం అడుగులు వేస్తోంది. కేంద్రం తెచ్చిన సంస్కరణలు, విధానాల ఫలితంగా రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగింది. వీటిలో గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టానికి సవరణలు, బొగ్గు గనుల చట్టం, CMSP చట్టం–2015 ద్వారా బొగ్గు బ్లాకుల వాణిజ్య వేలాన్ని, బొగ్గు రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు తెరవడం, సింగిల్ విండో వ్యవస్థ, స్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్‌తో కూడిన అత్యాధునిక సాంకేతికతలు, సమర్థవంతమైన పద్ధతులు బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో భారతదేశం క్రిటికల్ మినరల్స్ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, కీలకమైన ఖనిజాల రంగంలో ముఖ్య పాత్ర పోషించడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకుంటోంది.

భారతదేశం 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఓ కీలక మైలురాయిని అధిగమించింది. మోదీ క్రియాశీల నాయకత్వంలో బొగ్గు రంగంలో స్వావలంబన వైపు కదులుతూ ఇంధన భద్రత, ఆర్థికవృద్ధి సాధించేలా భారతదేశం అడుగులు వేస్తోంది.

చైనా తర్వాత రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు భారత్. ఇండోనేసియా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హై గ్రేడ్ బొగ్గును కూడా దిగుమతి చేసుకుంటోంది. దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల 2024 ఏప్రిల్, డిసెంబర్ మధ్య భారతదేశ బొగ్గు దిగుమతులు 8.4 శాతం తగ్గాయి. ఫలితంగా గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 5.43 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని దేశం ఆదా చేసింది. ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ మార్పులను తగ్గించడం కోసం బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి రూ.8,500 కోట్ల వ్యయంతో సమగ్ర పథకానికి ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో మార్గం సుగమమైంది. 'బొగ్గు నుంచి SNG, నైట్రేట్ ప్రాజెక్టులను స్థాపించడానికి ఈక్విటీ పెట్టుబడుల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. భారతదేశం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని, ముఖ్యంగా సౌర, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగినప్పటికీ, వాటి ఉత్పత్తి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఒడిదొడుకులకు గురవుతూ ఉంటుంది. ఎల్లవేళలా స్థిరమైన ఉత్పాదకతను సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు కలిగి ఉండకపోవడంతో గ్రిడ్ నిర్వహణలో సవాళ్లు తప్పవు. ఈ నేపథ్యంలో ఎల్లవేళలా నాణ్యమైన థర్మల్ విద్యుదుత్పత్తి కోసం బొగ్గు ఎంతో కీలకంగా మారింది.

2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత్ భారత్ @ 2047' లక్ష్యంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2021 నవంబర్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి 'ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (COP-26)లో భారతదేశం 2070 నాటికి కర్బన ఉద్గారాలను నికరంగా సున్నా (నెట్ జీరో) స్థాయికి తగ్గించాలని లక్ష్యంగా ప్రకటించింది. ఇక్కడ నెట్ జీరో అంటే బొగ్గు వాడకాన్ని జీరో చేయడం కాదు. పరిశ్రమల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి కర్బన ఉద్గారాలను సాధ్యమైనంతగా తగ్గించడంతో పాటు అడవుల విస్తీర్ణాన్ని పెంచి రెండింటి మధ్య సమతుల్యతను సాధించడం. మనదేశ పురోగతికి బొగ్గు దశాబ్దాల తరబడి ఇంధనాన్ని అందిస్తోంది. లక్షలాది గృహాలకు శక్తిని అందించింది. ఉపయోగకరమైన ఆర్థిక కార్యకలాపాలను ఉత్పత్తి చేసింది. వాతావరణ మార్పు, వాయు కాలుష్యంపై స్థిరమైన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించినప్పటికీ, రాబోయే రోజుల్లో బొగ్గు రంగం, సవాళ్లను ఎదుర్కొంటూనే భారతదేశ ఇంధన రంగానికి ప్రధాన దిక్సూచిగా నిలవనుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.



● ప్రసన్నకుమార్ మోటుపల్లి
సీఎండీ, ఎన్ఎల్‌సీ ఇండియా, బొగ్గు మంత్రిత్వ శాఖ

ఇంటా బయటా నాయకత్వ శూన్యతే!



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ శూన్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అణు కార్యక్రమాన్ని చేపడుతోందన్న పేరుతో ఇరాన్‌పై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ దుస్సాహసానికి అడ్డుకట్ట వేసేవారు కనపడడం లేదు. ఇజ్రాయెల్ చెబుతున్నట్లు అమెరికా వింటోందా, లేక అమెరికా చెప్పినట్లు ఇజ్రాయెల్ నడుచుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇజ్రాయెల్‌లో పదవి కోల్పోయే పరిస్థితిలో ఉన్న సమయంలో హమాస్‌పై దాడులు చేసి తన రాజకీయ అధికారాన్ని నిలుపుకున్న నెతన్యాహు ఇప్పుడు తన మనుగడకోసం ఇరాన్‌లో విధ్వంసానికి పూనుకుంటున్నాడు. గతంలో ఇజ్రాయెల్ ఇలాంటి దాడులకు పాల్పడినప్పుడు అమెరికా అడ్డుకట్ట వేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పే మాటలు వినేవారెవరూ కనపడడం లేదు. ఐక్యరాజ్య సమితి ఒక నామమాత్ర సంస్థగా మారిపోయింది.

నిజానికి ప్రపంచంలో అనేక దేశాలు అణ్వస్త్ర తయారీ కార్యక్రమాలను చేపట్టినప్పుడు ఏ దేశమూ మరో దేశాన్ని ఆపలేకపోయింది. ప్రస్తుత విదేశాంగమంత్రి జైశంకర్ తండ్రి, జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా ఉన్న రక్షణ వ్యూహ నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం సలహా మేరకు భారతదేశం అణు పరీక్షలు చేపట్టిన తర్వాతే ఒక బలమైన దేశంగా రూపొందింది. అణ్వస్త్ర దేశాల శ్రేణిలో చేరినప్పుడే భారత్ ఒక బలమైన శక్తిగా మారుతుందని దీనివల్ల మనం ప్రత్యర్థులను నిలువరించగలుగుతామని సుబ్రహ్మణ్యం ఇచ్చిన సలహా అత్యంత విలువైనది. పలు దేశాలు అణు శక్తులుగా మారినప్పుడే ఒక సమతుల్యత ఏర్పడుతుందన్న అభిప్రాయానికి అన్ని దేశాలూ వచ్చాయి. అయితే ఇరాన్ అణ్వస్త్ర తయారీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ఆ దేశంలో రక్తపాతానికి పూనుకున్నది. ప్రపంచంలో ఏ దేశమూ ఇజ్రాయెల్‌ను ఆపలేని పరిస్థితిలో ఉన్నది. ఈ యుద్ధం ఎన్నాళ్లు కొనసాగుతుందో. ఇది ఏ పర్యవసానాలకు దారితీస్తుందో చెప్పలేము. రష్యా, చైనా, ఇస్లామిక్ దేశాల కదలికలను కూడా ప్రపంచం ఆసక్తితో గమనిస్తోంది. అమెరికా ఈ యుద్ధ నివారణలో విఫలమైతే ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ పాత్రను పూర్తిగా కోల్పోక తప్పదు.

ఈ వ్యవహారంలో భారతదేశం ప్రేక్షక పాత్ర వహించక తప్పడం లేదు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇజ్రాయెల్‌తో స్నేహం చేస్తూనే పాలస్తీనా ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నించారు. పాలస్తీనా విమోచనోద్యమనేత అరాఫత్‌ను భారత్‌కు ఆహ్వానించారు. మన విలువలకు, ప్రయోజనాలకు మధ్య ఐక్యత సాధించినప్పుడే మన విదేశాంగ విధానం విజయవంతమవుతుంది. ఇజ్రాయెల్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేసినంత మాత్రాన ఆ దేశ పద్ధతులను మనం సమర్థించాలని ఎక్కడా లేదు. ప్రధాని మోదీ ప్రభావదాయక దేశాలతో స్నేహం చేసి భారత్‌ను ఒక అగ్రగామి శక్తిగా మార్చేందుకు శాయశక్తులా కృషి చేశారు. ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్ణాయక శక్తిగా మారేందుకు మనకు ఎన్నో అవకాశాలున్నాయి. 140 కోట్ల మంది వినియోగదారులతో బలమైన మార్కెట్ శక్తిగా అవతరించిన భారతదేశం ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్దిష్ట పాత్ర పోషించగల స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉన్నది.

విచిత్రమేమంటే అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత భారత రాజకీయాలు ఎందుకో స్తబ్ధంగా మారినట్లు కనిపిస్తున్నాయి. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనపై బీజేపీ విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించడంతో పార్టీ నేతల ఉత్సాహం నీరుకారినట్లయింది. ఆ తర్వాత మోదీ సైప్రస్‌తో పాటు మూడు దేశాల పర్యటనకు బయలుదేరితే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ యూరప్‌లో ఏదో దేశానికి వ్యక్తిగత పర్యటన నిమిత్తం వెళ్లారు. రాహుల్ పార్టీ అధ్యక్షుడు కాకపోయినా ఆయన లేకపోతే కాంగ్రెస్ పార్టీలో స్తబ్ధత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఆయన సోదరి ప్రియాంకా గాంధీ కేరళలో ఉప ఎన్నికల్లో తలమునకలై ఉన్నారు. భారతీయ జనతా పార్టీలోనూ, కాంగ్రెస్ పార్టీలోనూ చాలా నిర్ణయాలు పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. బీజేపీకి సంబంధించి కొన్ని రాష్ట్రాల అధ్యక్షులతో పాటు జాతీయ అధ్యక్షుడు, పార్టీ ఆఫీసు బేరర్ల నియామకం ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటకలో నామినేటెడ్ ఎమ్మెల్సీలకు అభ్యర్థుల ఎంపిక నుంచి రాష్ట్రాల్లో పార్టీని పటిష్ఠం చేసే కార్యక్రమం కూడా పెండింగ్‌లో పడ్డట్లు కనపడుతోంది. ఈ రెండు జాతీయ పార్టీల ప్రధాన కార్యాలయాల్లో నేతల కదలికలు పెద్దగా లేవు.

ఇదిలావుంటే భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నదని నేతలు చేస్తున్న ప్రకటనలు ఒక ఉత్సాహాన్ని కలుగచేస్తున్నాయి. భారత్ త్వరలో ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైప్రస్‌లో వ్యాపారవేత్తలతో మాట్లాడుతూ ప్రకటించారు. సరిగ్గా నెల రోజుల క్రితం భారతదేశం జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అమెరికా, చైనా, జర్మనీల తర్వాతి స్థానం భారత్‌దే అని ఆయన అన్నారు.

మన దేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారితే అంతకంటే కావల్సింది ఏముంటుంది? నిజంగా 4,186.43 బిలియన్ డాలర్ల జపాన్ జీడీపీతో పోలిస్తే 4,187.03 బిలియన్ డాలర్ల జీడీపీని సాధించిన భారతదేశం ఘనతను కాదనలేము. మరో మూడేళ్లలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి పూర్తిగా వికసిత్ భారత్‌గా భారత్ అవతరిస్తుందనే ప్రకటనలనూ కొట్టిపారేయలేము. గత 11 సంవత్సరాల్లో దేశంలో జరిగిన రహదారులు, రేవులు, విమానాశ్రయాల నిర్మాణం, డిజిటలీకరణ వంటి సాంకేతిక అభివృద్ధి, పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య, ఉత్పాదక, సేవల రంగాల విస్తృతి కూడా చెప్పుకోదగ్గది.

భారతదేశం అనేక రాష్ట్రాల సముదాయం కనుక మన దేశంలో అభివృద్ధి సమానంగా ఉండదు. రాష్ట్రాల రెవిన్యూ వసూళ్లు, స్వంత పన్నుల సేకరణ చెప్పుకోదగ్గ విధంగా లేవు. అయినప్పటికీ జీడీపీ పెరుగుదల 6–7 శాతం మధ్య ఉంటూ వేగంగా పెరుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందింది. కానీ ఈ పెరుగుదల 8–9 శాతం మధ్య ఉన్నప్పుడే మనం లక్ష్యాలకు చేరుకోగలం. అయినా ఒక దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆ జీడీపీ కొలమానమా అన్న ప్రశ్న ఎంతో విలువైనది. ఎందుకంటే జీడీపీకి ప్రజల బాగుగోగులకూ పెద్దగా సంబంధం ఉండదు. కొనుగోలు శక్తి రీత్యా భారత జీడీపీ ఇప్పటికే 15వేల బిలియన్ డాలర్లకు చేరుకుందని నీతి ఆయోగ్ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతగా జరుగుతున్నా, దేశ శ్రామిక జనులలో 76 శాతం మంది వ్యవసాయ రంగంలోనూ, అసంఘటిత రంగంలోనూ దినసరి కూలీలుగా చాలీచాలని వేతనాలతో జీవితం గడుపుతున్న విషయం అందరికీ తెలిసిందే. అందువల్ల ఎవరి కొనుగోలు శక్తిని జీడీపీకి కొలమానంగా తీసుకుంటున్నామన్న విషయం చర్చనీయాంశం. అంతేకాదు, మన దేశంలో ప్రపంచంలో అతిపెద్ద జనాభా రీత్యా మనం చెప్పుకుంటున్న జీడీపీని జనాభా ప్రకారం విభజిస్తే మన తలసరి జీడీపీ శ్రీలంక, భూటాన్, వియత్నాం, కెన్యా, మొరాకో, లిబియా, మారిషస్, దక్షిణాఫ్రికా తదితర దేశాల కంటే తక్కువే ఉన్నదన్న విషయాన్ని కూడా విస్మరించలేం. జీడీపీ రీత్యా భారత్‌ను నాల్గవ అతిపెద్ద దేశంగా పరిగణిస్తే తలసరి జీడీపీ రీత్యా మన దేశం 196 దేశాల్లో 127వ స్థానంలో ఉన్నదన్నది ఒక పచ్చి వాస్తవం.



ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధాన్ని నివారించడంలో అమెరికా విఫలమైతే ప్రపంచ రాజకీయాల్లో తన నాయకత్వ పాత్రను ఆ అగ్రరాజ్యం పూర్తిగా కోల్పోక తప్పదు. 140 కోట్ల మంది వినియోగదారులతో బలమైన మార్కెట్ శక్తిగా ఆవిర్భవించిన భారతదేశం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక నిర్దిష్ట, ప్రభావశీల పాత్ర పోషించగల స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉన్నది.

నిజానికి జపాన్‌ను మనం జీడీపీలో అధిగమించాము కానీ జపాన్ తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే 11.8 రెట్లు ఎక్కువ ఉంటుందని ఐఎంఎఫ్ తాజా అంచనా. జపాన్ స్థాయిలో తలసరి జీడీపీని సాధించాలంటే భారత్‌కు మరో 22 ఏళ్లు పడుతుందని నిపుణులు అంటున్నారు. అనేక యూరోపియన్ దేశాల కంటే భారత్‌లో తలసరి ఆదాయం వేగంగా పెరుగుతున్నప్పటికీ ఈ విషయంలోనూ మనకెన్నో సవాళ్లున్నాయి. పేదరికాన్ని తగ్గించడంలోనూ, సాంకేతిక ప్రగతిలోనూ మన దేశం చెప్పుకోదగ్గ విజయాలు సాధించింది. జపాన్‌తో పోలిస్తే భారతదేశంలో ఉన్న అత్యధిక యువ జనాభా మనకు ఒక వరం. ప్రజల జీవన ప్రమాణాలు, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, ఆదాయ అసమానతల తగ్గుదల విషయంలో జపాన్ స్థాయికి మనం చేరుకోవడానికి ఎంతో కాలం పడుతుంది. అనేక ఇతర దేశాలతో పోలిస్తే ప్రైవేట్ రంగ పెట్టుబడులు మన దేశంలో అంత వేగంగా పెరగడం లేదు. జపాన్ లాగా బుల్లెట్ రైళ్లు, ఆధునిక పరిశ్రమలు, పరిశోధనలకు భారీ కేటాయింపులు, అత్యంత నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తి మనకు లేవు. నైపుణ్యం లేని శ్రామికులు, సరీ సరిపోని మౌలిక సదుపాయాలు, విదేశాలకు అవకాశాల కోసం పరుగులెత్తే మన సాంకేతిక నిపుణులు, ఏ మాత్రం వినూత్న ఆవిష్కారాలు లేకపోవడం భారతదేశ బలహీనతలు. జీడీపీ పెరుగుదలను సమానంగా పంపిణీ చేసి నిజమైన అభివృద్ధిగా మార్చినప్పుడే మన దేశం విజయం సాధించినట్లు లెక్క. సగటు జపానీ పౌరుడు సగటు భారతీయుడి కంటే 20 రెట్లు ఎక్కువ సంపాదిస్తాడని అంచనా. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ అనేక చిన్నచిన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో అపరిశుభ్రత, క్రమశిక్షణారాహిత్యం ఎక్కువ కనపడుతోంది. ఉపాధి రంగంలో ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించడం భారత్ ముందున్న తక్షణ ప్రధాన కర్తవ్యం. ముఖ్యంగా వ్యవస్థలను పారదర్శకంగా, నిజాయితీగా, అవినీతిరహితంగా పనిచేయించడంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అందుకు ప్రధాన కారణం మన రాజకీయ సంస్కృతి పూర్తిగా విఫల వ్యవస్థలపైనే ఆధారపడి ఉండడం. ఇంట గెలిచినప్పుడే రచ్చ గెలువగలనన్న విషయం మోదీకి తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'పిడుగు' నుంచి రైతులను రక్షించండి

వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులపై పిడుగులు పడడం, వారు తాము నమ్ముకున్న చేనులోనే పాణాలు వదలడం బాధాకరం. ఆదిలాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు విత్తుతున్న రైతులపై పిడుగుపడి ఇటీవల ఆరుగురు చనిపోయారు, పన్నెండు మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి హృదయ విదారక సంఘటనలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ జరుగుతున్నాయి. విపత్తులను అడ్డుకోవడం ఎవరి వల్లా కాదు. కానీ జాగరూకతతో వ్యవహరిస్తే భారీ ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు. సహజసిద్ధమైన వానలు దూరమైన తరువాత అకాల వర్షాలు పడుతున్నాయి. దీనికంతటికీ కారణం మారిన వాతావరణ పరిస్థితులు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల మందికి పైగా పిడుగుపడి చనిపోతున్నారు.

మారిన వాతావరణ పరిస్థితుల వల్ల ఇపుడు వాన కంటే ముందే ఉరుములు, మెరుపులతో పిడుగులు పడుతున్నాయి. దీంతో జనంతో పాటు గొర్రెలు, మేకలు, ఆవులు వంటి మూగజీవాలు పిడుగుపాటుకు బలైపోతున్నాయి. ఇంతటి విధ్వంసాన్ని సృష్టిస్తున్న పిడుగుపాటు నుంచి పేద రైతాంగాన్ని కాపాడాలి. ఇందుకు ప్రభుత్వాలు శాస్త్ర, సాంకేతిక రంగాలను విరివిగా ఉపయోగించుకోవాలి. ప్రతి గ్రామంలోని చేలలో 'లైట్నింగ్ కండక్టర్లు' ఏర్పాటు చేయాలి. ఇవి పిడుగు పడినపుడు అధిక విద్యుదావేశం గ్రహించుకొని భూమిలోకి పంపిస్తాయి. ఇవి ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి పెద్ద విషయం కాదు. పట్టణాలలో ప్రభుత్వ భవనాలపైన ఈ లైట్నింగ్ కండక్టర్లను విధిగా ఏర్పాటుచేస్తారు. మరి పల్లెలలో, వ్యవసాయ క్షేత్రాలలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదు?

పిడుగు పడక ముందు తీసుకునే జాగ్రత్త చర్యలను ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేయాలి. గ్రామీణాభివృద్ధికి వేల కోట్లను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతాంగం ప్రాణాలను కాపాడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం 'దామిని యాప్' ద్వారా సేవలందిస్తోంది. అది ఎంతమందికి చేరుతున్నదో తెలియదు. వాతావరణ శాస్త్రవేత్తలు నలభై నిమిషాల ముందు ఎక్కడ పిడుగు పడుతుందో చెప్పవచ్చని అంటున్నారు. కాని ఖచ్చితత్వం మీద సందేహం కల్గుతోంది. ఇస్రో 'ఎర్త్ నెట్‌వర్క్' సహకారంతో ముందస్తు సమాచారం ద్వారా అధికారులను అప్రమత్తత చేస్తుంది. కాని అధికార యంత్రాంగం కదలడం లేదు. విపత్కర పరిస్థితులలో ప్రజలే తగిన రక్షణ చర్యలు తీసుకొని తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలి.

– బి. వేణుగోపాల్‌రెడ్డి, ఆదిలాబాద్

స్నేహం మాటున అమెరికా కుట్రలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధానమంత్రి మోదీకి మంచి మిత్రుడు అని భారతీయుల్లో చాలామంది నమ్ముతారు. 'మోదీ నాకు మంచి మిత్రుడు. భారతీయులంటే నాకు చాలా ఇష్టం' అని ట్రంప్ కూడా పలుమార్లు బహిరంగంగా చెప్పారు. కానీ అదే ట్రంప్ ఇటీవల భారత్‌లో ఆపిల్ కంపెనీ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు, 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' లాంటి కార్యక్రమాలను ఇప్పుడు ట్రంప్, ఒకప్పుడు మాజీ అధ్యక్షుడు బైడెన్ కూడా వ్యతిరేకించారు.

అలాగే బైడెన్ హయాంలో భారత ఎన్నికల వ్యవస్థలో అమెరికా జోక్యం చేసుకోవాలని చూసిందని, ఇందుకోసం నిధులు కూడా కేటాయించిందని స్వయంగా ట్రంప్ ఇటీవల కుండబద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. ఇది నిజమే అనిపించే ఉదంతాలు కొన్ని మన దేశంలో జరిగాయి కూడా. పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాలలో జరిగిన రైతు ఉద్యమం; ఢిల్లీలో జరిగిన షాహీన్ బాగ్ ఉద్యమం లాంటివి. ఇవి అచ్చం శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ఆ దేశ ప్రభుత్వాలను తల్లకిందులు చేసిన ఉద్యమాలను పోలి ఉండడం గమనార్హం. అంటే రైతు ఉద్యమకారులు దేశ రాజధాని ఢిల్లీకి రావడానికి తీవ్రంగా ప్రయత్నించింది భారత ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకేనా?

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం కేవలం దశాబ్ద కాలంలోనే 11వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరింది. అందుకే భారత్‌లో కూడా అలాంటి అలజడులు సృష్టించాలనుకుందా అనే సందేహాలు నిజమనిపిస్తున్నాయి.

గత చరిత్రను చూస్తే 1972 ప్రాంతంలో అమెరికాలో జనాభా చాలా తక్కువ. ఆ కాలంలో అమెరికాలో పరిశ్రమలు స్థాపిస్తే చవకగా ఉద్యోగులు, కార్మికులు లభించే పరిస్థితి లేదు. అందువల్ల ఆ దేశ పారిశ్రామికవేత్తలు చైనాలో పరిశ్రమలను పెట్టడం ప్రారంభించారు. దీంతో చైనా అనతికాలంలోనే ఎంతో అభివృద్ధిని సాధించింది. అయితే ప్రస్తుతం అమెరికాలో జనాభా పెరిగింది. తద్వారా నిరుద్యోగం కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లోనే చైనా పాలకుల వైఖరి కారణంగా చాలామంది పారిశ్రామికవేత్తలు ఆ దేశాన్ని వీడి మరో అనుకూలమైన దేశం కోసం చూస్తున్నారు. ఈ తరుణంలో వారందరికీ భారత్ అందివచ్చిన ఆశాకిరణంలా కనిపిస్తోంది. అందుకే ఎన్నో పరిశ్రమలు భారత్‌కు తరలి వస్తున్నాయి. అందులో భాగంగానే ఆపిల్ సంస్థ కూడా భారత్‌కు రావాలనుకున్నది. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకుంటున్నారు. ఆ పరిశ్రమ అమెరికాలోనే పెట్టాలని, భారత్‌లో పెడితే అధిక సుంకాలు విధిస్తామని ఇటీవల ఆ కంపెనీని బహిరంగంగా హెచ్చరించారు.

ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థ రాకెట్ స్పీడుతో దూసుకుపోతుండటంతో భారత్ మరింత శక్తివంతంగా మారకుండా చూసేందుకే అప్పుడు బైడెన్ ప్రభుత్వం కానీ, ఇప్పుడు ట్రంప్ సర్కార్ కానీ అడ్డుపడుతున్నాయని భావించాల్సి వస్తోంది. ఏ దేశమైనా అభివృద్ధి చెందకూడదంటే ఆ దేశ ఆర్థిక, పారిశ్రామిక, సైనిక శక్తులు పటిష్ఠం కాకూడదు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' లాంటివి విజయవంతం కాకూడదు. కానీ కేంద్ర ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు వివిధ దేశాలలో పర్యటిస్తూ అక్కడి పారిశ్రామికవేత్తలను తమ రాష్ట్రాలకు ఆహ్వానిస్తూ గ్రీన్ కార్పెట్ పరుస్తున్నారు. దీంతో చైనా తదితర దేశాల్లోని పరిశ్రమలు భారత్ బాట పట్టాయి. అందుకే ఇప్పటిదాకా అమెరికా పలుమార్లు భారత్‌లో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రంగా పలు రకాల ప్రయత్నాలు చేసింది. అవన్నీ విఫలం కావడంతోనే ఆపిల్ కంపెనీ విషయంలో ఇక ప్రత్యక్ష పోరాటానికి రంగంలోకి దిగింది. భారత్ ఇదే విధంగా అభివృద్ధి సాధిస్తూపోతే తమ అగ్రరాజ్య హోదా వీగిపోయే అవకాశముందని, గతంలో చైనా విషయంలో జరిగిన చారిత్రక తప్పిదం భారత్ విషయంలో జరుగకూడదని అమెరికా భావిస్తున్నది.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం దశాబ్ద కాలంలోనే 4వ స్థానానికి చేరింది. భారత్ ఇదే విధంగా అభివృద్ధి సాధిస్తూపోతే తమ అగ్రరాజ్య హోదా వీగిపోయే అవకాశముందని, గతంలో చైనా విషయంలో జరిగిన చారిత్రక తప్పిదం భారత్ విషయంలో జరగకూడదని అమెరికా భావిస్తున్నది.




ఇందుకోసం మన దేశంలోని ప్రతిపక్ష నాయకులను కూడా వాడుకుంటున్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత ఆర్థిక రంగాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే అడ్రెస్ లేని అమెరికా సంస్థలు ఇచ్చిన రిపోర్టుల పేరుతో షేర్ మార్కెట్లో అక్రమాలు అంటూ దుష్ప్రచారం లేవదీస్తున్నారనీ, ఆ విధంగా అదానీ కంపెనీ లక్షల కోట్లు పోగొట్టుకునేలా చేసి తద్వారా షేర్ మార్కెట్ పతనం చెందేలా చేశారనీ ఒక వాదన. అలాగే కెన్యా ప్రభుత్వం అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయడంతో భారత్‌కు ఆఫ్రికాలోకి ప్రవేశం ఆగిపోయింది. హిండెన్‌బర్గ్ పేరుతో ఆడిన నాటకం కూడా తెలిసిందే. ఇజ్రాయెల్‌లో కూడా అదానీని అడ్డుకునే ప్రయత్నం జరిగింది.

భారత్ కరోనా వ్యాక్సిన్‌ను స్వయంగా తయారు చేయడం కూడా అమెరికా మెడికల్ మాఫియాకు నచ్చలేదు. అదే సమయంలో ఇక్కడ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ భారత కరోనా వ్యాక్సిన్ విషయంలో పలు సందేహాలు వ్యక్తం చేశారు. అలాగే ఆయన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలునూ అక్రమాల పేరుతో అడ్డుకునే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పాల్సి వచ్చింది. యాదృచ్ఛికమో ఏమో తెలియదు కానీ అమెరికా వ్యతిరేకించిన అన్ని అంశాలనూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంటుంది.

మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ కంపెనీలకు దోచిపెడుతుందన్న ప్రచారంతో ఆర్థిక రంగంతోపాటు పారిశ్రామిక రంగం స్వల్ప కుదుపులకు గురైనా మళ్ళీ నిలదొక్కుకున్నాయి. అలాగే స్వావలంబన దిశగా దూసుకెళ్తున్న భారత్ రక్షణ రంగంలోనూ పటిష్ఠంగా తయారవుతోంది. భారత్‌లో తయారైన మిస్సైల్స్ ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ప్రపంచ దేశాలను ఆశ్చర్యచకితులను చేశాయి. ప్రతి విషయంలోనూ విదేశాలపై ఆధారపడిన దశ నుంచి అగ్రశ్రేణి యుద్ధ విమానాలు కూడా స్వదేశంలోనే తయారు చేసుకునే స్థాయికి చేరడమే కాకుండా, భారత్ యుద్ధ విమానాల సరఫరాకు విదేశాల నుంచి డిమాండ్ పెరగడం కూడా అమెరికాకు చిరాకును కలిగించి ఉండవచ్చు. భారత్ ఎదుగుదలను అమెరికా జీర్ణించుకోలేకపోతోంది. కానీ భారత్ సర్వసత్తాక సార్వభౌమాధికార దేశమన్న విషయాన్ని అమెరికా మరచిపోకూడదు.


భారత్ లాంటి సువిశాలమైన, అత్యధిక జనాభా గల దేశంలో శక్తిమంతమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండడం ఎంతో అవసరం. అంతేగాక పరిపాలన కూడా పారదర్శకంగా ఉన్నప్పుడే అమెరికా లాంటి దేశాల కుట్రలు విఫలమవుతాయి.

■ శ్యామ్‌సుందర్ వరయోగి



బినామీలతో పరేషన్!

విధానాలు మారినా ప్రజా పంపిణీ వ్యవస్థలో తీరు మారడంలేదు. అవినీతిమయమైన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి డీలర్ల చేతికే రేషన్ పంపిణీ బాధ్యతలు అప్పగించినా పంపిణీ శాతం పెరగలేదు. దీనికి ప్రధాన కారణం బినామీ డీలర్లేనని తెలుస్తోంది. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.



ఉమ్మడి కృష్ణాలో 150 మంది బినామీ రేషన్ డీలర్లు!

- పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తోన్న అక్రమార్కులు
- కార్డుదారులకు పెరగని పంపిణీ శాతం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం.. మామూళ్ల మత్తులో అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రజా పంపిణీ వ్యవస్థలో బినామీ డీలర్లు రాజ్యమేలుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో కలిపి మొత్తం 150 మందికిపైగా వీరు ఉన్నట్టు తెలుస్తోంది. ఎండీయూ వ్యవస్థలో డోర్ డెలివరీ పేరుతో కార్డుదారులకు బియ్యాన్ని ఇచ్చినట్టు ఇచ్చి, వారి దగ్గర ఎదురు కొనుగోలు చేసి అదే వాహనాల్లో తరలించుకుపోయేవారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు, పంపిణీ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. రేషన్ దుకాణాల నుంచే నిత్యావసరాల పంపిణీ చేపట్టింది. తొలి నెల పంపిణీ శాతం దాదాపుగా సమానంగా ఉండటంతో.. సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు సైతం విస్తుపోతున్నారు. దీనిపై లోతుగా వెళితే.. బినామీ డీలర్ల అక్రమాల వల్లనే పంపిణీ శాతం మెరుగు పడలేదని తెలుస్తోంది. కార్డుదారులు పూర్తి స్థాయిలో బియ్యం తీసుకోకపోవటానికి ప్రధానంగా బినామీ డీలర్లు రేషన్‌ను దారి మళ్లించడమే కారణమని సమాచారం. గతంలో డీలర్లు స్టాకిస్టులుగా ఉన్నపుడు కూడా ఎండీయూ ఆపరేటర్లతో బినామీ డీలర్లు మిలాఖత్ అయ్యి పేదల బియ్యాన్ని తరలించేవారు. ఇప్పుడు డీలర్లే

మిగతా 6లో..

బినామీ డీలర్లదే హవా!

సివిల్ సప్లయిస్‌లోకి బినామీ డీలర్లు ఎలా ప్రవేశిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. అసలైన డీలర్ల పేర్లు కాగితాల మీదనే కనిపిస్తాయి. పరీక్షలు రాసి, తమ తెలివితేటలతో దక్కించుకున్న వారు ఇప్పటికీ చాలా వరకు షాపులను నిర్వహిస్తున్నారు. ధన ఆశ, అక్రమ వ్యాపారం చేయాలన్న ఉద్దేశ్యం, రాజకీయ సిఫార్సులతో వచ్చిన వారి డిపోలు సింహభాగం బినామీల చేతిలోకి వెళ్లాయి. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే అక్రమ బియ్యం వ్యాపారుల స్వాధీనంలో ఉన్నాయి. ఇంత తేలిగ్గా బినామీల చేతుల్లో రేషన్ దుకాణాలు ఎలా నడుస్తున్నాయో చూస్తే ఆశ్చర్యపోతారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యావసరాలను డీలర్లు దిగుమతి చేసుకోవాలి. కానీ నామినీల పేరుతో భార్య, ఇతరుల పేర్లను డీలర్లు ఇస్తున్నారు. డీలర్లు సూచించిన నామినీలు ఎవరైనా సరే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవటానికి అవకాశం ఉంటోంది. దీంతో బినామీ డీలర్ల పని సులువైపోతోంది. బినామీ డీలర్లు ఒరిజినల్ డీలర్లుగా వ్యవహరిస్తూ నిత్యావసరాలను డ్రా చేసుకుని తరలించుకుపోతున్నారు. కార్డుదారులకు వీలైనంత వరకు ఇచ్చి .. మిగిలిన వాటిని గుట్టుగా తరలించేస్తున్నారు.

దొంగ పట్టాలపై కదిలిన డొంక!

ఎన్నికల వేళ పేదలకు ఇళ్ల పట్టాలు పంచిన మాజీ మంత్రి పేర్ని నాని

- నాడు తహసీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి సంతకాలు పెట్టిస్తుంటే అడ్డుకున్న కూటమి నేతలు
- అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వివాదంగా దొంగ పట్టాల వ్యవహారం
- మంగళవారం రాత్రి మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల తనిఖీలు
- నేడు తనిఖీలు కొనసాగించాలని ఆర్డీవో ఆదేశాలు



మచిలీపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ముందు మాజీ మంత్రి పేర్ని నాని పంపిణీ చేసిన దొంగ ఇళ్ల పట్టాల వ్యవహారంపై డొంక కదిలింది. కర్రగ్రహారం, చిలకలపూడిలో 320 ఎకరాలకు పైగా భూమిలో అనర్హులకు పట్టాలు ఇచ్చిన విషయంపై, స్ట్రీట్‌ఫీల్డ్ పేరుతో 870 మందికిపైగా పేదలకు పట్టాలు ఇచ్చిన అంశంపై మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి విచారణ చేపట్టారు. మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అసలు ఎంతమందికి పట్టాలు ఇచ్చారు.. వారిలో అర్హులు ఎంతమంది, అనర్హులు ఎంత మంది అనే అంశంపై రికార్డులను తనిఖీ చేస్తున్నారు. కొన్ని కీలకమైన ఆధారాలు లభ్యం కాగా, మరిన్ని వివరాల కోసం బుధవారం కూడా రెవెన్యూ రికార్డులను, ఇంటి పట్టాలకు సంబంధించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు.

మిగతా 6లో..

గంజాయి విక్రయిస్తూ చిక్కిన ఆటో డ్రైవర్

- పోలీసులను చూసి పొదల్లో పడేసిన ప్యాకెట్
- డ్రైవర్ అరెస్టు.. 21 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

విజయవాడ/సత్యనారాయణపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు చేసిన అప్పులు తీర్చడం కోసం ఆటో డ్రైవర్ ముసుగులో రైల్వే స్టేషన్ వద్ద గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీకి చెందిన గోళ్ల సాంబశివరావు ఆటోడ్రైవర్. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌ల వద్ద ప్రయాణికుల కోసం తిరుగుతుంటాడు. అతడు పగలు కంటే రాత్రిపూట ఎక్కువగా ఆటో నడుపుతుంటాడు. ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం కంటే వ్యసనపరులకు గంజాయిని విక్రయించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తాడు. సాంబశివరావుకు అనేక వ్యసనాలు ఉన్నాయి. వాటిలో మద్యం ఒకటి. ముందుగా ఆటో నడుపుకునే అతడు కొన్ని రోజుల తర్వాత దాన్ని పక్కన పెట్టేసి ఇంట్లో ఉంటూ మద్యం తాగుతుండేవాడు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ అప్పులు చేశాడు. వాటిని తీర్చుకోవడానికి గంజాయి అమ్మకాలకు దిగాడు.

15 కేసుల్లో నిందితుడు

ఒడిసా, సీలేరు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. కొన్నాళ్లుగా సాంబశివరావు ఈవిధంగా చేస్తున్నాడు. సోమవారం రాత్రి రైల్వే కాలనీ రోడ్డులో ఆటోలో సాంబశివరావు గంజాయి స్టాకు పెట్టుకుని ఉన్నాడు. పోలీసులు రాత్రి పూట గస్తీ తిరుగుతుండగా వారిని చూసి గంజాయి ప్యాకెట్లను పొదల్లోకి

మిగతా 6లో..

వారధులకు కష్టకాలం!

6

కాసులు కురిపిస్తున్న కాటా డ్యూటీ

ఎన్టీటీపీఎస్‌లో యాస్ కాటా డ్యూటీకి భలే గిరాకీ

ఎదురు డబ్బులిచ్చి డ్యూటీలు వేయించుకుంటున్న ఉద్యోగులు

- అంతర్గత బదిలీల్లో అధికారుల చేతివాటం
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు


బూడిదను లోడు చేసుకుంటున్న ట్రాక్టర్

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గును మండించగా వచ్చే బూడిదకు మంచి డిమాండ్ ఉంది. బూడిద ఇప్పుడు బంగారం అయ్యింది. రాష్ట్రంలో ఉన్న పలు సిమెంట్ కంపెనీల వారు ఎన్టీటీపీఎస్‌తో ఎంవోయూలు కుదుర్చుకొని ట్యాంకర్లలో బూడిదను రవాణా చేసుకుంటున్నారు. బ్రిక్స్ కంపెనీల వారు సైతం బాడి లారీలు, ట్రాక్టర్లు ద్వారా బూడిదను తరలిస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు సుమారు 150 పైగా ట్యాంకర్లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్లాంట్లో ఉన్న సైలో వద్ద బూడిద లోడ్ చేసుకున్నాక కాటా మిషన్ వద్ద బరువు తూకం వేయించుకొని ట్యాంకర్లు, లారీలు బయటకు రావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వాహనం లోనికి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా యాస్ కాటాలో ఉన్న ఉద్యోగులదే కీలక పాత్ర. డబ్బులు ముట్టకపోతే లోడింగ్ చేయరని, వాహనాలను లోనికి కూడా అనుమతించడం లేదని పలువురు వాహన యజమానులు ఆరోపిస్తున్నారు. అధికారుల అండతో ఈప్రక్రియ 'మూడు పువ్వులు ఆరు కాయలు' అన్న చందంగా జరుగుతోందని సమాచారం. ప్రతి రోజు ఇలా కాటా వద్ద వచ్చే డబ్బులో 30 శాతం ఒక అధికారికి, మిగిలిన 70 శాతం ఉద్యోగులకు, వారికి సహకరించే వారికి పోతున్నట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వాటాల దగ్గర తేడా వచ్చి ఈ విషయం కాస్త బయటకు పొక్కింది.

డబ్బు కోసమే అదనపు సిబ్బంది నియామకం

యాస్ కాటా వద్ద వాస్తవానికి విధులు నిర్వహించేందుకు సరిపడ సిబ్బంది ఉన్నా అదనంగా నియమిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డ్యూటీ చేస్తే డ్యూటీ ముగించుకొని ఇంటికి డబ్బులతో వెళ్లే వెసులుబాటు ఉండటంతో ముడుపులు చెల్లించి మరీ యాస్ కాటా డ్యూటీ కోసం ఉద్యోగులు క్యూ కడుతున్నారు. ఈక్రమంలో అంతర్గత బదిలీల్లో భారీగా నగదు చేతులు మారుతుందోని ఆరోపణలున్నాయి. ఖాళీ అయిన చోట ఉద్యోగులను ఏర్పాటు చేయకుండానే గతంలో పని చేసిన ఒక ఉన్నతాధికారి కాసులకు కక్కుర్తి

మిగతా 6లో..

ఎన్టీటీపీఎస్‌లో బూడిద కాటా డ్యూటీకి భలే గిరాకీ ఏర్పడింది. ఇక్కడ డ్యూటీ చేస్తే రోజుకు వేల రూపాయల అదనపు ఆదాయం పొందే అవకాశం ఉండటంతో ఉద్యోగులు ఎదురు డబ్బులిచ్చి మరీ డ్యూటీ వేయించుకుంటున్నారని తెలిసింది. 'కాసు కొట్టు.. కాటా డ్యూటీ పట్టు' అన్న చందంగా తయారైంది ఇక్కడ పరిస్థితి. తిలా పాపం తలా పిడికెడు అన్నట్టు యాస్ కాటా డ్యూటీలో అక్రమంగా సంపాదించే డబ్బును వాటాలు వేసుకొని మరీ పంచేసుకుంటున్నారని సమాచారం. ఇందులో ఉన్నతాధికారుల నుంచి కిందస్థాయి ఉద్యోగుల వరకు ఉన్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో ఒక ఏడీఈ కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

బండికి సవాళ్లు!

జిల్లాలో నిరుపయోగంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ భవనాలు, స్థలాలు

- రూ.కోట్ల విలువైన ఆస్తులున్నా ఆదాయం అంతంతమాత్రమే!
- నేడు డీసీఎంఎస్ చైర్మన్‌గా బండి రామకృష్ణ బాధ్యతల స్వీకరణ


చమ్మనగిరిపేటలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ స్థలం దుస్థితి

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్): కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న జనసేన నాయకుడు బండి రామకృష్ణకు పలు సమస్యలు సవాళ్లు విసరనున్నాయి. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి మచిలీపట్నం చమ్మనగిరిపేటలో విలువైన స్థలం ఉంది. ఆ స్థలంలో ఒకప్పుడు మార్కెటింగ్ కార్యకలాపాలు నడిచేవి. ఈ స్థలంలో ఉండే భవనం శిథిలమైంది. ఆ భవనాన్ని ఇటీవల తొలగించారు. కొంత కాలం సొసైటీ అధ్యక్షుడు అక్కడ ఉండి పర్యవేక్షించేవారు. స్థలంలోని మట్టిని తవ్వుకుపోతున్నారు. ఎవరు పడితే వారు తమ వస్తువులను అక్కడ ఉంచుతున్నారు. పట్టించుకునే నాథుడే లేడు. 'ఇంట గెలిచి రచ్చగెలవాలన్న' చందంగా మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి చెందిన ఆస్తులను పరిరక్షించే బాధ్యత బండి రామకృష్ణపై ఉంది. అలాగే నూజివీడులో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి స్థలం ఉంది. కోట్లాది రూపాయల విలువైన ఈ స్థలం నిరుపయోగంగా పడి ఉంది. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పరిధిలో ఉండే మార్కెట్ యార్డులు గత ప్రభుత్వం నిర్ణయంతో దీని పరిధి నుంచి వెళ్లిపోయాయి. జిల్లాలోని 109 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు పండించిన ధాన్యం, అపరాలు ప్రస్తుతం మార్కెటింగ్ చేస్తున్నారు. సివిల్ సప్లయిస్ శాఖకు అనుబంధంగా ఉంటూ జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమస్యలతో సహజీవనం

వణుకూరు జగనన్న కాలనీలో దుస్థితి

- విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 5,440 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపు
- పూర్తయిన 1400 గృహాలు.. నిర్మాణ దశలో మరో 1300 ఇళ్లు
- పట్టాలు ఇచ్చి కనీస వసతులు మరచిన గత వైసీపీ ప్రభుత్వం
- తాగు నీరు, రోడ్లు, డ్రెయిన్లు, కరెంటు సమస్యలతో స్థానికులు సతమతం
- పట్టించుకోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు


గుంతలమయంగా ప్రధాన రోడ్డు

కృష్ణాజిల్లా వణుకూరు జగనన్న కాలనీలో కనీస వసతులు కరువై సమస్యలతో స్థానికులు సహజీవనం చేస్తున్నారు. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క అలమటించిపోతున్నారు. బురదతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. వాడుకున్న నీరు బయటకు పోయే దారి లేక అక్కడే రోజుల తరబడి నిలిచి పోయి దుర్వాసన వెదజల్లుతోంది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రుళ్లు బయటకు రావడానికి జంకుతున్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదల కష్టాలను ఇటు ఎన్టీఆర్ జిల్లా అధికారులు, అటు కృష్ణాజిల్లా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.


వణుకూరు జగనన్న కాలనీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 5,440 మంది పేదలకు కృష్ణాజిల్లా వణుకూరు జగనన్న కాలనీ (వీఎంసీ లేఅవుట్)లో ఒక్కొక్కరికి సెంటు చొప్పున గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇప్పటి వరకు 1,400 గృహాలు పూర్తవగా, మరో 1,300 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలో 100పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ మౌలిక వసతులను గత వైసీపీ ప్రభుత్వం కల్పించకుండా వదిలేసింది. దీంతో తాగు నీరు, రోడ్లు, డ్రెయిన్ల సమస్యలతో

మిగతా 6లో..

మాడపాటి గెస్ట్‌హౌస్, జమ్మిదొడ్డిలలో

దుర్గమ్మ ప్రసాదాల కౌంటర్లు

» ఈవో శీనానాయక్ వెల్లడి



రైల్వేస్టేషన్‌లోని దుర్గమ్మ ప్రసాదాల కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడికి వచ్చే భక్తులకు మరిన్ని సేవలు అందించే క్రమంలో భాగంగా వన్‌టౌన్ తారాపేటలోని మాడపాటి గెస్ట్‌హౌస్, బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ప్రాంగణాలలో దేవస్థానం లడ్డూ ప్రసాదం విక్రయించే కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. మంగళవారం ఆయన విజయవాడ రైల్వేస్టేషన్‌లోని తూర్పు వైపు ఎంట్రన్స్‌లో ఉన్న దుర్గమ్మ ప్రసాదాల విక్రయ కౌంటర్‌ను పరిశీలించారు. వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కౌంటర్‌లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.



ముఖ్యమంత్రిని కలిసిన పెన్మెత్స

సుపరిపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును సెక్రటేరియట్‌లో ఎస్.ఎల్.వి. గ్రూప్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాస రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. (భారతీనగర్)

సూపర్ సిక్స్ అమలు ఆరంభం

వైసీపీ, జగన్ పతనం ప్రారంభం : నెట్టెం

జగ్గయ్యపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలహామీలైన సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రారంభంతో వైసీపీ, జగన్ పతనం ఆరంభమైందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. చంద్రబాబు సంపద సృష్టించి పేదలకు పంచుతుంటే.. సైకో, శాడిస్ట్ జగన్ సంపదను దోచుకుని అప్పులు చేసి పథకాలు అమలు చేశాడని ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, తల్లికి వందనం పథకాన్ని ఎగతాళి చేసిన జగన్‌కు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఒకేసారి నగదు జమ కావటంతో దిమ్మతిరిగిందని చెప్పారు. నవరత్నాల పేరుతో నవమోసాలు చేసిన జగన్‌కు ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించబోతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే గత ప్రభుత్వ విధ్వంసాలు, ఆరాచకాలను అధిగమించి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని నెట్టెం చెప్పారు. సమావేశంలో కొఠారు సత్యనారాయణ ప్రసాద్, గింజుపల్లి రమేష్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, మేకా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, అన్వర్, కె.నరసింహారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు బ్రోచర్లను విడుదల చేస్తున్న సంస్థ సీఎండీ రామచంద్రరావు, సభ్యులు

ఆకునూరులో శ్రీ భ్రమర హోమ్స్ సిగ్నేచర్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వినూత్న ఆలోచనలతో దూసుకుపోతున్న శ్రీ భ్రమర హోమ్స్ విజయవాడ నగరంలోని ఆకునూరు వద్ద సిగ్నేచర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు సంస్థ చైర్మన్, ఎండీ గళ్లా రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా బెంజ్ సర్కిల్ జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ భ్రమర హోమ్స్ గ్రాండ్ ప్రీ లాంచ్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎండీ గళ్లా రామచంద్రరావు, డైరెక్టర్ మారం చంద్రశేఖర్‌లు నూతన ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, 'శ్రీ భ్రమర హోమ్స్'లో విల్లాస్, విల్లా ప్లాట్స్ ప్లాన్ చేసినట్టు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో, 2015 నుంచి 35కి పైగా ప్రాజెక్టులతో, 10 వేల మందికి పైగా కుటుంబాల సొంతింటికల నెరవేర్చినట్టు తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వేలాది కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించి, స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకున్నట్టు పేర్కొన్నారు.

బినామీలతో పరేషన్!

(5వ పేజీ తరువాయి)

పంపిణీ దారులుగా మారారు. కార్డుదారులకు నిత్యావసరాల పంపిణీ శాతం గణనీయంగా పెరగాలని గట్టిగా ప్రభుత్వం నిర్దేశించినా కూడా బినామీ డీలర్లు పాతపనే చేస్తున్నారు. దీంతో బియ్యం పంపిణీ శాతం పెరగటం లేదు.

బినామీ డీలర్లదే హవా!

సివిల్ సప్లయిస్‌లోకి బినామీ డీలర్లు ఎలా ప్రవేశిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. అసలైన డీలర్ల పేర్లు కాగితాల మీదనే కనిపిస్తాయి. పరీక్షలు రాసి, తమ తెలివితేటలతో దక్కించుకున్న వారు ఇప్పటికీ చాలా వరకు షాపులను నిర్వహిస్తున్నారు. ధన ఆశ, అక్రమ వ్యాపారం చేయాలన్న ఉద్దేశ్యం, రాజకీయ సిఫార్సులతో వచ్చిన వారి డిపోలు సింహభాగం బినామీల చేతిలోకి వెళ్లాయి. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే అక్రమ బియ్యం వ్యాపారుల స్వాధీనంలో ఉన్నాయి. ఇంత తేలిగ్గా బినామీల చేతుల్లో రేషన్ దుకాణాలు ఎలా నడుస్తున్నాయో చూస్తే ఆశ్చర్యపోతారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యావసరాలను డీలర్లు దిగుమతి చేసుకోవాలి. కానీ నామినీల పేరుతో భార్య, ఇతరుల పేర్లను డీలర్లు ఇస్తున్నారు. డీలర్లు సూచించిన నామినీలు ఎవరైనా సరే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవటానికి అవకాశం ఉంటోంది. దీంతో బినామీ డీలర్ల పని సులువైపోతోంది. బినామీ డీలర్లు ఒరిజినల్ డీలర్లుగా వ్యవహరిస్తూ నిత్యావసరాలను డ్రా చేసుకుని తరలించుకుపోతున్నారు. కార్డుదారులకు వీలైనంత వరకు ఇచ్చి .. మిగిలిన వాటిని గుట్టుగా తరలించేస్తున్నారు.

బినామీలను కనిపెట్టే అవకాశం ఉన్నా..

డీలర్లు ఎన్ని సార్లు లాగిన్ అయ్యారు. ఎంత సమయం లాగిన్‌లో ఉన్నారు అనేది తెలుసుకునే వ్యవస్థ సివిల్ సప్లయిస్ దగ్గర ఉంది. దీనిని బట్టి డీలర్లు లాగిన్ చేస్తున్నారో, ఇతరులు లాగిన్ చేస్తున్నారో అర్థమవుతుంది. ఎవరు లాగిన్ చేస్తున్నారో కూడా తెలుస్తుంది. కాబట్టి బినామీ డీలర్లను కనిపెట్టడం కూడా సులువే. కానీ అధికారులు ఆ వైపు దృష్టి సారించడంలేదని విమర్శలు వస్తున్నాయి.

పెట్టుబడి అంతా అక్రమ వ్యాపారులదే..

కొంత మంది డీలర్లలో నిత్యావసరాలకు డీడీలు కట్టలేని వారు కూడా ఉన్నారు. ఇలాంటి డీలర్లు ఏనాడో అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయారు. వారు ఇచ్చే జీతాలకు అలవాటు పడిపోయారు. దీంతో అక్రమార్కులు తమ కనుసైగలతో డిపో నడిపిస్తున్నారు. పేదలకందాల్సిన బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వీటిని అడ్డుకోవాల్సిన పీడీఎస్ డీటీలు మామూళ్ల మత్తులో పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

దయనీయ స్థితిలో కాజ్‌వేలు, బ్రిడ్జిలు

» తెలుగు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గాలు

» వంతెనలకు అప్రోచ్‌లు లేక వాహనదారుల ఇక్కట్లు

» ట్రాఫిక్ కష్టాలు.. వరదలొస్తే రాకపోకలు బంద్..

» శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి

వారధులకు కష్టకాలం!

ఆంధ్రజ్యోతి పరిశీలన



అప్రోచ్ లేనందున నిరుపయోగంగా ఉన్న కూడలి వంతెన



మునేటి వరదలో మునిగిన లింగాల కాజ్‌వే (ఫైల్‌ఫొటో)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/వత్సవాయి/జగ్గయ్యపేట): అన్నీ కృష్ణా ఉపనదులైన వైరా, మున్నేరు, పాలేటిలపై కాజ్‌వేలు, బ్రిడ్జిలు. తెలుగురాష్ట్రాల ప్రజల రాకపోకలకు ఇవే వారధులు. దశాబ్దాల క్రితం వీటిని నిర్మించారు. నేడు శిథిల స్థితికి చేరుకుంటున్నాయి. వరదలొస్తే ప్రజల కష్టాలు చెప్పలేకుండా ఉంటున్నాయి. దెబ్బతిన్న కాజ్‌వేల పరిస్థితి దయనీయంగా ఉంది. నామమాత్రంగా చేసిన మరమ్మతులు పనిచేయటం లేదు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేయకపోవటంతో రాకపోకలకు కష్టంగా మారుతోంది. కాజ్‌వేలకు అప్రోచ్‌లు లేకపోవటం ఒక సమస్య అయితే.. లో లెవల్‌లో ఉండటం మరో సమస్య. హై లెవల్ బ్రిడ్జిలు కావాలన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కానీ ఏవీ కార్యరూపం దాల్చటం లేదు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో తెలుగు రాష్ట్రాలకు రాకపోకలకు దోహదపడే వీటి పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. కృష్ణా ఉపనదులపై ఉన్న కాజ్‌వేలు, బ్రిడ్జిల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి ఫోకస్'..

నిరుపయోగంగా వంతెన..

చెవిటికల్లు-వత్సవాయి ఆర్అండ్‌బీ రోడ్డులో నందిగామ మండలం కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా నదిపై నిర్మించిన వంతెన ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రూ. కోట్ల వ్యయంతో వంతెన నిర్మించినప్పటికీ, కేవలం అప్రోచ్ రోడ్డు వేయనందున ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాములూరు కూడలి వద్ద వైరా ఏటిలో దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ కాజ్‌వే దెబ్బతింది. వంతెనకు ఎగువ భాగంలో దీనిని నిర్మించడంతో వరద వచ్చినపుడల్లా కాజ్‌వే పూర్తిగా మునిగిపోతోంది. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. 200 మీటర్ల పొడవున వంతెన నిర్మించారు. అప్పట్లో అప్రోచ్‌కు అవసరమైన భూమి సేకరణ విషయంలో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అప్పటి నుంచి వంతెన నిరుపయోగంగా ఉంది. కాజ్‌వేనే దిక్కవటంతో వర్షాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పటం లేదు. రైతుల అంగీకారంతో భూసేకరణ అంశం కొలిక్కి వచ్చిందని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ చెప్పారు. రివైజ్డ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అనుమతి రావల్సి ఉందని ఆర్అండ్‌బీ ఏఈ తెలిపారు.

శిథిలావస్థలో లింగాల కాజ్‌వే..

తెలుగు రాష్ట్రాలను కలిపే చిల్లకల్లు-వైరా రహదారి ముఖ్యమైనది. ఈ మార్గంలో నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యంత రద్దీ ఉండే రహదారిలో వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై 1964లో వరద నీరు దిగువకు వెళ్లేలా 56 ఖానాలతో 850 మీటర్ల లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. ఒకవైపు భారీ వాహనాల రద్దీ.. మరోవైపు మునేటి వరదలకు ఈ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. భారీగా వరదలు వస్తే ఈ కాజ్‌వేను మూసేస్తున్నారు. వాహనాలను పెనుగంచిప్రోలు-మక్కపేట దారిలో మళ్లిస్తున్నారు. సింగిల్ రూటు కావటం, అదనంగా పది కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి రావటంతో వాహనదారులు, ప్రజలు అధిక వ్యయప్రయాసలకు గురౌతున్నారు. ఈ నేపథ్యంలో, గతేడాది రికార్డు స్థాయిలో వచ్చిన వరదకు కాజ్‌వే నామరూపాలు లేకుండా ధ్వంసమైంది. రోజుల తరబడి ఈ మార్గం బంద్ అయింది. ప్రస్తుతం రూ.రెండు కోట్లతో కాజ్‌వేకు మరమ్మతులు చేస్తున్నారు.



చిల్లకల్లు - వైరా రూటులో లింగాల కాజ్‌వే

హైలెవల్ వంతెన ఏర్పాటు ఎప్పుడు?

జగ్గయ్యపేట-ముక్త్యాల మార్గంలో అగ్రహారం వద్ద పాలేటిపై ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. దశాబ్ధాల క్రితం నిర్మించిన అగ్రహారం వంతెన ప్రస్తుతం వాహనాల రద్దీని తట్టుకోలేకపోతోంది. జగ్గయ్యపేట ప్రాంతంలోని పలు సిమెంట్ ఫ్యాక్టరీలు, విశాఖ స్టీల్ ప్లాంట్, పులిచింతల ప్రాజెక్టు, ఇతరత్రా పలు సంస్థలకు ఈ మార్గం ప్రధానమైనది. సూర్యాపేట జిల్లా దొండపాడు, మేళ్లచెరువు మీదుగా తెలంగాణా రాష్ట్రంలోకి వెళ్లేందుకు ఈ వంతెన కీలకం. లోలెవల్ వంతెన కావటంతో వరద వచ్చినపుడు రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. చుట్టూ తిరగాల్సి రావటంతో సమయం, సొమ్ము వృధా అవుతోంది. నిత్యం అధిక లోడ్‌తో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. లోలెవల్ ఉండటం, అధిక భారం పడటంతో వంతెన సామర్థ్యం చాలటం లేదు. దీనికితోడు గత ఏడాది సెప్టెంబరులో పాలేటికి భారీ వరద రావటంతో వంతెన ఆనుకుని రోడ్డు ఎనిమిది అడుగులకు పైగా కోసుకుపోయింది. తాత్కాలికంగా గండిని పూడ్చారు. అయితే పెరిగిన వాహనాల రద్దీని తట్టుకునేందుకు రెండులైన్ల హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. వంతెనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు.



అగ్రహారం వంతెన


దొంగ పట్టాలపై కదిలిన డొంక!

మచిలీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించి ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించారు. మచిలీపట్నం నగరంలో 16 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు. నవశకం పథకంలో భాగంగా అప్పటి మునిసిపల్ కమిషనర్ కాంపిటేటివ్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఆర్డీవో స్థాయిలో మచిలీపట్నం నియోజకవర్గంలో 19,200 మందికిపైగా ఇళ్లపట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. భూసేకరణ ప్రత్యేక అధికారిగా ఉన్న కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మచిలీపట్నం రాగా, ముడా భూములను ఆయనకు అధికారులు చూపారు. ఈ భూములు నివాసానికి పనికిరావని తేల్చారు. దీంతో ప్రైవేటు భూములను సేకరించాలని నిర్ణయించారు. కరగ్రహారం, చిలకలపూడిలోని ప్రైవేటు భూములను పరిశీలించారు. కరగ్రహారంలో ఎకరం రూ.11.50 లక్షల ధర ఉండగా.. చిలకలపూడిలో రూ. 70 లక్షల వరకు ఎకరం భూమి ధర ఉంది. మధ్యేమార్గంగా ఈ రెండు ప్రాంతాల్లోని భూమి ధరను కలెక్టర్ రూ.39 లక్షలుగా నిర్ణయించారు. 320 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇందులో 60 ఎకరాలకుపైగా భూమికి సరైన పత్రాలు లేకపోవడంతో దీనికి సంబంధించిన నగదును కోర్టులో కట్టారు. సేకరించిన భూమిని ఏ నుంచి ఎల్ బ్లాక్‌లుగా విభజించి చదును చేశారు. ఇందులో అనర్హులకు సెంటు భూమి చొప్పున పట్టాలు ఇచ్చారనే అంశంపై పలు ఫిర్యాదులు అందాయి. దీంతో పాటు మచిలీపట్నం నగరంలో రహదారులు వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వడానికి పట్టాలు ముద్రించారని, ఇందుకు అప్పట్లో పనిచేసిన జేసీ మాధవీలత ప్రత్యేక లాగిన్ తీసుకుని పట్టాలు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక నకిలీ పట్టాలపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సంతకాలు పెట్టిస్తున్నారని గ్రహించిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర, టీడీపీ, జనసేన నాయకులు రాత్రి 12 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో జేసీ గీతాంజలిశర్మ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి దొంగపట్టాల వ్యవహారంపై వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య రాజకీయపరంగా వివాదం నడుస్తోంది. తాజాగా దొంగపట్టాల విషయంలో మాజీ మంత్రి పేర్ని నాని అరెస్ట్ అవుతారనే అంశంపై ఇటీవల కాలంలో ప్రచారం విస్తృతంగా సాగుతోంది. మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి ఇంటి పట్టాల పంపిణీ అంశంపై విచారణ ప్రారంభించడంతో ఈ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది,

ఈ అధికారి మాకొద్దు!

» అమ్మ సన్నిధిలో అసభ్య దూషణలతో మనస్థాపం

» గ్రామ పెద్దలకు తిరుపతమ్మ దేవస్థాన ఉద్యోగులు, అర్చకుల ఫిర్యాదు



పెనుగంచిప్రోలు/వన్‌టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో ఓ అధికారి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, ఆ అధికారిని దేవస్థానం నుంచి బదిలీ చేయాలని పలువురు ఉద్యోగులు, అర్చకులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. 2024లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది వాడపల్లి దేవస్థానంలో విధులు నిర్వహిస్తూ పెనుగంచిప్రోలులోని గోపయ్యసమేత తిరుపతమ్మ దేవస్థానానికి బదిలీపై వచ్చిన ఆ అధికారి అక్కడి ఉద్యోగులను చీటికి మాటికి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అతని తీరుతో మనస్థాపం చెంది అమ్మవారి సన్నిధిలో అసభ్యపదజాలం ఏమిటంటూ ఉద్యోగులు, అర్చకులు ప్రశ్నిస్తున్నారు. అలా దూషించటం మంచిది కాదని సూచిస్తున్నప్పటికీ తీరు మారకపోవటమే కాక కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఉద్యోగులు, అర్చకులు వాపోతున్నారు. ఆ అధికారి తీరును నిరసిస్తూ రెండు రోజుల క్రితం రహస్య సమావేశం ఏర్పాటు చేసి ఆ అధికారిని బదిలీ చేయాలని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు తీర్మానించినట్టు సమాచారం. ఇదే విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి కూడా తీసుకువెళ్లి వివరించినట్టు తెలిసింది. అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని గ్రామ పెద్దలు ఉద్యోగులకు హామీ ఇచ్చినట్టు సమాచారం.

2026 మార్చి వరకు వీక్లీ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే నాలుగు వారాంతపు ప్రత్యేక రైళ్లను 2026 మార్చి వరకు పొడిగించింది. ఈమేరకు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం.మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07233 చర్లపల్లి-నరసాపూర్ రైలు చర్లపల్లి నుంచి శనివారం బయలుదేరుతుంది. రాత్రి 7.50 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 7 గంటలకు నరసాపూర్ చేరుతుంది. జులై 5 నుంచి మార్చి 28 వరకు ఈ రైలును పొడిగించారు. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో ఆదివారం బయలుదేరుతుంది. రాత్రి 8 గంటలకు నరసాపూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుతుంది. ఈ రైలును జులై 6 నుంచి మార్చి 29వరకు పొడిగించారు. 07609 జల్నా - తిరుపతి సోమవారం నడుస్తుంది. జల్నాలో ఉదయం 7 గంటలకు బయలుదేరి తిరుపతికి మర్నాడు ఉదయం 10.45కి చేరుతుంది. ఈ రైలును జులై 7 నుంచి మార్చి 30 వరకు పొడిగించారు. 07610 తిరుపతి - జల్నా మంగళవారం నడుస్తుంది. తిరుపతిలో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి జల్నాకు మరునాడు మధ్యాహ్నం 3.50కి చేరుతుంది. ఈ రైలును జులై 8 నుంచి మార్చి 31వరకు పొడిగించారు. 07233, 07234 రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లకు 1ఏసి, 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయి. 07609, 07610 రైళ్లు పర్బార్, సేలు, మన్వత్ రోడ్డు, పర్భని, గంగాఖేర్, పర్లివైజయంత్, లాతూర్ రోడ్డు, ఉద్గిర్, బీదర్, మర్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతాయి.

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ గొడవలతో

వ్యక్తి ఆత్మహత్య!



మృతుడు రాజేష్

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, తరచూ భార్యభర్తలు గొడవపడటంతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి కృష్ణా కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు మంగళవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా, నూజివీడు హజరయ్యపేటకు చెందిన వలివేటి రాజేష్ లండన్‌లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తూ కుటుంబసభ్యులతో అక్కడే ఉంటున్నాడు. అక్కడ భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రాజేష్ నూజివీడులో ఉన్న తండ్రికి ఫోన్‌చేసి బాధను చెబుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 16న రాజేష్ భార్య, కుమారుడిని తీసుకుని ఇండియా వచ్చాడు. రాజేష్ భార్య కుమారుడిని తీసుకుని విజయవాడ కండ్రికలో ఉన్న ఆమె సోదరి ఇంటికి వెళ్లగా, రాజేష్ తండ్రితో కలిసి ఆటోలో ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు రాజేష్ తండ్రికి ఫోన్‌చేసి విజయవాడ బస్టాండ్‌లో ఉన్నానని, కృష్ణానదిలో దూకటానికి వెళుతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మంగళవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజీ పాత కెనాల్‌లో ఓ మృతదేహం ఉన్నట్టు పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా ప్రాంతానికి వెళ్లి రాజేష్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాసులు కురిపిస్తున్న కాటా డ్యూటీ

(5వ పేజీ తరువాయి)

పడి కాటా వద్ద ఉద్యోగులను నియమించారు. కోల్ ప్లాంట్, బ్రాయిలర్ మిల్స్‌లో సుదీర్ఘ అనుభవం గల ఉద్యోగులను తీసుకొని వచ్చి యాస్ కాటా డ్యూటీ వేయడం వల్ల ప్లాంట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులు స్పందించి ప్లాంట్‌లో అక్రమాలపై దృష్టి సారించాలని ప్లాంట్ పతిష్టను కాపాడాలని పలువురు కోరుతున్నారు. ప్లాంట్ నుంచి బూడిద రవాణా చేసుకునే అనుమతులు ఎవరికి ఉన్నాయో, ఎవరికి లేవో, ఏ వాహనం లోనికి వెళుతుందో, ఏ వాహనం బయటకు వస్తుందో తెలియక ఎస్‌పీఎఫ్ స్టాఫ్ తలలు పట్టుకుంటున్నారు. వాహనాలను లోడింగ్‌కు అనుమతిస్తూ ఉద్యోగులు గేట్ పాస్ ఇస్తే దాన్ని ఎస్‌పీఎఫ్ అధికారులు లోనికి పంపుతారు. వచ్చి పోయే వాహనాలకు అసలు అనుమతి పత్రాలు ఉన్నాయా లేవా అనే విషయాన్ని తమకు తెలపాలని గతంలో పని చేసిన ఉన్నతాధికారిని లిఖిత పూర్వకంగా కోరినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. బూడిద రవాణాలో అవినీతికి చరమగీతం పాడాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే ఆదాయానికి నష్టం కలిగించిన నేరస్తుల అరెస్టు

రైల్వేస్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తులకు నష్టం చేస్తూ రైళ్లపై రాళ్లు రువ్వడం, పట్టాలపై వివిధ వస్తువులు ఉంచి, ప్రయాణికుల భద్రతకు ముప్పుతెస్తున్న పలువురు నేరస్తులను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రాళ్లు రువ్విన కేసుల్లో 102 మందిని ట్రాక్‌లపై వస్తువులను ఉంచినందుకు 33 మందిని అరెస్టు చేశారు. ఈమేరకు 2025 మే మాసాంతం వరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పనితీరు, ప్రయాణికుల భద్రత పట్ల రైల్వేశాఖ తీసుకుంటున్న చర్యల గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ జోన్ అంతటా అప్రమత్తంగా ఉండి జనవరి నుంచి మే వరకు 128 రాళ్లు రువ్విన కేసులను నమోదు చేసిందన్నారు. వాటిలో 85 కేసుల్లో నిందితులను గుర్తించి 102 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రైల్వే ట్రాక్‌లపై వివిధ వస్తువులను ఉంచినందుకు 29 కేసులను నమోదు చేశారని, వాటిలో 26 కేసుల్లో 33మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారని, ఈ కేసులన్నీ కూడా విచారణలో ఉన్నాయన్నారు. రైళ్లపై రాళ్లు రువ్వేవారిని, ట్రాక్‌లపై వస్తువులు పెట్టేవారిని గుర్తించినట్లయితే 139కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గంజాయి విక్రయిస్తూ..

(5వ పేజీ తరువాయి)

విసిరేశాడు. దీన్ని గమనించి పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సాంబశివరావుపై 15 కేసులు ఉన్నాయి. అతడిపై సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ ఉంది. సత్యనారాయణపురం, నున్న పీఎస్‌ల్లో రెండు గంజాయి కేసులు ఉన్నాయి. ఒక అత్యాచారం కేసు, హత్యాయత్నం కేసు ఉన్నాయి. ఇవి కాకుండా వాహన దొంగతనాలు, ఇళ్లలో చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

సమస్యలతో సహజీవనం

(5వ పేజీ తరువాయి)

సతమతం అవుతున్నారు.

కన్నెత్తిచూడని రెండు జిల్లాల అధికారులు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే నాటికి జిల్లాల విభజన జరగలేదు. తర్వాత ఉమ్మడి కృష్ణా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలుగా ఏర్పడింది. అయితే ప్రస్తుతం విజయవాడ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎన్టీఆర్ జిల్లా వాసులుగా రికార్డులో ఉండగా, వారికి కృష్ణాజిల్లా వణుకూరులో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఉంది. దీంతో రెండు జిల్లాల అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతకాలం హౌసింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ లేఅవుట్ ఉండగా, ఇప్పుడు వారు కూడా ముఖం చాటేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ లేఅవుట్‌ను వీఎంసీ అధికారులు తమకు అధికారికంగా అప్పగించలేదని వణుకూరు పంచాయతీ అధికారులు తప్పించుకుంటున్నారు. వీఎంసీ కమిషనర్‌గా ధ్యానచంద్ర బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు లే అవుట్ వైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటి వరకు రాలేదని ఆరోపణ కూడా ఉంది.

నీరు లేక కన్నీళ్లు

కాలనీలో నీటి వసతి కోసం పైపులైన్లు, ట్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బోరు వేసుకుంటేనే నీరు. వాతావరణం అనుకూలించక విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇక అంతే సంగతి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒకరోజంతా కరెంటు లేకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు.

మట్టి రోడ్లే దిక్కు

కాలనీలో ప్రధాన రహదారితో పాటు వీధుల్లో మట్టి రోడ్లు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం బురదతో నిండిపోయి అడుగుతీసి అడుగు వేయడానికి స్థానికులు భయపడుతున్నారు. దీనికి తోడు కాలనీలో భారీ వాహనాలు వెళ్తుండటంతో రోడ్లు గోతులమయం అయ్యాయి. చినుకు పడితే వాహనాలు జారిపోయేలా ఉన్నాయి. మద్దూరు- గోసాల ప్రధాన రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది.

కరెంట్ కష్టాలు

లే అవుట్‌లో వీధి దీపాలు అక్కడక్కడ కనిపిస్తాయి. వాటిలో ఎన్ని వెలుగుతాయో చెప్పలేని పరిస్థితి. పాముల సంచారం ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. కాలనీలో కొన్ని చోట్ల కరెంటు లైన్లు ఉన్నా వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదు.

ఎక్కడి మురుగు అక్కడే..

కాలనీ రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. వీటికి తోడు పిచ్చి మొక్కలతో ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది.

బస్సు కోసం పరుగులు

మద్దూరు వరకు 121 ఎం బస్ సర్వీస్ నడుస్తోంది. ఈ కాలనీ వాసులకు ఈ బస్సే ఆధారం. ప్రయాణికులు ఉన్నచోట బస్సు ఆపకుండా ఎక్కడో ఆపుతున్నారని, అక్కడకు పరుగులు తీయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక చోట స్థిరమైన ప్రదేశంలో బస్సు ఆపేలా, అక్కడ బెంచీలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102,110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ రేపు

భారతీనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం క్యాంపస్ డ్రైవ్ ఇంటర్వ్యూ - 2025 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఉదయం 9గంటల నుంచి జరుగుతుందన్నారు. ఇందులో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఐటీఐ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిమ్స్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో

డాక్టర్ సత్యవేణికి 12వ ర్యాంక్



డాక్టర్ సత్యవేణి

విజయవాడ కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన ఆల్ ఇండియా ఎయిమ్స్ సర్జికల్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష లో గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్న డాక్టర్ సత్యవేణి జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్ సాధించారు. డాక్టర్ సత్యవేణి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎంఎస్‌లను 2023లో పూర్తిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని నిమ్రా మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు మంగళగిరిలోని ఎయిమ్స్‌తో పాటు ఏదైనా ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ (అంకాలజీ) చేయడానికి ప్రవేశం లభిస్తుంది. ఈమె భర్త డాక్టర్ మాచర్ల సృష్టి కూడా జాతీయ స్థాయిలో జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించి బెంగళూరులోని శ్రీ జయదేవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో వాస్కులర్ సర్జరీ (ఎంసీహెచ్)లో ప్రవేశిస్తున్నారు. వీరిరువురూ తాడేపల్లిలో ఉంటున్న ప్రముఖ చిత్రకారుడు మాచర్ల బాబ్జీ కోడలు, కుమారుడు.



విద్యార్థినికి పుస్తకాలను పంపిణీ చేస్తున్న శాయిన బుజ్జి, పొట్లూరి సాయిబాబు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పటమట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 12వ డివిజన్ సంజయ్‌నగర్ సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు శాయిన బుజ్జిలు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే ప్రతి విద్యార్థికి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అందించిందన్నారు. విద్యామిత్ర కిట్లను అందించి పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుందన్నారు. కొండవీటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధార్థ మహిళా కళాశాలలో ...



పీబీ సిద్ధార్థ కళాశాలలో ...

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

లబ్బీపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం కృష్ణా యునివర్సిటీ ఆదేశాలతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యునివర్సిటీ ప్రొఫెసర్ ఎల్.సుశీల యోగాసనాలు వేయించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటి దైనందిక జీవితంలో శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలంటే నిత్యం వ్యాయామంతో పాటు యోగాను కూడా ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ వి.వి సుబ్రహ్మణ్య కుమార్, వార్డెన్ కె.ఎస్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

కళాశాలల్లో ఉత్సాహంగా యోగాంధ్ర

మొగల్రాజపురం: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమయ్య ప్రాజెక్టు సంయుక్తంగా మంగళవారం కళాశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సన్నాహక యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 151 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు వివిధ పద్ధతులలో యోగాసనాలు వేశారు. అనంతరం యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు.

పటమట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మారిస్ స్టెల్లా కళాశాలలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు కాలేజీ నుంచి బెంజిసర్కిల్ వరకు యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బెంజిసర్కిల్‌లో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.





మారిస్ స్టెల్లా విద్యార్థినుల ర్యాలీ, యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

కోలాహలంగా బ్యాంకులు

- తల్లికి వందనం పథకం డబ్బులు తీయడానికి బారులు తీరిన మహిళలు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: తల్లికి వందనం పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో నగరంలో పండగ వాతావరణం నెలకొంది. సీఎం చంద్రబాబుపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన తల్లికి వందనం ఇంట్లో ప్రతి విద్యార్థికి అందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇంటికి ఒకరికి మాత్రమే పరిమితమైన పథకం, ఇప్పుడు ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి వర్తిస్తోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ డబ్బులు అకౌంట్లలో జమ అవుతున్నాయి. ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.13వేలు జమ చేయడంతో నగరంలో బ్యాంకుల వద్ద కోలాహలం వాతావరణం నెలకొంది. తల్లికి వందనం పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేసిన డబ్బుల కోసం బ్యాంకు వద్ద సందడి వాతావరణం నెలకొంది. స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమై ఫీజులు కట్టే సమయం కావడంతో తమ అకౌంట్లలో డబ్బులు తీయడానికి వచ్చిన మహిళలతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. పిల్లలకు పుస్తకాలు కొనుగోలు చేసే సమయానికి డబ్బులు జమ చేసినందుకు సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



మహిళలతో కిటకిటలాడుతున్న కృష్ణలంక యూనియన్ బ్యాంకు

ఫీజుల భారం తగ్గుతుంది



పాఠశాలలు ప్రారంభ సమయానికి ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉంది. ఈ డబ్బుతో మాపై ఫీజుల భారం కొంతైనా తగ్గుతుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలుంటే అంతమందికి పథకం ద్వారా డబ్బులు వేయడంతో చాలా మంది పేదలు మంచి పాఠశాలల్లో చదివించడానికి ఆస్కారముంది.

-చిలుకూరి జయశ్రీ, కృష్ణలంక

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

లబ్బీపేట/ మొగల్రాజపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లబ్బీపేట, మొగల్రాజపురంలోని పలు మాల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.బందరురోడ్డులోని జోయాలుక్కాస్ షోరూం, మొగల్రాజపురంలోని శారదా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడ సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిప్రమాద నిరోధక పరికరాలు ఉపయోగించు విధానం, ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఏ విధంగా ఆర్పాలి, ఫైర్ స్ప్రింకర్లు ఫైర్ డిటెక్టర్‌లు ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారమ్ ఏ విధంగా వస్తుందనే అంశాలను వివరించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన ప్రయాణికుడిపై కేసు

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పరకాల ఆర్టీసీ డిపో డ్రైవర్ సూరా శ్రీనివాసరావుపై కత్తితో దాడి చేసిన ప్రయాణికుడిపై మంగళవారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం పరకాల ఆర్టీసీ డిపో డ్రైవర్ సూరా శ్రీనివాసరావు, మరో డ్రైవర్ సోమవారం సాయంత్రం బస్సులో ప్రయాణికులను ఎక్కించుకుని గుంటూరు బయలుదేరారు. విజయవాడ బస్‌స్టేషన్ అవుట్‌గేట్ వద్ద ప్రయాణికుడు బాషా గుంటూరు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. వారధి వద్ద డ్రైవర్ సూరా శ్రీనివాసరావు బస్సు ఆపి లగేజీ ఇచ్చేందుకు బస్సు దిగాడు. ఆ సమయంలో బాషా శ్రీనివాసరావు సీటులో కూర్చున్నాడు. శ్రీనివాసరావు బస్సు ఎక్కిన తరువాత తాను కూర్చోవటానికి బాషాను లేచి వెనక్కి వెళ్లమని చెప్పాడు. ఈ వ్యవహారంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శ్రీనివాసరావు సీటులో కూర్చొని నిద్రపోతుండగా వెనక్కి వెళ్లిన బాషా తన వద్ద ఉన్న కత్తిని తీసుకుని ఆవేశంగా వచ్చి శ్రీనివాసరావుపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో శ్రీనివాసరావుకు తీవ్రగాయాలయ్యాయి. మరోడ్రైవర్ ప్రయాణికుల సహాయంతో బాధితుడిని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాషా గుంటూరులో ఉన్న తన పొలం వద్దకు వెళుతూ కత్తి తీసుకువెళుతున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

పది తప్పిన విద్యార్థులకు శిక్షణ నేటి నుంచి

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి తప్పిన విద్యార్థులకు బుధవారం నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్టు కొత్తపేటలోని ఎస్ఆర్ఎస్‌వీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎస్ఆర్ఎస్‌వీ బీఈడీ కళాశాల) సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మాజేటీ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె.దుర్గ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన చేస్తారన్నారు. వివరాలకు 79955 93859లో సంప్రదించాలన్నారు.

తల్లికి వందనంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లి విజయలక్ష్మికి గౌరవం ఇవ్వని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి తల్లికి వందనం పథకం గురించి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో 5, 14, 21 డివిజన్ల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు, తల్లులు తల్లికి వందనంతో ఆనందంగా ఉన్నారని, వారి ఆనందాన్ని చూసి జగన్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. స్కూల్ డెవలప్‌మెంట్ ఫండ్‌గా రూ.2 వేలు తీసుకుంటే ఆ నిధులు లోకేష్ జేబులోకి వెళ్లాయని వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డివిజన్ కమిటీలను త్వరగా నియమించాలన్నారు. తూర్పు పరిశీలకుడు వెలగపూడి శంకర్‌బాబు మాట్లాడుతూ డివిజన్ కమిటీల నియామకంలో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు, ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండా ప్రవీణ్, చిత్తం నాగేంద్రరెడ్డి, నందిపాటి దేవానంద్, వీరంకి డాంగియా కుమారి, నర్రా కిషోర్, కర్నా కోటేశ్వరరావు, ఎల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'మా రాముడు అందరివాడు' చిత్రీకరణ



మాట్లాడుతున్న హీరో సుమన్

గాంధీనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ ముఖ్యపాత్రలో నటిస్తున్న 'మా రాముడు అందరివాడు' చిత్రం చిత్రీకరణ స్థానిక హనుమాన్‌పేటలోని అలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో ఎమ్మెల్యే, గ్రామస్తుల మధ్య జరిగే సంభాషణల సన్నివేశాన్ని చిత్రీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సుమన్ మాట్లాడారు. దర్శకుడు మైఖేల్ చెప్పిన కథ నచ్చడంతో ఈ చిత్రంలో నటించడానికి అంగీకరించినట్లు తెలిపారు. మంచి కథాంశం, ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు చిన్న చిత్రాల్లో పని చేస్తున్నారని, వీటిని ఆదరించి, నటీనటులను ప్రోత్సహించాలని ప్రేక్షకులను కోరారు. చిత్రం హీరో శ్రీరామ్ మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. ఈ నెల 26న చిత్రం ట్రైలర్ విడుదల చేస్తున్నామని, విజయదశమి రోజు తెలుగు, తమిళం, మలయాళం హిందీ భాషల్లో చిత్రం విడుదల అవుతుందన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది చిత్రాల్లో నటించిన తనను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నట్లు చెప్పారు. దర్శకుడు మైఖేల్ మాట్లాడుతూ పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంలో అద్భుతంగా ఈ చిత్ర నిర్మాణం జరుగుతుందన్నారు. చిత్ర నిర్మాత అనుమల లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసే అవినీతి, అక్రమాలను నిలదీసే సన్నివేశాలు నిజ జీవితానికి దగ్గరగా ఉంటాయన్నారు.

బధిర విద్యాలయంలో అడ్మిషన్ల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని ఆదిత్య బధిర విద్యాలయంలో 2025-26లో ప్రవేశంకు సంబంధించి బధిర విద్యార్థుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు మూగ, చెవుడు (బధిరులు) విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు కొన్ని రకాల స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హాస్టల్ వసతి ఉన్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకుల పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్యనారాయణపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆటో మోటారు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆల్‌ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రకోశాధికారి కె.దుర్గారావు అన్నారు.

దుర్గాపురం బీఆర్‌టీఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేశవ్యాప్త కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చి కార్మికుల హక్కులను హరించేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్‌కే. దుర్గావలి, డి.కోటయ్య, జె.సూర్యనారాయణ, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో ముగిసిన బంగారు, వెండి ఆభరణాల అప్పగింత

ఇంద్రకీలాద్రి, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి):

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి చెందిన బంగారు, వెండి ఆభరణాల అప్పగింత కార్యక్రమం రెండో రోజు మంగళవారం ముగిసింది.

పూర్వ ఈవో కె.ఎస్.రామారావు పదవీ విరమణ తరువాత ఇటీవల రెగ్యులర్ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వి.కె. శీనా నాయక్‌కు దేవస్థానంలో ఉన్న బంగారు, వెండి ఆభరణాల అప్పగింత కార్యక్రమం సోమ, మంగళవారాల్లో నిర్వహించారు.

రికార్డుల ప్రకారం బంగారు, వెండి ఆభరణాలు, అర్చకుల వద్ద ఉండే అమ్మవారి అలంకరణ ఏడు వారాల నగలు, వెండి సామగ్రి, తదితరాలను జాబితా ప్రకారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సంబంధిత విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థి రంగాచార్యులును అభినందిస్తున్న యాజమాన్యం

అంతర్జాతీయ వేదికపై సిద్ధార్థ విద్యార్థి ప్రతిభ

పెనమలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యార్థి ముడుంబి రంగాచార్యులు అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ద్విచక్రవాహనదారుల నిద్ర మూఢతను ముందుగానే గుర్తించి ప్రమాదాలు నివారించేందుకు న్యూరోరైడ్ అనే పరికరాన్ని అభివృద్ధి చేసి అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందాడు. వీఆర్ సిద్ధార్థలో రెండో ఏడాది బీటెక్(ఏఐ) చదువుతున్న రంగాచార్యులు గత మేలో అమెరికాలోని టెక్సాస్ స్టేట్ యూనివర్సిటీలో నిర్వహించిన గ్లోబల్ జూనికార్న్ అండ్ ఏఐ స్టేట్ సమ్మిట్ 2025లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించారు. విద్యార్థి రంగాచార్యులును ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ మలినేని రాజయ్య, వీసీ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రోవీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు అభినందించారు.



రైతులకిచ్చే ప్లాట్ల స్థలాలను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● అధికారులకు ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి ఆదేశాలు

విజయవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన రైతులకిచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసి వాటిల్లో మౌలిక సదుపాయాల విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి ఆదేశాలు జారీచేశారు. మంగళవారం జోన్-2,7ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జోన్-7లో కొండమరాజుపాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో 2.6 వేల ఎకరాల్లో చేపట్టాల్సిన లే అవుట్ల అభివృద్ధికి ఇంజినీరింగ్ అధికారులు సమాయత్తం కావాలన్నారు. రాజధాని రైతులకు అభివృద్ధి చేసి ఇవ్వాల్సిన లే అవుట్లలో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచినీటి, భూగర్భ, వర్షపునీటి పారుదల వ్యవస్థ నిర్మాణాలకు ముడిసరుకును కొనుగోలు చేయాలని చీఫ్ ఇంజినీరు సీహెచ్ ధనుంజయను ఆదేశించారు. జోన్-1లోని అబ్బరాజుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాల పరిధిలో 2.85 వేల ఎకరాల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్, ఐవీడీ హెడ్ కేవీ గణేష్‌బాబు, ఎస్ఈ ఆర్ హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డీఈ పీ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

యోగాపై ఓల్గా ఆర్చరీ అకాడమీ ప్రత్యేక గీతం

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓల్గా ఆర్చరీ అకాడమీ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ నేతృత్వంలో యోగాపై రూపొందించిన ప్రత్యేక గీతానికి సంబంధించిన పూర్తి నిడివి గల వీడియోను శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ పీ ఎస్ గిరీష శాప్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న యోగాంధ్ర ద్వారా ప్రపంచ స్థాయి రికార్డును నమోదు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించడం జరిగిందన్నారు. ఏవో రమావత్ వెంకట రమణ నాయక్, పీఎస్‌వో ఎస్. వెంకటరమణ, చెరుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

22న గుంటూరులో పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రాష్ట్ర సదస్సు

గాంధీనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విప్లవ విద్యార్థి ఉద్యమం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు వేదిక ఏపీ కన్వీనర్ ఆర్ భరద్వాజ్ తెలిపారు. ఈ నెల 22న గుంటూరులో ఈ సదస్సు జరుగుతుందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర బలగాలు ఇటీవల అబూజ్ మాడ్ అటవీ ప్రాంతంలో హత్య చేసిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావుతో పాటు బీజాపూర్ అటవీ ప్రాంతంలో హత్యకు గురైన తెంటు లక్ష్మీ, వెంకట నరసింహాచలం స్మృతిలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ 1974లో ఆవిర్భవించిన రాడికల్ విద్యార్థి సంఘం కళాశాలలో విద్యార్థులపై జరుగుతున్న వేధింపులను ఎదిరించి నిలిచిన ఘటనలను గుర్తు చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నేత, న్యాయవాది నున్న అరవింద్ మాట్లాడుతూ గ్రామాల్లో దళిత, బడుగు ప్రజలపై భూస్వామ్యం అణచివేతను ప్రపంచం ముందు ఉంచడంలో రాడికల్ విద్యార్థుల పాత్ర గుర్తుంచుకోవాలన్నారు.

చిచ్చురేపిన మట్టి రవాణా!

» ట్రాక్టర్లు అడ్డుపెట్టుకొని గొడవకు దిగిన రెండు వర్గాలు

» పోలీసుల జోక్యం, సద్దుమణిగిన వివాదం



చెరువు వద్ద గొడవపడుతున్న రెండు వర్గాలు

మైలవరం రూరల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): చెరువులోని మట్టి రవాణా రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. నీ ఒక్కడిదేనా చెరువు పంచాయతీకి సంబంధించిందని, మేము మట్టిని తోలుకుంటామని ప్రశ్నించడంతో రెండు గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగిన ఘటన మంగళవారం జరిగింది. మండలంలోని పుల్లూరు సమీపంలోని దాసుళ్లపాలెం జాతీయ రహదారిపై బొర్రగూడెం చెరువు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పుల్లూరు సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకొని చంద్రగూడెం పంచాయతీ పరిధిలోని బొర్రగూడెం చెరువు సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈచెరువు కింద 200 ఎకరాలకు పైగా రైతుల పంట పొలాలున్నాయి. అయితే బొర్రగూడెం అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు 20 రోజులుగా చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మంగళవారం చంద్రగూడెం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు పంచాయతీ పరిధిలోని చెరువు కాబట్టి మేము కూడా మట్టిని తోలుకుంటామని కొన్ని ట్రాక్టర్లను తీసుకొని వచ్చి మట్టి తోలే ప్రయత్నం చేశారు. వీరికి బొర్రగూడెంకు చెందిన మరో టీడీపీ నాయకుడు వీరంకి వెంకటేశ్వరరావు సహకారం అందించగా, అదే గ్రామానికి చెందిన మరో వర్గం ట్రాక్టర్లతో అడ్డుకున్నారు. చెరువు ఒకరికి సంబంధించినది కాదని, పంచాయతీకి సంబంధించిందని, అందరికి మట్టి తోలుకోవడానికి హక్కు ఉందని, అసలైన నాయకుడు రాకుండా చోటా నేతలను పంపి ట్రాక్టర్లును అడ్డుపెడతారా, నెల రోజుల నుంచి మట్టిని అమ్ముకున్నది ఎవరో అందరికీ తెలుసని కొందరు అనడంతో రెండువర్గాల వారికి మాట మాట పెరిగి గొడవకు దారితీసింది. చంద్రగూడెంకు చెందిన కొందరు ఏదేమైనా సరే తామూ మట్టి తోలుతామని పట్టుబట్టారు చంద్రగూడెం వాళ్లు. మట్టి తోలితే ఊరుకునేది లేదని ట్రాక్టర్లు అడ్డుకుంటామని బొర్రగూడెంకు చెందిన వారు భీష్మించుకుని కూర్చున్నారు. సుమారు 2, 3 గంటలు గొడవ జరిగింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని రెండువర్గాలను పంపించి వేయడంతో గొడవ సద్దుమణిగింది. మట్టి తోలకాలు కూడా ఆగిపోయాయి.

పీల్చేగాలి స్వచ్ఛంగా ఉండాలి

జాతీయ పరిశుభ్రమైన గాలి కార్యక్రమంపై 4న వర్క్‌షాప్: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియ

కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్ర సాకారానికి, కాలుష్య రహిత సమాజానికి మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండటం కీలకమని, వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా సమష్టి కృషి అవసరమని, ఇందుకు భాగస్వామ్య పక్షాలు చేతులు కలపాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించి, దుమ్మూధూళి వ్యాప్తిచెందకుండా గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళికణాలను లక్ష్యాల మేరకు తగ్గించే కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. 2024-25లో పీఎం 10 సూక్ష్మ ధూళికణాల పరిమాణం 64 పీజీ/ఎంగా నమోదైందని, దీన్ని బాగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీఎంఎస్ పనులను త్వరగా పూర్తిచేయాలి

సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణతో వాహనాల సాఫీ ప్రయాణంతో గాలి కాలుష్యం మోతాదును తగ్గించవచ్చని, ఇందుకు ఉపయోగపడే ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను రూ.5 కోట్లతో చేపట్టడం జరిగిందని, ఈ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అడ్డుకట్టవేయండి

సింగిల్ యూజ్, ప్లాస్టిక్‌ను ఎక్కడా ఉపయోగించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్సులు, షాపింగ్ జోన్లు, రైతు బజార్లపై దృష్టిపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పీ శ్రీనివాస్, డీసీపీ ఎం కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) పీ సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్ఎం కే బాబ్జి, వీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆర్టీవో ఆర్ ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బీ సాంబయ్య, డీఎస్‌వో ఏ పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి పాల్గొన్నారు.

కళాత్మక యోగా అదరహో..

యోగాంధ్రలో భాగంగా జిల్లాలో మూడు రోజుల పాటు వివిధ అంశాల్లో యోగాసనాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాత్మక యోగా పోటీలు అదరహో... అనిపించాయని, న్యాయ నిర్ణేతల సమక్షంలో పారదర్శకంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్ నందు న్యాయ నిర్ణేతల సమక్షంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫొటోగ్రఫీ, యోగా స్లోగన్, వంటి అంశాలపై రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించామన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 15 కేటగిరిల్లో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపుల్లో విజేతలు మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి చేరుకున్నారన్నారు. ఈ బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొంటారని, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

యోగాసనలతో నిత్య నూతనోత్సహం

సత్యనారాయణపురం: యోగాసనాలతో ప్రతి ఒక్కరూ నిత్య యవ్వనంతో నూతనోత్సాహంతో ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్రలో వాకర్స్ క్లబ్, చాంబర్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాసనాలు ప్రజల జీవనశైలిలో భాగం చేసేందుకు యోగాంధ్ర ఎంతగానో దోహదపడుతుందన్నారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ గవర్నర్ టీ హనుమంతరావు, జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి జే శివ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు వేమూరి బాబూరావు, అమర్‌నాథ్, ఏ విజయలక్ష్మి, వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని యోగాశిక్షకులు పాల్గొన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయండి

● జేసీ ఇలక్కియ



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - హైదరాబాద్ సెక్షన్‌లో జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65ను ఆరులైన్ల రహదారిగా విస్తరణ, పెడన విసన్నపేట-2 ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇనస్పెక్షన్ పనులను వేగవంతం చేసి నివేదికలను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్ రోడ్డులకు భూసేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహణ వంటి పలు అంశాలపై మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ 65 రహదారికి సంబంధించి 226 కి.మీ 6 లైన్ల విస్తరణలో భాగంగా నందిగామ డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో జాతీయ రహదారుల అధికారులకు ఎన్‌జాయిమెంట్ సర్టిఫికెట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపాల్సి ఉందన్నారు. అనుమంచిపల్లి, షేర్ మహ్మద్‌పేట, తోటచర్ల, భీమవరం గ్రామాలకు సంబంధించి ఆయా మండలాల తహసీల్దార్లు ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెడన, విసన్నపేట-2 ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణకు జిల్లాలో విసన్నపేట, తిరువూరు మండలాల్లో 9 గ్రామాల నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉండగా 5 గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్డీవోకు సూచించారు. అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్‌హెచ్ అధికారులు అవసరమైన భూమికి ప్రతిపాదనలు పంపారని, రికార్డులు పరిశీలించి 3ఏ రిపోర్టు తయారుచేసి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి కంచికచర్ల, మైలవరం, జి.కొండూరు మండలాల్లో 3ఏ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జాతీయ రహదారి గ్రీన్‌ఫీల్డ్ ఎలైన్‌మెంట్ సంబంధించి 273 ఎకరాలకు గాను 243 ఎకరాలను సేకరించడం జరిగిందని మిగిలిన 30 ఎకరాల పట్టా భూమిని సేకరించేందుకు 3ఏ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా భూములను సర్వేచేసి 3 డీ రికార్డులను సమర్పించాలన్నారు. భూములను సర్వే చేసేందుకు సర్వేయర్లు అందుబాటులో లేకుంటే ఇతర మండలాల నుంచి సర్వేయర్లను డిప్యుటేషన్‌పై నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు, జేసీ సూచించారు. విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కె.చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్లు ఎం విద్యాసాగర్ (విజయవాడ), ఎం రామాంజనేయరెడ్డి (ఖమ్మం), టి పార్వతీశం (అమరావతి), సంబంధిత మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

అమరావతిలో బౌద్ధులు, లామాలు, మాంక్స్‌లకు

వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

● నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా



ఖాట్మాండ్‌లో వీరాంజనేయులను శాలువాతో సన్మానిస్తున్న నూర్బు తుండు షెర్పా (తుప్టెన్ జిన్పా)

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బౌద్ధులు, లామాలు, మాంక్స్‌లకు రాజధాని అమరావతిలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా (తుప్టెన్ జిన్పా) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన్ను అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు నేపాల్ రాజధాని ఖాట్మాండ్‌లో మంగళవారం భేటీ అయ్యారు. తుప్టెన్ జిన్పాను అమరావతికి రావాల్సిందిగా వీరాంజనేయులు కోరారు. నేపాల్ బుద్ధిష్ట్ సమాఖ్యకు కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు తుప్టెన్ జిన్పాను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు అమరావతి విశిష్టత, బౌద్ధారామ క్షేత్రం, గౌతమ బుద్ధుడి ధాతువులు, మహాచైత్యం, బౌద్ధ శిల్ప సంపదను, ధ్యాన బుద్ద ప్రాజెక్టు తదితరాల విశిష్టతను తెలియజేస్తూ తుప్టెన్ జిన్పాను అమరావతికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమరావతిలో దలైలామాలతో కలిసి అప్పట్లో జరిగిన కాలచక్ర ఉత్సవాలకు హాజరైనట్టు తుప్టెన్ జిన్పా గుర్తు చేసుకున్నారు. అమరావతిని తాను బుద్ధిస్టుల పరమ పవిత్ర ప్రదేశంగా భావిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం బుద్ధిస్టులకు సకల సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. అనంతరం జాస్తి వీరాంజనేయులకు శాలువా కప్పి సన్మానించారు. త్వరలోనే ఒక బృందాన్ని అమరావతికి పంపిస్తామని జిన్పా తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకారం

● పారిశ్రామికవేత్తలతో ముఖాముఖిలో కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తామని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందు కు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అ వకాశాలను అందిపుచ్చుకొని పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రా వాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలా జీ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) ఆధ్వర్యంలో తాడిగడపలోని వందడుగుల రో డ్డులోని అన్నే వారి కల్యాణమండపంలో పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను జిల్లా యంత్రాంగం తరపున సహకరించి ప్రోత్సహిస్తామన్నారు. ఎవరికైనా సమస్యలుంటే పరిష్కరించి త్వరగా అనుమతులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలను అడి గి తెలుసుకొన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజ లి శర్మ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్ట ర్ ముందుకు రావడం సంతోషదాయకమని పారిశ్రామికవేత్తలు అన్నారు. డీఐసీ జీఎం ఆర్ వెంకట్రావు, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, ఎల్‌డీఎంసీ రవీంద్రారెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆశారాణి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పీ భాస్కరరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ చైర్ పర్సన్ వీ నాగలక్ష్మి, అధినేత శ్రీనివాస సతీష్, ఏపీ ఎంఎస్ఎంఈ సంఘం అధ్యక్షుడు బాయన వెంకట్రావు, వీఏసీడీసీఎల్ సీఎండీ అన్నే శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.



వన్‌టౌన్ హెడ్ పోస్టాఫీసులో

విద్యార్థుల తల్లుల సందడి

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లోని హెడ్ పోస్టాఫీసు విద్యార్థుల తల్లులతో కళకళలాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాల్లో జమ చేసిన డబ్బులను తీసుకునేందుకు విద్యార్థుల తల్లులు క్యూలైన్లలో బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల బ్యాంకు, పోస్టాఫీసుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో వన్‌టౌన్‌లోని హెడ్ పోస్టాఫీసులో సోమ, మంగళవారాల్లో తల్లుల రాకతో సందడిగా మారింది. వన్‌టౌన్ హెడ్ పోస్టాఫీసు పరిధిలోని ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పోస్టాఫీసులలో సోమ, మంగళవారం సుమారు రూ.10.50 కోట్లు విద్యార్థుల తల్లులు తమ ఖాతాల నుంచి డబ్బులు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో వారి కుటుంబాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

వరుస చోరీలకు పాల్పడిన దొంగలు అరెస్టు

● డీఎస్పీ చలసాని శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చలసాని శ్రీనివాస్

గన్నవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు దొంగతనాలకు పాల్పడిన నలుగురు అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.14లక్షల విలువైన మోటార్ సైకిళ్లు, 60 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. మే 3న పొట్టిపాడు రామాలయం వీధిలో బాణాల సుభాషిణి అనే మహిళ నిద్రిస్తుండగా తెల్లవారు ఝామున గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి మెడలోని 5 కాసుల బంగారు నానుతాడు దొంగిలించినట్లు ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం శివారు వేగవరానికి చెందిన పారేపల్లి శేషు, పోలవరపు నాగ దుర్గా ప్రసాద్, దుగ్గిరాల శివరామకృష్ణను గుర్తించినట్టు తెలిపారు. ప్రధాన ముద్దాయి శేషు అదుపులోకి తీసుకుని 5 కాసుల బంగారం గొలుసుతో పాటు ఒక మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన దత్తి నవీన్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గుత్తుల రవికుమార్ సాయి శ్రీరామ్ ముగ్గురు బృందంగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడినట్టు చెప్పారు. ఆత్కూరు, వీరవల్లి, గన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. వీరి కదలికపై సమాచారం అందుకున్న ప్రత్యేక బృందం ఈ ముగ్గురినీ, చోరీ చేసిన బైకును పొట్టిపాడు టోల్‌గేటు దగ్గర అదుపులోకి తీసుకుని విచారించగా 4 బైకులు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. పెదపాడు, కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసిన దొంగతనాలకు చోరీ సొత్తు రికవరి చేసినట్టు తెలిపారు. ఇప్పటికే వీరు పలు కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. వీరి నుంచి రూ.10 లక్షలు విలువైన మోటార్ సైకిళ్లు, బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని గన్నవరం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. దర్యాప్తు చేసిన హనుమాన్ జంక్షన్ సీఐ కే వీవీఎన్ సత్యన్నారాయణ, ఎస్సై చావా సురేష్, సిబ్బంది సిగంశెట్టి నరేష్, కొడాలి ఆంజనేయులు, నక్కా మహేశ్వరరావు, ఆవుటపల్లి రామారావు, బెజగం మహేష్‌ను అభినందించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

● న్యాయవాదిపై దాడికి పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం



నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదిపై సత్యనారాయణపురం పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బెజవాడ బార్ న్యాయవాదులు విధులను బహిష్కరించి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది జెట్టి ప్రణీత్‌కుమార్ కుటుంబ వివాదం నేపథ్యంలో సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌కు ఈనెల 8న వెళ్లగా అక్కడున్న కానిస్టేబుల్ న్యాయవాదిపై దాడిచేసి కొట్టాడన్నారు. దీనిపై సీఐకు ఫిర్యాదు చేసినా న్యాయవాది అయితే ఏంటంటూ పరుషంగా మాట్లాడారని బాషా పేర్కొన్నారు. వెంటనే 9న సీపీకి సత్యనారాయణపురం సీఐ, కానిస్టేబుల్, ఎస్ఐలపై ఫిర్యాదు చేయగా ఆయన సత్యనారాయణపురం ఏసీపీని విచారణ చేసి నివేదిక ఇమ్మన్నారని ఆదేశించారన్నారు. అలాగే బార్ కూడా నిజనిర్ధారణ కమిటీ వేసిందని, ఆ కమిటీ ఇచ్చే రిపోర్టు మేరకు, ఈసీ నిర్ణయం మేరకు న్యాయవాదిపై దాడికి పాల్పడ్డ పోలీసులను ఏం చేయాలనేది నిర్ణయిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం వీలైనంత త్వరగా రావాలని బాషా ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 18 జూన్ 2025



ఓణీల్లో వెలుగు నగలు!

ఫ్యాషన్

ఓణీల ఫంక్షన్‌లో సంప్రదాయ నగలదే పెద్ద పీట అయినా, వాటికి కొంత ఆధునికతను జోడిస్తే సరికొత్తగా వెలిగిపోవచ్చు. ఇందుకోసం అవే నగలకు కొత్త హంగులు అద్దాలి.



ఇలాంటి నగలు మేలు

మెడలో రెండు హారాలకు బదులు ఒకే హారాన్ని ఎంచుకునేపనైతే, కాస్త భారీగా ఉండే మధ్యస్థ పొడవున హారాన్ని ఎంచుకోవచ్చు. వీటిలో వెచ్చించే డబ్బును బట్టి ప్లెయిన్ గోల్డ్ లేదా వజ్రాల నగలను ఎంచుకోవచ్చు. అలాగే వేడుక సమయాన్ని బట్టి కూడా నగల ఎంపికలో కొన్ని నియమాలు పాటించాలి. వేడుక ఉదయం అయితే పూర్తి బంగారంతో తయారైన నగలు బాగుంటాయి. అలాకాకుండా రాత్రి వేళ అయితే మెరిసే జాతి రాళ్లు, మరీ ముఖ్యంగా పోల్కి, కుందన్, మోజనైట్స్ లేదా వజ్రాల నగలైతే మిరుమిట్లు గొలుపుతూ ఆడపిల్లల అందాన్ని రెట్టింపు చేస్తాయి.

కాసుల పేరు, వరాల మాల

ఓణీల వేడుకలో ఆడపిల్లలకు పోల్కి, నెక్లెస్, కాసుల హారం కూడా వేసుకోవచ్చు. ఇవి సంప్రదాయ నగలు కాబట్టి కాసుల హారం పాత ఫ్యాషన్ అనుకోనవసరం లేదు. కాసుల పేరు వద్దనుకునే వారు, 'రాంపరి వరాల మాల' వేసుకోవచ్చు. మరీ భారీ నగలు ఎంచుకుంటే పిల్లలు పెద్దయ్యాక వేసుకోలేకపోవచ్చు. కాబట్టి కాస్త తేలికపాటి మాలనే ఎంచుకోవటం మేలు. వీటిని తర్వాత అయినా మార్చుకోవచ్చు.



తక్కువ బరువులో

వడ్డాణం కొనలేకపోతే, బంగారు మెరుగు వేసిన వెండి నగలూ, గిల్టువీ దొరుకుతాయి. మాంగ్ టీకా (పాపడి బిళ్ల), చంపసరాలు, ముక్కు పుడక అలంకరించటం కూడా తాజా ఫ్యాషన్. ఇవి తక్కువ బరువులోనే దొరుకుతాయి. కాబట్టి తక్కువ బంగారంతో ఆడంబరంగా అలంకరించాలనుకుంటే వీటిని ఎంచుకోవాలి. వీటితోపాటు జడ బిళ్లలూ అలంకరించుకోవచ్చు.



116 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రిటిష్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో **బ్రెయిస్ మెట్రివెలీ** అనే 47 ఏళ్ల మహిళ... తొలిసారిగా చీఫ్‌గా ఎంపికైంది. ప్రపంచ అస్థిరతతో పాటు పెరుగుతున్న భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో మెట్రివెలీతో పాటు గతంలో ఇంటెలిజెన్స్ సర్వీస్‌లో సేవలందించిన మరికొందరు మహిళలు కూడా అమోఘమైన ప్రతిభను కనబరిచారు. వాళ్ల గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

బ్రిటన్ నిఘాకు లేడీ బాస్



న్యూస్ మేకర్

జేమ్స్‌బాండ్ 007 సినిమాలు చూసే అలవాటున్న వాళ్లకు, శక్తివంతమైన 'ఎమ్' పాత్ర పోషించిన నటి 'జూడి డెంచ్' ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇప్పుడు నిజ జీవితంలో అదే పాత్రను పోషించబోతోంది బ్రెయిస్ మెట్రివెలీ. తాజాగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన విదేశీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్, ఎమ్ఐ6 మెట్రివెలీని చీఫ్‌గా ఎంచుకుంది. దాంతో ప్రస్తుతం ఎమ్ఐ6లో, టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్‌కు డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్న మెట్రివెలీ, అక్టోబరు 1న, ఎమ్ఐ6కు 18వ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టబోతోంది. గతంలో ఎమ్ఐ5లో దేశ భద్రతకు సంబంధించి కీలక బాధ్యతలు నిర్వహించిన మెట్రివెలీ, 1999లో కేస్ ఆఫీసర్‌గా ఇంటెలిజెన్స్ సేవల్లోకి అడుగుపెట్టింది. సేవల సంప్రదాయం ప్రకారం కొత్త చీఫ్ కాబోతున్న మెట్రివలీ 'సి' అనే పేరును ఉపయోగించుకోబోతోంది. వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో ఎ లెవల్స్ పూర్తి చేసిన మెట్రివెలీ కేంబ్రిడ్జ్, పెంబ్రోక్ కాలేజీలో ఆంత్రొపాలజీ చదివింది. 1997లో మహిళల పడవ పందెంలో గెలుపొందిన సిబ్బందిలో ఈమె కూడా ఒక సభ్యురాలు. 1999లో ఇంటెలిజెన్స్‌లో చేరిన ఈమె, ఎమ్ఐలో డైరెక్టర్ స్థాయిలో సేవలందించింది. 2021లో టెలిగ్రాఫ్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన కుటుంబం గురించి వివరిస్తూ, పిల్లలు స్వయంగా దర్యాప్తు చేసి తన అసలు వృత్తి గురించి తెలుసుకున్నారనే విషయాన్ని బహిర్గతం చేసింది. మెట్రివెలీ మాదిరిగానే నిరంతర సవాళ్లను ఎదుర్కొంటూ, అత్యద్భుతమైన మేథస్సును ప్రదర్శిస్తూ, ఇంటెలిజెన్స్, గూఢచర్య రంగాల్లో గణనీయమైన కృషి చేసిన మహిళాధికారులు గతంలో ఎంతోమంది ఉన్నారు. వాళ్ల గురించి కూడా తెలుసుకుందాం!



వర్జీనియా హాల్

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో అత్యంత విశిష్టమైన గూఢచారిగా మారిన అమెరికా మహిళ ఈమె. కృత్రిమ చెక్క కాలుతో విధులు నిర్వహించిన ఈ మహిళ, ఆఫీస్ ఆఫ్ ది స్ట్రాటెజిక్ సర్వీసెస్‌కు ఫీల్డ్ ఏజెంట్‌గా పని చేస్తూ, విధ్వంసక మిషన్లు చేపట్టడంలో మిత్రదేశాల సైనికులు తప్పించుకోవడంలో కీలక పాత్ర పోషించింది. యుద్ధ సమయంలో విశిష్టమైన సర్వీస్ క్రాస్‌ను అందుకున్న ఏకైక మహిళా పౌరురాలు.. ఈ వర్జీనియా హాల్.

నూర్ ఇనాయత్ ఖాన్

బ్రిటిష్ ఇండియన్ రాకుమారి, మొట్టమొదటి మహిళా వైర్‌లెస్ ఆపరేటర్ అయిన ఈమెకు నోరా బేకర్ అనే మరో పేరు కూడా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఈమెను నాజీ ఆక్రమిత ఫ్రాన్స్‌లోకి పంపించారు. మ్యాడెలీన్ అనే కోడ్ నేమ్‌తో విధులు నిర్వర్తించిన నూర్, చివరకు పట్టుబడి ప్రాణాలు పోగొట్టుకునే వరకూ కీలకమైన సమాచారాన్ని చేరవేస్తూనే ఉంది. నూర్ కనబరిచిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఆమెను జార్జ్ క్రాస్ బిరుదుతో గౌరవించారు.

ఏమీ ఎలిజబెత్ థోర్ప్

ఈ ఆంగ్లో అమెరికన్ మహిళా గూఢచారికి బెట్టీ ప్యాక్, బెట్టీ థోర్ప్, ఎలిజబెత్ ప్యాక్ అనే ఇతరత్రా పేర్లు కూడా ఉన్నాయి. ఈమె రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్‌కూ, అమెరికాకూ సేవలందించింది. సింథియా అనే కోడ్ నేమ్ కలిగి ఉన్న ఏమీ, తన అందచందాలతో విదేశీ అధికారులను ఆకట్టుకుని, వారి నుంచి జర్మన్ ఎనిగ్మా కోడ్స్, ఫ్రెంచ్ నావిక రహస్యాలతో పాటు సున్నిత సమాచారాన్ని రాబట్టింది.

మెలిటా నార్‌ఉడ్

ఈ బ్రిటిష్ ప్రభుత్వోద్యోగిని, కొన్ని దశాబ్దాల పాటు సోవియట్ యూనియన్‌కు రహస్యంగా అణు రహస్యాలను చేరవేసింది. బ్రిటనల్‌లో దీర్ఘకాలం పాటు పని చేసిన సోవియట్ గూఢచారి ఈమె. 'హోలా' అనే కోడ్ నేమ్‌తో పని చేసినన మెలిటా గూఢచర్యం ఆమె మరణానంతరం బహిర్గతమైంది.

ఇల్లు చూడచక్కగా...

- రోజూ ఆఫీసుకు వెళ్లే హడావుడిలో అవసరం కోసం తీసిన వస్తువులను పక్కన పడేసి వెళ్తూ ఉంటాం. ఇలా తీసిన వస్తువులను కొంచెం ఓపిక చేసుకుని వాడిన వెంటనే యథాస్థానంలో పెట్టేస్తే ఇల్లు శుభ్రంగా ఉంటుంది.
- హడావుడిలో బట్టలను ఎలా పడితే అలా లాగుతాం. అది బాలేదు ఇది బాలేదు అని తేల్చుకోలేక మార్చుతూ ఉంటాం. దీంతో అల్మారా చిందరవందరగా మారుతుంది.

  ఇలా కాకుండా ఉండాలంటే ముందు రోజు రాత్రే రేపు వేసుకునే బట్టలను నిర్ణయించుకుని అల్మారాలోంచి బయటకు తీసి పెట్టుకోవాలి.
- షాపింగ్‌కు వెళ్లినప్పుడు నచ్చింది అనో, తక్కువ రేటు అనో అనవసర వస్తువులను కొంటుంటాం. ఆ తర్వాత వాటికి స్థలం లేక ఎక్కడో ఒక దగ్గర ఇరికిస్తూ ఉంటాం. ఇలాంటి వాటివల్ల ఇల్లు గందరగోళంగా మారుతుంది. అవసరమైతేనే ఏదైనా కొనడం మంచిది.
- ఇంట్లో వాడని వస్తువులను, అనవసరమైన వాటిని, పాత వాటిని అవసరంలో ఉన్న వారికి ఇవ్వాలి లేదా పడెయ్యాలి.



- మూడు నాలుగు నెలలకు ఒకసారి ఇలాంటి వాటిని వేరు చేయడం వల్ల ఇంట్లో చెత్త తగ్గుతుంది. కొత్త వస్తువులకు స్థలం దొరుకుతుంది.
- తరచూ వాడే వస్తువులను అందుబాటులో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు మాత్రమే వాడే వాటిని లోపలి వైపు పెట్టుకోవాలి.

ప్రజారథ సారథి

బస్సులో డ్రైవింగ్ సీటు అంటే... అందులో కచ్చితంగా మగవారే కనిపిస్తారు. దశాబ్దాలుగా చూస్తున్న దృశ్యం ఇది. కానీ ఆ సంప్రదాయానికి తెరదించారు **వాంకుతోడు సరిత.** ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (డీటీసీ)లో పదేళ్లపాటు బస్సు నడిపిన ఆమె... ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో మొట్టమొదటి మహిళా డ్రైవర్‌గా చరిత్ర సృష్టించారు. మహిళలు తలుచుకొంటే అసాధ్యమనేది ఏదీ లేదంటున్న సరిత... 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.



సంకల్పం

"యాదాద్రి భువనగిరి జిల్లా సీపీయానాయక్ తండాలో వ్యవసాయ కుటుంబం మాది. అమ్మ రుక్క, నాన్న రాంకోటి. మేం ఆరుగురు సంతానం. ఐదుగురు ఆడపిల్లల్లో నేను చిన్నదాన్ని. స్థానికంగా పదో తరగతి వరకు చదువుకున్నా. అక్కల పెళ్లిళ్ల చేయడంతో మా కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. రోజు గడవడం కష్టంగా మారింది. దీంతో నేను చదువు ఆపేసి... 2004లో ఊళ్లో ఆటో నడపడం మొదలుపెట్టాను. ఒకటీ రెండు కాదు ఆరేళ్లపాటు ఆటో నడిపాను. అమ్మానాన్నలకు ఆసరా అయ్యాను. ఒక ఆడపిల్ల ఆటో నడపడం అంటే అందరూ వింతగా చూసేవారు. కొందరు అభినందించేవారు.

ఢిల్లీ వెళ్లి డ్రైవింగ్...

అలా ఒక స్వచ్ఛంద సంస్థ దృష్టిలో పడ్డాను. సంస్థ వారు నన్ను ఢిల్లీకి తీసుకువెళ్లి డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు. అక్కడ నేను భారీ వాహనాలు నడపడం నేర్చుకున్నాను. సదరు సంస్థ దేశవ్యాప్తంగా మొత్తం 15 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది. అందులో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నది నేనొక్కదాన్నే. బాగా నైపుణ్యం సంపాదించాక హెవీ వెహికిల్ లైసెన్స్ తెచ్చుకున్నాను. దాంతో 'ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా ఉద్యోగం లభించింది. ఆ క్షణం ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. దేశ రాజధాని. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు. ఆ రహదారులపై భారీ వాహనం నడపడం అంటే సాధారణ విషయం కాదు. అడుగడుగునా సవాళ్లు ఎదురవుతాయి. కానీ నేను ఏ రోజూ ఇబ్బంది పడిందిలేదు. నావల్ల కాదని అనుకోలేదు.

కన్నవారి కోసం...

పదేళ్లపాటు ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో పని చేశాను. ప్రభుత్వ ఉద్యోగం. మంచి జీతం. కానీ ఊళ్లో అమ్మానాన్నలను చూసుకోవడానికి ఎవరూ లేకపోవడం నన్ను బాధించింది. ఓ రోడ్డు ప్రమాదంలో నాన్న కాలు విరిగింది. వయోభారంతో కంటిచూపు మందగించింది. ఇటీవల ప్రమాదవశాత్తూ అమ్మ కాలికి కూడా ఫ్రాక్చరయింది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సొంతూరికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నాను. దాంతో ఢిల్లీలో ఉద్యోగం వదిలేశాను. నేను ఉద్యోగం మానేయడంతో మాకు ఏ ఆధారం లేకుండాపోయింది. దీంతో స్థానిక నాయకులు, అధికారులను కలిశాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి వివరించాను. నా నైపుణ్యం, అనుభవాన్ని గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పించాలని విన్నవించుకున్నాను. ఆ ప్రయత్నాలు ఫలించాయి. అయితే ప్రస్తుతం ఆర్టీసీలో నేరుగా నియామకాలు లేకపోవడంతో తాత్కాలికంగా జేబీఎం విద్యుత్ బస్సు నడిపేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు హైదరాబాద్- మిర్యాలగూడ రూట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను. ఢిల్లీ రద్దీ రోడ్లపై బస్సు నడిపిన అనుభవం వల్ల ఇక్కడ డ్రైవింగ్ ఎంతో సులువుగా అనిపిస్తోంది. అన్నిటికీ మించి అమ్మానాన్నలను దగ్గరుండి చూసుకోగలుగుతున్నాను. ఇప్పుడు నా మనసు కాస్త కుదటపడింది."

> **అందుకే పెళ్లి వద్దనుకున్నా...**
>
> నలుగురు అక్కలకు పెళ్లిళ్ల సమయంలో డబ్బు సర్దుబాటుకాక అమ్మానాన్న ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వారి కష్టం చూసి నేను ఎంతో బాధపడేదాన్ని. నేను వారికి భారం కాకూడదనుకున్నాను. అందుకే ఆటో నడిపాను. కన్నవారికి దూరంగా ఢిల్లీ వెళ్లి ఉద్యోగం చేశాను. నా పెళ్లితో అమ్మానాన్నలపై మరింత భారం మోపకూడదని అనుకున్నాను. అంతేకాదు... నేను అత్తింటికి వెళ్లిపోతే వాళ్లు ఒంటరి అయిపోతారు. వృద్ధాప్యంలో ఏ దిక్కూ లేక అవస్థలు పడతారు. అందుకే చివరి వరకు వారికి తోడుగా ఉండాలని భావించి... పెళ్లి చేసుకోకూడదనే నిర్ణయానికి వచ్చాను.



• యస్.సోమేశ్వర్

స్వతంత్రంగా ఎదగనివ్వాలి

పేరెంటింగ్

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమతో అపురూపంగా పెంచాలని అనుకుంటారు. పిల్లలకు సంబంధించిన ప్రతి పనినీ దగ్గరుండి చేస్తూ వాళ్లకి ఏ కష్టమూ కలగకూడదని తాపత్రయపడుతూ ఉంటారు. ఈ ధోరణి వల్ల పిల్లలు స్వతంత్రంగా ఏ పనీ చేయలేక పోతున్నారు. అలాకాకుండా పిల్లలకు చిన్నప్పటి నుంచే సొంత పనులు చేసుకోవడంతోపాటు ఇతర పనులూ చేయడం నేర్పించాలని నిపుణులు సూచిస్తున్నారు..



- పిల్లలకు ఉదయాన్నే నిద్ర లేవడం అలవాటు చేయాలి. కొంచెం పెద్ద పిల్లలు అయితే దుప్పట్లు మడతపెట్టడం, పక్క సర్దడం లాంటివి చేయమని చెప్పవచ్చు. నిద్ర లేవగానే పళ్లు తోముకోవడం, మంచినీళ్లు తాగడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం, యూనిఫామ్ లేదా బట్టలు వేసుకోవడం, షూ లేసులు కట్టుకోవడం లాంటి వాటిని దగ్గరుండి నేర్పించాలి.
- బడికి వెళ్లేముందు బ్యాగ్‌లో పుస్తకాలు సర్దుకోవడం, లంచ్ బాక్స్- వాటర్ బాటిల్ పెట్టుకోవడం లాంటి పనులను వాళ్లనే చేసుకోనివ్వాలి. బడి నుంచి ఇంటికి రాగానే లంచ్ బాక్స్‌ను వంటగది సింక్‌లో వేయడం అలవాటు చేయాలి..
- సాయంత్రం వేళ కొద్ది సేపు తోట పని చేయడం, పెంపుడు జంతువులను బయటికి తీసుకెళ్లడం, బజారు నుంచి వస్తువులు కొని తీసుకురావడం లాంటి పనులు చేయించాలి.
- ఇంట్లో నానమ్మ, తాతయ్య లాంటి పెద్దవారికి సహాయం చేయడం, చిన్నపిల్లలను ఆడించడం నేర్పించాలి. వంటచేసేటప్పుడు చిన్న చిన్న పనులు చెప్పి చేయించాలి.
- వారాంతాల్లో ఇల్లు శుభ్రం చేసేటప్పుడు పిల్లల సహాయం అడగాలి. వాళ్లు ఆడుకునే బొమ్మలు, రోజూ వేసుకునే బట్టలు, యూనిఫామ్‌లు, పుస్తకాలను కేటాయించిన అరల్లో చక్కగా ఎలా సర్దాలో చేసి చూపించాలి.
- యుక్తవయసు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, వంటచేయడం, బట్టలు ఉతకడం వంటివి నేర్పించాలి. బ్యాంక్ సంబంధిత ఆర్థిక వ్యవహారాలపై కొద్దిపాటి అవగాహన కల్పించాలి. వివిధ రకాల బిల్లులు చెల్లించడం, పొదుపు చేయడం, ప్రథమ చికిత్స పద్ధతుల గురించి తెలియజెప్పాలి.
- పిల్లలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు వాళ్లు ఏవిధంగా పరిష్కరించుకుంటున్నారో గమనించాలి. అవసరమైతేనే సహాయం చేయాలి. పెద్దలను సలహా అడగడం అలవాటు చేయాలి.
- పిల్లలు ఏదైనా పొరబాటు చేస్తే దానినుంచి ఎలా పాఠం నేర్చుకోవాలో సూచించాలి.
- గెలిచినప్పుడు పొంగిపోవడం, ఓడినప్పుడు కుంగిపోవడం కాకుండా రెంటినీ సమానంగా స్వీకరించే విధానాన్ని నేర్పించాలి.

శరీరం నుంచి దుర్వాసనా..?

కొంతమందికి శరీరం నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, వాతావరణ కాలుష్యం, మితిమీరి చెమట పట్టడం లాంటి కారణాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్నపాటి జాగ్రత్తలతో ఈ సమస్యనుంచి బయటపడవచ్చు.

- ఈ సమస్య ఉన్నవారు లేత రంగుల్లో పలుచగా ఉండే కాటన్ బట్టలు వేసుకోవడం మంచిది. నైలాన్, సిల్క్ బట్టలు అలాగే మందంగా ఉండే వాటిని వేసుకుంటే గాలి ఆడక చెమట పెరిగి శరీరం నుంచి వాసన వస్తుంది. వీలైతే ఆరు గంటలకు ఓసారి బట్టలను మార్చుకోవడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.
- రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. సబ్బుతో కాకుండా సున్నిపిండి లేదా కుంకుడు రసంతో శరీరాన్ని రుద్దుకుంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రమవుతాయి. హానికారక బ్యాక్టీరియాలు కూడా తొలగి సమస్య చాలావరకు తీరుతుంది.
- తల, చెవుల వెనక భాగం, మెడ, పాదాల మీద ఎక్కువగా చెమట పడుతూ ఉంటుంది. దీనివల్ల కూడా శరీరం నుంచి దుర్వాసన రావచ్చు. స్నానం చేసేటప్పుడు ఈ భాగాలను ప్రత్యేకంగా శుభ్రం చేసుకోవాలి.
- స్నానం చేసిన తరవాత పొడిగా పరిశుభ్రంగా ఉన్న దుస్తులను మాత్రమే ధరించాలి. ఒకసారి వేసుకున్న బట్టల మీద చెమట, దుమ్ము, ధూళి చేరి ఉంటాయి. ఇవి దుర్వాసనకు కారణం కావచ్చు. ఇలాంటి దుస్తులను ఉతకకుండా మరోసారి వేసుకోకూడదు.
- దుస్తులను ఉతికిన తరవాత వాటిని గాలి తగిలేలా ఆరేయాలి. పొడిగా ఆరిన తరవాతనే వాటిని మడతపెట్టాలి. బట్టలు సరిగా ఆరకపోతే ఒక్కోసారి వాటి నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. వీటిని అలాగే ధరిస్తే శరీరానికి చెడు వాసన పడుతుంది.
- పాదాలకు ధరించే సాక్స్, కాన్వాస్ షూస్ లాంటివాటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- సెంట్లు, పెర్ఫ్యూమ్‌లను ఎక్కువగా ఉపయోగించకూడదు. ఇవి సమస్యను మరింత పెంచుతాయి.
- ఒక్కోసారి ఆహారపు అలవాట్లు కూడా సమస్యకు కారణం కావచ్చు. ఉల్లి, వెల్లుల్లి, మాంసాహారం ఎక్కువగా తీసుకోకూడదు. జింక్, మెగ్నీషియం, పీచు పదార్థాలు ఉండే ఆహారాన్ని తరచూ తీసుకోవడం మంచిది.



బిజినెస్

విజయవాడ ● బుధవారం 18 జూన్ 2025

ఎన్ఎస్ఈలో మంగళవారం.. బీఎస్ఈలో గురువారం



- ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజుల్లో మార్పులు
- ఆమోదం తెలిపిన సెబీ.. సెప్టెంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)లో ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజులు మారబోతున్నాయి. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఈ కాంట్రాక్టుల ముగింపు రోజు గురువారం కాగా, మంగళవారానికి మార్చేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. అలాగే, బీఎస్ఈలో ప్రస్తుతం ఈ కాంట్రాక్టుల ముగింపు రోజు మంగళవారం కాగా, గురువారానికి మారనుంది. 2025 సెప్టెంబరు 1న లేదా ఆ తర్వాత ముగియనున్న కొత్త ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టులన్నింటికీ ఈ మార్పు వర్తించనుంది. ఆగస్టు 31న లేదా అంతకంటే ముందు ముగియనున్న కాంట్రాక్టులకు మాత్రం ప్రస్తుత ముగింపు షెడ్యూలే వర్తిస్తుందని స్టాక్ ఎక్స్ఛేంజీలు స్పష్టం చేశాయి. వచ్చే నెల 1 నుంచి ఇండెక్స్ ఫ్యూచర్స్‌పై కొత్త వీక్లీ కాంట్రాక్టులను ప్రవేశపెట్టబోవడం లేదని బీఎస్ఈ వెల్లడించింది. అలాగే, ఇప్పటికే ప్రవేశపెట్టిన కాంట్రాక్టుల్లో లాంగ్ డేటెడ్ ఇండెక్స్ ఆప్షన్‌తో కూడిన వాటికి కూడా ప్రస్తుత షెడ్యూల్‌లో మార్పు ఉండదని ఎక్స్ఛేంజీలు తెలిపాయి. ముగింపు రోజుల్లో మార్పు ప్రక్రియ సాఫీగా జరిగేందుకు వీలుగా ఎక్స్ఛేంజీలు సమగ్ర వివరాలతో కూడిన సర్క్యులర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నాయి. ఎక్స్ఛేంజీల్లో అన్ని ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజును మంగళవారం లేదా గురువారానికి పరిమితం చేయాలంటూ గత నెలలో సెబీ ఆదేశించింది. అలాగే, ఏదైనా కాంట్రాక్టును ప్రవేశపెట్టేటప్పుడు లేదా ముగింపు రోజును మార్చేటప్పుడు తన అనుమతి తీసుకోవాలని ఎక్స్ఛేంజీలను సెబీ కోరింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టు ముగింపు రోజుల్లో ఎక్స్ఛేంజీలు కోరిన మార్పులకు సెబీ తాజాగా ఆమోదం తెలిపింది.

టీసీఎస్‌లో కొత్త 'బెంచ్' రూల్స్

35 రోజులు మించితే ఉద్యోగానికే ఎసరు!

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు కొత్త బెంచ్ రూల్స్ ప్రకటించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఏ ఉద్యోగి ఇక ఏటా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉండడాన్ని అనుమతించరు. ఈ నెల 12 నుంచే ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రాజెక్టులు (పని) లేక ఉద్యోగులు ఖాళీగా ఉండడాన్ని ఐటీ కంపెనీల్లో 'బెంచ్' అంటారు. ప్రతి ఉద్యోగి ఏటా కనీసం 225 రోజుల పాటు తప్పనిసరిగా ఏదో ఒక ప్రాజెక్ట్ పనిలో నిమగ్నమై ఉండాలని టీసీఎస్ స్పష్టం చేసింది. ఏ ఉద్యోగి అయినా ఏటా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉంటే.. అది వారి జీతం, ప్రమోషన్లు, విదేశాలకు పంపే అవకాశాలు కోల్పోవడంతో పాటు ఉద్యోగానికి కూడా ముప్పు తెచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. బెంచ్ సమయంలో ఉద్యోగులే చొరవ తీసుకుని కంపెనీకి చెందిన వేరే ప్రాజెక్టుల్లో పని వెతుక్కోవాలని స్పష్టం చేసింది.



మారుతి సుజుకీ ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త గ్రాండ్ విటారా ఎస్-సీఎన్‌జీ విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.13.48 లక్షలు నెక్స్ట్ జెన్ కే-సిరీస్, 1.5 లీటర్ ఇంజన్, డ్యూయల్ జెట్, ఆర్ 17 అల్లాయ్ వీల్స్, ఆరు ఎయిర్ బ్యాగ్స్‌తో దీన్ని తీసుకువచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	95
వరంగల్	91	గుంటూరు	100
కరీంనగర్	91	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	92
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	85	అనంతపురం	97
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,370 ▼	92,000 ▼	1,20,000 ▲
విజయవాడ	1,00,000 ▼	94,000 ▼	1,10,000 ▲
విశాఖపట్నం	1,02,030 ▲	92,000 ▼	1,20,000 ▲
రాజమండ్రి	1,00,360 ▼	92,000 ▼	1,09,700 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,06,000 ▲
ముంబై	99,147 ▼	90,819 ▼	1,09,100 ▲

మార్కెట్లో లాభాల స్వీకరణ



- 212 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- రూ.2.61 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 369 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్.. చివరికి 212.85 పాయింట్ల నష్టంతో 81,583.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.10 పాయింట్లు కోల్పోయి 24,853.40 వద్ద క్లోజైంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు మళ్లీ కాస్త ఎగబాకడంతో పాటు ఈ వారంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ట్రేడర్లు ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

అలాగే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లపై త్వరలోనే సుంకాలను ప్రకటించనున్నారన్న వార్తలతో ఔషధ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టాలు చవిచూడగా.. సన్‌ఫార్మా షేరు 2.18 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.67 శాతం వరకు నష్టపోయాయి.

ఫండ్ల నిర్వహణలోని ఆస్తులు.. తెలంగాణలో 32 శాతం వృద్ధి

గత నెలతో ముగిసిన ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్ పథకాల్లోని తెలంగాణ ఇన్వెస్టర్ల ఆస్తులు 32.08 శాతం పెరిగాయని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తెలిపింది. ఫండ్ల నిర్వహణలోని వీరి సగటు ఆస్తులు 2024 మే నాటికి రూ.93,601.95 కోట్లుగా ఉండగా.. 2025 మే నాటికి రూ.1,23,633.60 కోట్లకు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా ఆధారంగా విశ్లేషించి మోతీలాల్ ఓస్వాల్ ఈ డేటాను విడుదల చేసింది.

స్టాక్ మార్కెట్ విశ్లేషకులు సంజీవ్ భాసిన్‌పై సెబీ షేధం

మీడియా చానెళ్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్లను సిఫారసు చేసే మార్కెట్ నిపుణుడు, ఐఐఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ సంజీవ్ భాసిన్‌తో పాటు 11 మందిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాక్ రికమండేషన్లలో భాగంగా కొన్ని కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు సాయపడ్డారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో సెబీ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ ద్వారా అయాచితంగా లబ్ధి పొందిన రూ.11.37 కోట్లను తమ వద్ద జమ చేయాలని నియంత్రణ మండలి వారిని ఆదేశించింది.

నేడు సెబీ బోర్డు భేటీ

సెబీ బోర్డు బుధవారం సమావేశం కానుంది. ఈ భేటీలో భాగంగా నియంత్రణపరంగా పలు సంస్కరణలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. సెబీ ఛైర్మన్‌గా తుహిన్ కాంత పాండే ఈ మార్చి 1న బాధ్యతలు చేపట్టాక జరగనున్న రెండో బోర్డు సమావేశం ఇది.

హైదరాబాద్ టు అడిస్ అబాబా



విమాన సర్వీస్ ప్రారంభించిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ | **మెడికల్ టూరిజానికి ఊతం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్.. హైదరాబాద్ నుంచి అడిస్ అబాబాకు నేరుగా విమాన సర్వీస్‌ను ప్రారంభించింది. మంగళవారం నుంచి ఈ డైరెక్ట్ విమాన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ సర్వీసెస్) టెక్లెహమ్యనోత్ జీ యోహన్నెస్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వారానికి మూడు సార్లు (సోమ, బుధ, శనివారం), అడిస్ అబాబా నుంచి మంగళ, గురు, శని వారాల్లో ఈ విమాన సర్వీస్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ఇప్పటికే భారత్‌లోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై నగరాల నుంచి వారానికి 50 ప్రయాణికుల, కార్గో విమాన సర్వీసులను నిర్వహిస్తోందన్నారు.

వృద్ధికి అపార అవకాశాలు: భారత్‌లో మెడికల్ టూరిజం శరవేగంగా వృద్ధి చెందుతూ వస్తుండటం ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు ఎంతగానో కలిసిరానుందని యోహన్నెస్ తెలిపారు. ఇందుకు తగ్గట్టుగానే హైదరాబాద్‌లోని హాస్పిటల్స్‌కు ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే రోగులకు ప్రత్యేక సేవలను అందించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం ప్రధాన హాస్పిటల్స్‌తో ఇప్పటికే చర్చలు సాగిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మెడికల్ టూరిజం ప్యాకేజీ పేరుతో ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. దీంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నట్లు యోహన్నెస్ తెలిపారు. కాగా హైదరాబాద్ నుంచి పూర్తి స్థాయిలో కార్గో సేవలను ప్రారంభించాలని చూస్తున్నామన్నారు. కొవిడ్ సమయంలో పాక్షికంగా ఫార్మా ఉత్పత్తులను రవాణా చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఫార్మా సహా ఐటీ సంబంధిత ఎగుమతి సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

ఎయిర్‌బస్ విడిభాగాల తయారీలోకి మహీంద్రా

స్పెయిన్ కంపెనీతో భాగస్వామ్యం

న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ అనుబంధ సంస్థ మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఎయిర్‌బస్, ఎంబ్రాయర్ విమానాల విడిభాగాల తయారీలోకి అడుగు పెడుతోంది. ఇందుకోసం స్పెయిన్‌కు చెందిన ఏర్నోవా ఏరోస్పేస్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ కాంట్రాక్టు విలువ 30 కోట్ల డాలర్లు (రూ.2,585 కోట్లు). ఈ కాంట్రాక్టు కింద ఎంబ్రాయర్‌కు చెందిన సి390 మిలీనియం మిలిటరీ రవాణా విమానం సహా పై రెండు కంపెనీల విమానాలకు చెందిన మెటల్ సబ్ అసెంబ్లీలు, విడిభాగాలు తయారు చేస్తుంది. స్పెయిన్, యూకే, పోర్చుగల్, బ్రెజిల్‌లలోని ఏర్నోవా కేంద్రాలకు వాటిని సరఫరా చేస్తుంది.

ఫ్రెంచ్ కంపెనీతో భారత్ ఫోర్జ్ ఒప్పందం

భారత రక్షణ దళాలకు "ఏరాక్" మానవ రహిత ఏరియెల్ వెహికల్ (యుఏవీ) సరఫరా కోసం ఫ్రెంచ్ కంపెనీ టర్గిస్ గైలార్డ్‌తో భారత్ ఫోర్జ్ ఒప్పందం కుదుర్చుకుంది. అతి తక్కువ ధరలో అత్యుత్తమ టెక్నాలజీని అందుబాటులో ఉంచే లక్ష్యంతో తయారుచేసినదే ఏరాక్ యూఏవీ. ఇది అత్యధిక ఎత్తులో విహరిస్తూ సుదూర తీరాలపై నిఘా పెడుతుంది. అలాగే అందులో అమర్చిన ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సెన్సర్లు, రాడార్ శత్రు సేనల దాడులను తట్టుకుంటూనే శత్రువుల కదలికలపై దృష్టి పెడుతుంది. ఒకటిన్నర టన్నుల పేలోడ్ సామర్థ్యం గల ఏరాక్ 24 గంటల కన్నా అధిక సమయం ఎగిరే సామర్థ్యం కలిగి ఉంది. తమ ఫ్యాక్టరీలో ఏరాక్ ఉత్పత్తి లైన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని భారత్ ఫోర్జ్ ఈ సందర్భంగా తెలిపింది.

స్పోర్ట్స్

అందుకే కెప్టెన్సీ వద్దన్నా..



లండన్: రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో భారత టెస్టు జట్టు పగ్గాలు వైస్‌కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రాకు అప్పగిస్తారని చాలామంది భావించారు. అయితే సెలెక్టర్లు మాత్రం అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. దీంతో బుమ్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న చర్చ మొదలైంది. అయితే పనిఒత్తిడిని తగ్గించుకునేందుకే తాను ఆ బాధ్యతలను వద్దన్నట్టు బుమ్రా చెప్పాడు. 'రోహిత్, విరాట్‌ల రిటైర్మెంట్‌కు ముందే.. ఐపీఎల్ జరుగుతున్నప్పుడే నేను బీసీసీఐతో మాట్లాడా. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో నాపై ఉండే వర్క్‌లోడ్ గురించి వారితో చర్చించా. అలాగే నాకు చికిత్స చేస్తున్న వైద్యుల సలహాలు కూడా తీసుకున్నా. వాస్తవానికి బోర్డు నన్ను కెప్టెన్‌గా చేసేందుకు సిద్ధపడింది. కానీ నేను సిరీస్ మొత్తం ఆడలేను. అలాంటప్పుడు ఒకే సిరీస్‌కు ఇద్దరు కెప్టెన్లు ఉండడం సరికాదు. అందుకే నేనే స్వయంగా ఫోన్ చేసి నాయకత్వ బాధ్యతలు వద్దని చెప్పా. నాకు కెప్టెన్సీ కన్నా క్రికెట్టే ఎక్కువ. ఓ ఆటగాడిగా మరింత సేవ చేసేందుకు ప్రయత్నిస్తాను' అని ఓ ఇంటర్వ్యూలో బుమ్రా వివరించాడు.

వైభవ్ ఫ్రెండ్.. అయాన్ దుమ్మురేపాడు





ముజఫర్‌పూర్ (బిహార్): ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ స్ఫూర్తితో బిహార్‌కే చెందిన మరో చిచ్చరపిడుగు అయాన్ రాజ్ ట్రిపుల్ సెంచరీతో దుమ్మురేపాడు. డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లో సంస్కృతి క్రికెట్ అకాడమీ తరపున 13 ఏళ్ల అయాన్ కేవలం 134 బంతుల్లో 327 పరుగులు సాధించాడు. అందులో 22 సిక్సర్లు, 41 ఫోర్లు ఉన్నాయి. అయాన్, వైభవ్ మంచి స్నేహితులు. వీరిద్దరూ కలసి ప్రాక్టీస్ కూడా చేసేవారు. 'వైభవ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. అతడి బాటలోనే నేనూ నడుస్తున్నా'నని అయాన్ చెప్పాడు. రాజ్ తండ్రి కూడా క్రికెటర్ కావడం విశేషం.

టీమిండియా రైలెక్కింది..

లీడ్స్: భారత క్రికెట్ జట్టు తొలి టెస్టు కోసం రైలు మార్గంలో లండన్ నుంచి లీడ్స్‌కు చేరుకొంది. మామూలుగా టీమిండియా ఎక్కడ దిగినా అభిమానులు భారీ సంఖ్యలో అభివాదం చేస్తూ కనిపిస్తుంటారు. అయితే లీడ్స్‌లో మాత్రం పట్టుమని పదిమంది ఫ్యాన్స్ కూడా కనిపించలేదు. బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండియా.. భారత్-ఎతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. కాగా, పేసర్ హర్షిత్ రాణాకు భారత జట్టులో చోటుదక్కింది. దీంతో అతడు జట్టుతో కలసి లీడ్స్‌కు చేరుకొన్నాడు. తొలుత ప్రకటించిన టీమ్‌లో రాణాకు చాన్స్ లభించలేదు. కానీ, భారత్-ఎ తరపున ఆడేందుకు అతడు ఇంగ్లండ్ వెళ్లాడు. అయితే, మరో పేసర్‌కు కవర్‌గా రాణాను అక్కడే ఉండిపొమ్మన్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో రాణా టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

రోహిత్+విరాట్=గిల్





లండన్: భారత టెస్టు జట్టు కొత్త సారథి శుభ్‌మన్ గిల్‌పై ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ జోస్ బట్లర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ యువ ఆటగాడి నాయకత్వం స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కెప్టెన్సీల మిశ్రమంగా ఉంటుందని అన్నాడు. 'గిల్ ప్రతిభావంతుడు. మాట్లాడే సమయంలో ప్రశాంతంగా, కచ్చితత్వంతో ఉంటాడు. కానీ మైదానంలో కాస్త దూకుడు కనిపిస్తుంటుంది. ఇది తమ మాజీ కెప్టెన్లు రోహిత్, విరాట్‌ల మాదిరిగానే ఉంటుంది. అందుకే ఆ ఇద్దరి వ్యవహారశైలి కలిస్తే గిల్ అని నేను భావిస్తాను. తను కూడా వారి నుంచి ఎంతో నేర్చుకున్నాడు. కానీ ఆటపై తన సొంత ముద్ర కూడా ఉంటుంది. క్రీజులో ఉండే సమయంలో గిల్ కేవలం బ్యాటర్‌గానే ఆలోచిస్తాడు. ఆ తర్వాత మాత్రం కెప్టెన్సీపై దృష్టి సారించాలనుకుంటాడు. ఇలా రెండు పాత్రలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తాడు' అని బట్లర్ వివరించాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఉన్న గిల్ ఆధ్వర్యంలోనే బట్లర్ ఆడుతున్న విషయం తెలిసిందే. కాగా ఈ సిరీస్‌లో ఇంగ్లండ్‌నే విజయం వరిస్తుందని ఆ దేశ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ అభిప్రాయపడ్డాడు.

అతను నాకంటే 20 ఏళ్లు చిన్నోడు

ఐపీఎల్‌లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఓ ప్రత్యేక ఆటగాడని బట్లర్ తెలిపాడు. 'రాజస్థాన్ తరపున అతడు మా జట్టుపైనే చెలరేగి లీగ్‌లో రెండో ఫాస్టెస్ట్ శతకం సాధించాడు. అతడి ఆట స్ఫూర్తిదాయకంగానే కాకుండా చూసేందుకు ఉల్లాసంగా ఉంటుంది. తను నాకంటే 20 ఏళ్లు చిన్నవాడు. అలాంటి వ్యక్తి మైదానం నలుపైపులా భారీ షాట్లతో హోరెత్తించాడు. నేను చూసిన ఆటగాళ్లలో అతడే అత్యుత్తమం అనిపించాడు. ఆ తర్వాత సీఎస్‌కే పైనా ఎలాంటి జంకు లేకుండా జడేజా, అశ్విన్ ఓవర్లలో సిక్సర్లు బాదాడు' అని బట్లర్ గుర్తుచేశాడు.

మళ్లీ అగ్రపీఠంపై మంధాన



ఆరేళ్ల తర్వాత టాప్‌లోకి

దుబాయ్: ఐసీసీ మహిళల వ్యక్తిగత వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఆరేళ్ల తర్వాత తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 727 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో 52 సగటుతో 264 పరుగులు సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగుపడింది. బ్రంట్ (ఇంగ్లండ్), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) 2, 3 ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగాన్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ (భారత్) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.

సిరీస్ నెగ్గిన సారథికి పటౌడీ మెడల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్-భారత్ టెస్ట్ సిరీస్‌లో ఏదో విధంగా పటౌడీ పేరు వినిపించాలన్న బీసీసీఐ, సచిన్ టెండూల్కర్‌ల విజ్ఞప్తికి ఇంగ్లండ్ బోర్డు స్పందించింది. సిరీస్ విజేతగా నిలిచిన కెప్టెన్‌కు పటౌడీ మెడల్‌ను బహూకరించనున్నట్టు ఈసీబీ తెలిపింది. ఈసీబీ భారత్-ఇంగ్లండ్ సిరీస్‌కు పటౌడీ పేరును తొలగించి దానికి అండర్సన్-టెండూల్కర్ పేరు పెట్టింది. దీంతో ఎలాగైనా పటౌడీ పేరు నిలిచి ఉండేలా చూడాలని సచిన్ విజ్ఞప్తి చేశాడు.

మొదలైంది... డబ్ల్యూటీసీ రేసు

18 టెస్టులు ఆడనున్న భారత్

2025-2027 షెడ్యూల్




భారత్ డబ్ల్యూటీసీ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	సిరీస్	ఎక్కడ
జూన్-ఆగస్టు 2025	ఇంగ్లండ్	5 టెస్టులు	ఇంగ్లండ్‌లో
అక్టోబరు 2025	వెస్టిండీస్	2 టెస్టులు	భారత్‌లో
నవంబరు 2025	దక్షిణాఫ్రికా	2 టెస్టులు	భారత్‌లో
ఆగస్టు 2026	శ్రీలంక	2 టెస్టులు	శ్రీలంకలో
అక్టోబరు 2026	న్యూజిలాండ్	2 టెస్టులు	కివీస్‌లో
జనవరి 2027	ఆస్ట్రేలియా	5 టెస్టులు	భారత్‌లో

దుబాయ్: రాబోయే రెండేళ్ల కోసం సరికొత్త వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్ మంగళవారం నుంచి ఆరంభమైంది. ఇందులో భాగంగానే శ్రీలంక-బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతోంది. ఇటీవల లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాను నాలుగు రోజుల్లోనే మట్టి కరిపించి దక్షిణాఫ్రికా తొలిసారి వరల్డ్ టెస్టు చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ పోరుతో 2023-2025 డబ్ల్యూటీసీ సీజన్ ముగిసింది. ఇక నాలుగో ఎడిషన్ కోసం మొత్తం తొమ్మిది జట్లు (భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, వెస్టిండీస్) పోటీపడుతున్నాయి. మరోవైపు అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లు ఆడే టెస్టులు మాత్రం డబ్ల్యూటీసీ కిందికి రావు.

ప్రతీ జట్టుకు ఆరు సిరీస్‌లు: డబ్ల్యూటీసీలో ప్రతీ జట్టు ఇంటా, బయటా కలిపి ఆరు సిరీస్‌లు ఆడుతుంది. ప్రతీ సిరీస్ కూడా రెండు నుంచి ఐదు టెస్టుల మధ్య ఉంటుంది. విజయాల ద్వారా గెలుచుకున్న పాయింట్లను బట్టి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. మొత్తంగా రెండేళ్లలో ఈ తొమ్మిది జట్లు 27 సిరీస్‌ల్లో తలపడతాయి. ఇంగ్లండ్ అత్యధికంగా 21 మ్యాచ్‌లు ఆడనుండగా.. ఆ తర్వాత ఆసీస్ (20), ఇండియా (18) ఉన్నాయి. ఇందులో గిల్ సేన స్వదేశంలో తొమ్మిది టెస్టులు మాత్రమే ఆడనుంది.

నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ ఓకే.. కానీ!



లండన్: నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ సుముఖత వ్యక్తం చేసిందని సమాచారం. అయితే, చిన్న జట్లకు మాత్రమే ఇది వర్తించనుంది. 2027-29 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సీజన్‌లో చిన్న దేశాలు ఎక్కువ టెస్ట్‌లు ఆడేందుకు అనుగుణంగా టెస్టు ఫార్మాట్‌లో ఓ రోజును తగ్గించనున్నారు. కానీ, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్లు సంప్రదాయ రీతిలో ఐదు రోజుల ఫార్మాట్‌లోనే ఆడాల్సి ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ 2017లోనే అనుమతించింది. 'ఐదు రోజులపాటు మ్యాచ్‌ను నిర్వహించడం చిన్నజట్లకు భారంగా మారింది. ఖర్చు పెరుగుతుండడంతో ఆయా జట్లు అనాసక్తిని ప్రదర్శిస్తున్నాయి. కొత్త ఫార్మాట్‌లో అయితే వేగంగా సిరీస్ ముగిసే అవకాశాలుంటాయ'ని ఐసీసీ వర్గాలు తెలిపాయి. కాగా, 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో మాత్రం ఐదు రోజుల మ్యాచ్‌లే జరగనున్నాయి.

3 సూపర్ ఓవర్లతో రికార్డు

నేపాల్-నెదర్లాండ్స్ టీ20 మ్యాచ్



గ్లాస్గో: క్రికెట్ మ్యాచ్‌ల్లో స్కోర్లు సమం కావడం అరుదుగా చోటుచేసుకుంటుంది. అలాంటి వేళ విజేతను తేల్చేందుకు సూపర్ ఓవర్‌ను నిర్వహిస్తుంటారు. అలాగే సోమవారం రాత్రి నేపాల్-నెదర్లాండ్స్ మధ్య జరిగిన టీ20 మ్యాచ్ కూడా టై అయ్యింది. అయితే ఇక్కడ ఫలితం తేలేందుకు ఒక్క సూపర్ ఓవర్ సరిపోలేదు. ఏకంగా మూడుసార్లు ఇరు జట్లు బరిలోకి దిగాల్సి వచ్చింది. ఇప్పటి వరకు టీ20 లేక లిస్ట్ 'ఎ' మ్యాచ్‌ల్లో ఇలా జరగడం ఇదే తొలిసారి. ముందుగా నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 152/7 స్కోరు చేసింది. ఛేదనలో నేపాల్ చివరి ఓవర్‌లో రెండు ఫోర్లతో సరిగ్గా 152/8 స్కోరే చేసింది. దీనికి తోడు రెండు జట్లు కూడా తొలి సూపర్ ఓవర్‌లో 19, రెండో సూపర్ ఓవర్‌లో 17 పరుగులు సాధించడంతో మూడోసారి అనివార్యమైంది. అందులో నేపాల్ పరుగులేమీ చేయకుండా 4 బంతుల్లో 2 వికెట్లు కోల్పోగా.. నెదర్లాండ్స్ ఓ సిక్సర్‌తో మ్యాచ్‌ను విజయంతో ముగించింది.

విరాట్ ఇంటికి గిల్, పంత్

లండన్: భారత జట్టులోని కొందరు సభ్యులను టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ లండన్‌లోని తన ఇంటికి ఆహ్వానించాడు. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్‌తోపాటు మహ్మద్ సిరాజ్ వారిలో ఉన్నారు. ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ తర్వాత విశ్రాంతి రోజైన సోమవారం ఈ క్రికెటర్లు దాదాపు రెండు గంటలపాటు కోహ్లీ ఇంట్లో గడిపారు. టెస్టులకు ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ యూకేలో సేదదీరుతున్నాడు. ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో భారత జట్టు పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.

నజ్ముల్, ముష్ఫికర్ శతకాలు

- బంగ్లా 292/3
- లంకతో తొలి టెస్ట్

గాలె: నజ్ముల్ హొస్సేన్ షంటో (136 బ్యాటింగ్), ముష్ఫికర్ రహీమ్ (105 బ్యాటింగ్) శతకాలతో అదరగొట్టడంతో బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో మంగళవారం ఆరంభమైన తొలి టెస్ట్‌లో బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 292/3 స్కోరు చేసింది. తొలుత బంగ్లా 45 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో షంటో, రహీమ్ నాలుగో వికెట్‌కు అజేయంగా 247 పరుగులు చేసి ఆదుకొన్నారు. లంక మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్‌కు ఇదే చివరి టెస్ట్. మ్యాచ్ ఆరంభానికి ముందు మాథ్యూస్‌కు ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు.

విమానం.. ఆగమాగం!

వరుసగా సాంకేతిక సమస్యలు, యూటర్న్‌లు

- అత్యవసర ల్యాండింగ్‌లతో ఆందోళన
- మంగళవారం 8 జాతీయ, అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసిన ఎయిరిండియా


కోల్‌కతాలో దిగిన ఎయిరిండియా విమానం

న్యూఢిల్లీ, జూన్ 17: అహ్మదాబాద్ ఘోర ప్రమాదం తర్వాతి నుంచి.. విమానాల్లో వరుసగా సాంకేతిక సమస్యలు, వెనక్కి మళ్లించడాలు, అత్యవసర ల్యాండింగ్ వంటివి ఆందోళన రేపుతున్నాయి. వరుసగా మరిన్ని ఘటనలు జరుగుతున్నాయి. మంగళవారం వివిధ కారణాలతో ఎనిమిది జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను ఎయిరిండియా రద్దు చేసింది. అందులో ఆరు సర్వీసులు అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకం విమానాలే కావడం గమనార్హం. మంగళవారం ఢిల్లీ నుంచి పారిస్ (ఏఐ143), పారిస్ నుంచి ఢిల్లీ (ఏఐ142) సర్వీసులను సాంకేతిక సమస్యలతో రద్దు చేసినట్టు ఎయిరిండియా ప్రకటించింది. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, పలు దేశాల గగనతలాన్ని మూసివేయడంతో లండన్ నుంచి అమృత్‌సర్‌కు రావాల్సిన ఏఐ170 విమానాన్ని రద్దు చేసినట్టు తెలిపింది. ఇక విమానం అందుబాటులో లేకపోవడంతో అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో సర్వీసు కూడా రద్దయింది. అహ్మదాబాద్‌లో టేకాఫ్ అవుతూ కూలిపోయిన ఏఐ171 విమానం స్థానంలో ఏఐ159 కోడ్‌తో సోమవారమే ఈ సర్వీసును ప్రారంభించడం గమనార్హం. ఇక విమానంలో తనిఖీల కారణంగా జాప్యం జరగడం, అప్పటికే పైలట్లు, ఇతర సిబ్బంది విధుల సమయం ముగియడంతో ముంబై-అహ్మదాబాద్ (ఏఐ2493) విమానాన్ని రద్దు చేసినట్టు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీ-దుబాయ్ (ఏఐ915), ఢిల్లీ-వియన్నా (ఏఐ153), లండన్-బెంగళూరు (ఏఐ132) విమానాలనూ రద్దు చేసినట్టు ప్రకటించింది. మరోవైపు దేశవ్యాప్తంగా విమానాల షెడ్యూల్‌లో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. అహ్మదాబాద్ ప్రమాదం నేపథ్యంలో.. కఠినమైన తనిఖీలు, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పలుదేశాల గగనతలాన్ని మూసివేయడం వంటివి ఈ ఆలస్యానికి కారణమని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

విమానాల్లో సమస్యలతో ఆందోళన..

మరోవైపు అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబైకి బయలుదేరిన ఎయిరిండియా ఏఐ180 విమానం ఎడమ ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీనితో మంగళవారం తెల్లవారుజామున కోల్‌కతాలో ప్రయాణికులందరినీ విమానం నుంచి దింపేసి.. లోపాన్ని సరిదిద్దే పని చేపట్టారు. గోవా నుంచి లక్నోకు వెళుతున్న ఇండిగో విమానం ఎయిర్ టర్బులెన్స్‌తో తీవ్ర కుదుపులకు గురైంది. సోమవారం సాయంత్రం 4.25 గంటలకు ఢిల్లీ నుంచి రాంచీకి బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో.. టేకాఫ్ అయిన కాసేపటికే వెనక్కి మళ్లించి ఢిల్లీలో ల్యాండ్ చేశారు. మస్కట్ నుంచి కోచి మీదుగా ఢిల్లీకి వస్తున్న ఇండిగో విమానంలో బాంబు ఉందన్న బెదిరింపులతో మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. మరోవైపు, కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో మూడు రోజుల క్రితం అత్యవసరంగా ల్యాండ్ అయిన బ్రిటన్ యుద్ధ విమానం ఎఫ్-35బీ ఇంకా అక్కడే ఉంది. అందులోని హైడ్రాలిక్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ప్రమాదానికి గురైన విమాన.. పైలట్ల శిక్షణ రికార్డులు ఇవ్వండి

న్యూఢిల్లీ, జూన్ 17: అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన విమానాన్ని నడిపించిన పైలట్ల శిక్షణ రికార్డులను తమకు అందజేయాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. పైలట్లతోపాటు ఆ విమానం బయలుదేరడానికి అనుమతి ఇచ్చిన అధికారుల శిక్షణ వివరాలనూ అందజేయాలని కోరింది. ప్రభుత్వం రహస్యంగా సర్క్యులేట్ చేసిన మెమోలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. దేశంలోని అన్ని విమాన, హెలికాప్టర్ పైలట్ శిక్షణ సంస్థలు (ఫ్లైయింగ్ స్కూళ్లు) అన్ని రకాల భద్రతా తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది.

కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

- కాలహరణం, మీడియాలో ప్రచారం.. ప్రభుత్వ లక్ష్యం
- మహిళా రిజర్వేషన్ మాదిరే కులగణనపైనా చిత్తశుద్ధి లేదు
- కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ విమర్శలు.. దుష్ప్రచారమన్న బీజేపీ

న్యూఢిల్లీ, జూన్ 17: కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ సోమవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ మంగళవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనను కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా మా నేత రాహుల్‌గాంధీ కులగణనకు డిమాండ్ చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం దీనికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం. కానీ కేంద్రం రూ.574 కోట్లు మాత్రమే కేటాయించింది. ఎలాగైనా కాలహరణం చేయడం, పతాక శీర్షికలకు ఎక్కడం.. ఆయా అంశాలను తన చేతుల్లోకి తీసుకోవడమే దాని ఉద్దేశంగా కనబడుతోంది' అని విమర్శించారు. తెలంగాణలోని తమ పార్టీ ప్రభుత్వం కులగణనను మంచి పద్ధతిలో నిర్వహించిందని తెలిపారు. ఇందులో ప్రభుత్వ సిబ్బందిని నియోగించలేదని.. స్వచ్ఛంద సంస్థలు, సాంకేతిక నైపుణ్యం ఉన్నవారి సాయంతో లెక్కలు సేకరించిందని చెప్పారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునే దిశగా కులగణన మొదటి అడుగన్నారు. కానీ ఇది చేపట్టే ఉద్దేశం కేంద్రానికి ఉన్నట్లు కనబడడం లేదని చెప్పారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడం మాని సమర్థంగా పనిచేయాలని.. జాతీయ స్థాయిలో కులగణనకు తెలంగాణ విధానాన్ని అమ లు చేయాలని సూచించారు. అయితే, కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన లేదని, మోదీ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందన్న ఆరోపణలను కేంద్ర హోం శాఖ సోమవారమే తోసిపుచ్చింది. ఇవి తప్పుదోవపట్టించే వ్యాఖ్యలుగా పేర్కొంది. ఏప్రిల్ 30, జూన్ 4, 15 తేదీల్లో విడుదల చేసిన ప్రకటనల్లో కులగణన ప్రస్తావన ఉందని స్పష్టంచేసింది.

జస్టిస్ వర్మ చాలా మంచి జడ్జి: కపిల్ సిబల్

న్యూఢిల్లీ, జూన్ 17: అధికారిక నివాసంలోని స్టోర్ రూంలో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అండగా నిలిచారు. మంచి న్యాయమూర్తుల్లో ఆయన ఒకరని అభివర్ణించారు. కొలీజియం వ్యవస్థను నాశనం చేసి, న్యాయమూర్తుల నియామకాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలన్న దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మతపరమైన వ్యాఖ్యలు చేసిన జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టకుండా జస్టిస్ వర్మపైనే చర్యలు తీసుకోవడాన్ని ప్రశ్నించారు.

సైకిల్‌పై నుంచి జారిపడ్డ డీకే శివకుమార్



బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైకిల్ మీద నుంచి జారిపడ్డారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు బెంగళూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కారు. ఈ క్రమంలో విధాన సౌధ మెట్ల వద్ద సైకిల్ ఆపి కిందకు దిగే ప్రయత్నంలో అదుపుతప్పి జారిపడ్డారు.

మావోయిస్టుల ఘాతుకం.. ముగ్గురి హత్య..12 మంది కిడ్నాప్

చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో మావోయిస్టులు దుశ్చర్యలకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లాలోని పెద్ద కుర్మ గ్రామానికి చెందిన చెందిన ముగ్గురు స్థానికులను మంగళవారం సాయంత్రం హత్యచేశారు. వీరిలో ఓ విద్యార్థిని కూడా ఉంది. హత్యలతో పాటు మావోయిస్టులు 12 మందిని కిడ్నాప్ చేశారు. మృతులంతా గతంలో లొంగిపోయిన గంగలూరు ఏరియా కమిటీ చెందిన డీవీసీఎం కమిటీ సభ్యుడు పొడియ దినేశ్ కుటుంబ సభ్యులుగా సమాచారం. ఈ ఏడాది మార్చి 4న బీజాపూర్ పోలీసులు ఎదుట దినేశ్ లొంగిపోయారు. ఆ తర్వాత గంగలూరు అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటనకు ప్రతీకారంగానే నక్సల్స్ బుధవారం హత్యలు, అపహరణలకు పాల్పడి ఉంటారని తెలుస్తోంది. బీజాపూర్ పోలీసులు మాత్రం ఈ ఘటనను ఇంకా ధ్రువీకరించలేదు.

ఎంఐటీ 'అధిపతి'గా చంద్రకాసన్

ప్రొవస్ట్‌గా తొలి భారత-అమెరికన్.. జూలై 1న బాధ్యతల స్వీకారం



న్యూయార్క్, జూన్ 17: మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) 'ప్రొవస్ట్' పదవికి ప్రొఫెసర్ అనంత చంద్రకాసన్ ఎంపికయ్యారు. ఎంఐటీకి అధిపతిగా పేర్కొనే ఆ పదవికి ఎంపికైన తొలి భారతీయ అమెరికన్‌గా ఆయన రికార్డులకెక్కారు. చెన్నైలో పుట్టిన చంద్రకాసన్ ప్రస్తుతం ఎంఐటీ చీఫ్ ఇన్నోవేషన్ అండ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా, ఇంజనీరింగ్ డీన్‌గా పనిచేస్తున్నారు. జూన్ 1 నుంచి ఆయన కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఎంఐటీ చీఫ్ అకడమిక్, బడ్జెట్ ఆఫీసర్‌ను ప్రొవస్ట్‌గా వ్యవహరిస్తారు. ప్రొవస్ట్‌కు విస్తృత అధికారాలు ఉంటాయి. ఫ్యాకల్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలతో పాటు విద్యా సంస్థ పర్యవేక్షణ వరకు అన్నీ ఆ అధిపతే చూసుకుంటారు. దీనితో పాటు ఎంఐటీ వ్యూహాత్మక ప్రణాళిక ఆయన ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ఈ సందర్భంగా ఎంఐటీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన సభ్యులలో నుంచి చంద్రకాసన్‌ను ఈ పోస్టుకు ఎంపిక చేశామన్నారు. చంద్రకాసన్ మాట్లాడుతూ.. ప్రొవస్ట్ బాధ్యత తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. చంద్రకాసన్‌కు న్యూయార్క్‌లో భారత కాన్సులేట్ జనరల్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చంద్రకాసన్ బీఎస్, ఎంఎస్, పీహెచ్‌డీని కాలిఫోర్నియా వర్సిటీలో పూర్తి చేశారు. ఎంఐటీలో ఫ్యాకల్టీగా చేరిన తర్వాత 2006లో మైక్రోసిస్టమ్స్ టెక్నాలజీ ల్యాబొరేటరీస్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2011లో ఈఈసీఎస్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, 2017లో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్‌గా నియమితులయ్యారు. ఎంఐటీ చీఫ్ ఇన్నోవేషన్, స్ట్రాటజీకి తొలి ఆఫీసర్‌గా 2024లో నియామకయ్యారు.

787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో.. పెద్దగా సమస్యలేమీ లేవు

- 24 బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు పూర్తి చేశాం
- విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి: డీజీసీఏ

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రస్తుతం భారత విమానయాన సంస్థల వద్ద ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో పెద్దగా భద్రతా సమస్యలేమీ లేవని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకటించింది. అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాదం, ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం నేపథ్యంలో.. మన దేశ విమానయాన సంస్థల వద్ద ఉన్న ఈ తరహా విమానాలన్నింటిలో డీజీసీఏ విస్తృతమైన భద్రతా తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ తనిఖీలు పూర్తయిన అనంతరం ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థల ఉన్నతాధికారులతో డీజీసీఏ అధికారులు భేటీ అయి సమీక్షించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. "మన దేశ సంస్థల వద్ద ఉన్న మొత్తం 24 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో కీలక భద్రతా తనిఖీలు నిర్వహించాం. ఈ అన్ని విమానాలు కూడా విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్టు గుర్తించాం" అని వెల్లడించారు.

రోబోలకూ స్పర్శ అనుభూతి!

- వేడి, నొప్పిని గుర్తించే రోబోటిక్ చర్మం
- కేంబ్రిడ్జ్ వర్సిటీ పరిశోధకుల ఆవిష్కరణ

వాషింగ్టన్, జూన్ 17: యంత్రాలకు సైతం చర్మాన్ని అమర్చి వాటికి మానవ రూపాన్ని ఇవ్వడమే కాకుండా అవికూడా స్పర్శను గుర్తించేలా.. అమెరికాలోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు విప్లవాత్మక ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. వేడిని, నొప్పిని, ఒత్తిడిని సైతం ఫీలయ్యే సరికొత్త రోబోటిక్ చర్మాన్ని వారు సృష్టించారు. సౌకర్యవంతమైన, తక్కువ ధర కలిగిన జెల్ పదార్థంతో తయారు చేసిన ఈ చర్మం... రోబోటిక్ చేతిని సున్నితమైన, తెలివైన సెన్సర్‌గా మారుస్తుంది. విభిన్న సెన్సర్లతో కూడిన ప్యాచ్‌వర్క్‌పై ఆధారపడే ఇతర ఎలాక్ట్రానిక్ చర్మంలా కాకుండా.. ఈ పదార్థం ఒత్తిడి, ఉష్ణోగ్రత, నొప్పిని సైతం గుర్తించగలదు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ, యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్)కు చెందిన పరిశోధకులు ఈ రోబోటిక్ స్కిన్‌ను అభివృద్ధి చేశారు. కరిగించే వీలున్న దీన్ని విభిన్న ఆకారాల్లో రూపొందించవచ్చు. రోబోల కాళ్లు, చేతులు, ముఖం.. ఇలా ఎక్కడ, ఏ ఆకారంలో కావాలన్నా సులువుగా తయారు చేసేలా దీన్ని అభివృద్ధి చేశారు. ఇది మానవ చర్మం అంత సున్నితమైనది కానప్పటికీ.. ఈ పదార్థంలో ఉండే 8.6లక్షల చిన్న చిన్న మార్గాల ద్వారా ఇది సంకేతాలను, వివిధ రకాల స్పర్శలను, ఒత్తిడిని గుర్తించగలదు. కత్తి గాటు వల్ల కలిగే బాధను, వేడి లేదా చల్లగా ఉన్న ఉపరితలాలను గుర్తించగలదు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అభిమానుల గుండెల్లో ఎప్పటికీ ఎన్టీఆర్ ఉంటారు



నందమూరి రామకృష్ణ

నందమూరి తారకరామారావు సినీ వజ్రోత్సవ వేడుకలను విదేశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ యూనివర్స్ సక్సెస్ సెలబ్రేషన్స్‌ను మంగళవారం హైదరాబాద్‌లో జరిపారు. ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు అభిమానుల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ ఉంటారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింతగా ప్రజలకు చేరువ చేయాలి" అని అన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "ప్రపంచ సినీ చరిత్రలో ఎన్టీఆర్ వంటి గొప్ప నటుడు లేరు" అని చెప్పారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "నటుడిగా, ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ జీవితం అందరికీ ఆదర్శం. ఈ సినీ వజ్రోత్సవం ఇంత వేడుకగా జరుగుతున్నందుకు ఆనందంగా ఉంది" అని తెలిపారు.

నాకు నటించడమే రాదన్నారు



'శతమానం భవతి', కార్తికేయ 2' లాంటి పలు సూపర్ హిట్ చిత్రాల్లో కథానాయికగా తెలుగు ప్రేక్షకులను అలరించారు అనుపమ పరమేశ్వరన్. ఆమె నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అనే మలయాళ చిత్రం ఈనెల 27న విడుదలవుతోంది. ఇందులో లాయర్‌గా సురేశ్ గోపీ నటించారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ 'నాకు నటన రాదంటూ చాలా మంది ట్రోల్ చేశారు. అయినా దర్శకుడు ప్రవీణ్ నాకు అవకాశం ఇచ్చారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' వంటి గొప్ప చిత్రంలో ఎంపిక చేశారు. నాపై నమ్మకంతో ఇలాంటి పాత్రను ఇవ్వడమే నాకు దక్కిన విజయంగా భావిస్తున్నాను. ఇక నుంచి ప్రేక్షకులకు నచ్చే సినిమాలు మాత్రమే అంగీకరించాలని నిర్ణయించుకున్నా. కొవిడ్ సమయంలో నా కెరీర్ పరంగా, జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను' అని చెప్పారు. కాగా, అనుపమ వ్యాఖ్యలపై సురేశ్ గోపీ స్పందించారు. ఒక నటిపై వివక్షను ప్రదర్శించడం మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇదే తొలిసారి కాదని అన్నారు. 'అనుపమ మాట్లాడిన మాటలు ఆమె హృదయాంతరాళం నుంచి వచ్చాయి. గతంలో నటి సిమ్రాన్ విషయంలోనూ ఇదే విధంగా జరిగింది. మలయాళ చిత్రపరిశ్రమ ఆమెను చిన్నచూపు చూసి ఇండస్ట్రీ వదిలిపోయేలా చేసింది' అని అన్నారు.

మెగాస్టార్‌తో డ్యూయెట్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఉత్తరాఖండ్‌లోని మసూరీలో రెండో షెడ్యూల్ మొదలైంది. ఇందులో చిరంజీవి సహా ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. మంగళవారం నయనతార సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతారపై కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను చిత్రీకరించనున్నారు. దర్శకుడిగా వరుస విజయాలను అందుకుంటున్న అనిల్ రావిపూడి ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో చిరంజీవి పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని యూనిట్ తెలిపింది. షైన్‌స్ర్కీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి

సేతుపతితో సంయుక్త



విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన చార్మీ కౌర్‌తో కలసి నిర్మిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో టబు, దునియా విజయ్‌కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా చిత్రబృందం కథానాయిక పేరును ప్రకటించింది. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తున్నట్లు తెలిపింది. 'మూస ధోరణిలో సాగే కథానాయికల పాత్రలకు భిన్నంగా ఇందులో సంయుక్త పాత్ర ఉంటుంది, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు, చిత్రీకరణలో పాల్గొనేందుకు సంయుక్త ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు' అని మేకర్స్ తెలిపారు.

భయపడి అడుగు ఆపకే...



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. సప్తమి గౌడ కథానాయిక. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. మంగళవారం చిత్రబృందం 'ఆగకే అమ్మాడీ... భయపడి అడుగు ఆపకే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. లయ వర్ష బొల్లమ్మ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

ఓ బలమైన స్త్రీ కథ



అనంతిక సునీల్ కుమార్ ప్రధాన పాత్రలో ఫణీంద్ర నర్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. మైత్రి మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఫణీంద్ర మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. "మను' సినిమా తర్వాత నాకు ఆరేళ్ల గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో కొన్ని కథలపై వర్క్ చేశాను. అయితే '8 వసంతాలు' కథకు అధిక ప్రాధాన్యం ఇచ్చాను. ఒక బలమైన స్త్రీ పాత్ర చుట్టూ కథను చెప్పాలనిపించింది. మా అత్తయ్యలు, ఇంట్లో, చుట్టుపక్కల బలమైన వ్యక్తిత్వాలు ఉన్న స్త్రీల మధ్య పెరిగాను. నేను రాసుకున్న పాత్రకు అనంతిక సునీల్ కుమార్ కరెక్ట్ అనిపించింది. కేవలం నటిగానే కాదు. దాదాపు 13 కళల్లో ఆమెకు ప్రవేశం ఉంది. శుద్ధి అయోధ్య పాత్రకు న్యాయం చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన డిగ్నిటీ కోల్పోకుండా ఉండే అమ్మాయి కథ ఇది' అని వివరించారు.

ఇష్టం లేకుంటే సినిమా చూడకండి

- థగ్‌లైఫ్ వివాదంపై సుప్రీం కోర్ట్



కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమా విడుదలకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా రిలీజ్‌ను కర్ణాటకలో నిషేధించడంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం మంగళవారం విచారించింది. కమల్‌హాసన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే సినిమా విడుదలను అడ్డుకోవడం ఏమిటని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమాను విడుదల చేయొద్దని బెదిరించడం సరికాదని, ఇష్టం లేకుంటే సినిమాను చూడకండి అని సూచించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) గుర్తింపు ఉన్న ఏ సినిమానైనా రాష్ట్ర ప్రభుత్వం విడుదలకు అనుమతించాలనే నిబంధన ఉందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా కర్ణాటక ప్రభుత్వం సినిమాను ప్రదర్శించేలా చూడాలని సూచించింది. ప్రజలు సినిమా చూస్తారా, చూడరా అన్నది వేరే విషయమని అన్నారు. ప్రజలు సినిమాను తప్పనిసరిగా చూడాలని తాము ఆదేశాలు ఇవ్వడం లేదని, కానీ సినిమాను విడుదల చేయాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కమల్ హాసన్ క్షమాపణలు చెప్పాలన్న కర్ణాటక హైకోర్టు ఆదేశాలపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది కోర్టు పనికాదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మందుల కొరత లేకుండా చూడాలి: సత్యకుమార్

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో నిత్యావసర మందులకు కొరత లేకుండా చూడాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయానికి వెళ్లిన ఆయన, అధికారులతో చర్చించారు. మందుల కొనుగోలు, వివిధ ప్రభుత్వాస్పత్రులకు వాటి సరఫరాపై సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు కారణాల వల్ల 150కి పైగా మందుల లభ్యతలో కొరత ఉండేదని, తాజాగా తొమ్మిది రకాల మందుల కొరత మాత్రమే ఉందని అధికారులు మంత్రికి తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో 712 రకాల మందుల అవసరాన్ని గుర్తించగా.. ఏపీఎంఎస్ఐడీసీ 650 రకాల మందులు కొనుగోలు చేస్తోందని, తక్కువ మోతాదులో అవసరమయ్యే 56 రకాలను ఆస్పత్రుల స్థాయిల్లో సమీకరించుకుంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆస్పత్రుల అవసరాలకు అనుగుణంగా మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎండీ గిరీశ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తొలి ఏడాది మెరుగైన సేవలు: మంత్రి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా అడుగులు వేసిందని సత్యకుమార్ తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలో ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాలు, ప్రయత్నాలు, ఫలితాలకు సంబంధించిన వివరాలను ఆయన ఐదు పేజీల నివేదిక ద్వారా సీఎం చంద్రబాబుకు అందించారు. ప్రభుత్వ వైద్య రంగంలో భాగస్వాములైన అందరూ జవాబుదారీతనం, క్రమశిక్షణలతో వ్యవహరించి.. మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏడాది కాలంగా కృషి చేసినట్లు తెలిపారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఎమర్జెన్సీని మించిన మోదీ పాలన : రాఘవులు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనతో దేశానికి ఎమర్జెన్సీని మించిన ప్రమాదం వచ్చింది. దీని గురించి ప్రజలకు తెలియజేయాలి' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు చెప్పారు. మంగళవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. 'ఎమర్జెన్సీ వల్ల ప్రజాస్వామ్యానికి, రాజకీయ వ్యవస్థకు ఎంత హాని జరిగిందో, ప్రస్తుతం ప్రధాని మోదీ అంతకంటే ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారు. ఆరోజు ప్రజలందరూ కలసి ఎమర్జెన్సీ నుంచి దేశాన్ని ఎలా రక్షించుకున్నారో... అలాగే ఈరోజు నయా ఫాసిస్టు శక్తుల ప్రమాదం నుంచి లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని కాపాడుకోవాలి. భారత్-పాకిస్తాన్‌ల మధ్య కాల్పులను తానే విరమింపజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి వాస్తవాలను బయటపెట్టాలని కోరితే కేంద్రం అంగీకరించడం లేదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏదో దాస్తోంది. ప్రజలకు అబద్ధాలు చెబుతోంది. అమెరికా విదేశాంగ విధానానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ ట్రంప్‌నకు దాసోహమంటోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడిని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించలేదు. ప్రధాని మోదీ, ఆయన బృందం యుద్ధోన్మాదుల్ని రెచ్చగొడుతున్నారు' అని రాఘవులు ఆరోపించారు.

విజన్‌ప్లాన్ యూనిట్లలోకి యువ నిపుణులు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాల సాధన కోసం ఏర్పాటు చేసిన నియోజకవర్గాల విజన్ ప్లాన్ యూనిట్లను మరింత బలోపేతం చేశారు. 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఈ యూనిట్లలోకి 175 మంది యువ నిపుణులను తీసుకోవడానికి అనుమతిస్తూ ప్రణాళిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉద్యోగాల కాలపరిమితి 48 నెలలు. ఒక్కొక్కరికి నెలకు రూ.60 వేల వేతనం ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారు. కలెక్టర్ సిఫారసు చేసిన ఉద్యోగి ప్రత్యేక అధికారిగా ఉంటారు. గ్రామ సచివాలయాల నుంచి 5 సిబ్బంది, ఒక యువ నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ర్యాంకు స్థాయి అధికారి ఒకరు మొత్తం 9 మంది సభ్యులుగా ఉంటారు.

విజయవాడలో 'చెత్త నుంచి విద్యుత్' ప్లాంటు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 15 మెగావాట్ల ప్లాంట్‌ను విజయవాడ క్లస్టర్‌లో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవాలని ఆదేశాలిచ్చింది. ప్లాంట్ ఏర్పాటుకు 35 ఎకరాల భూమిని గుర్తించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాయితీలు

పట్టణ ప్రాంతాల్లోనూ, పట్టణాభివృద్ధి అథారిటీల్లోనూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ఫీజుల్లో రాయితీ కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో ఫీజులు అధికంగా చెల్లించాల్సి వస్తోందని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తాజా ఉత్తర్వుల్లో జారీ చేసింది.

నేడు డీఎస్సీ గణితం ప్రాథమిక కీ విడుదల

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ గణితం పరీక్షల ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను బుధవారం విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి రెస్పాన్స్ షీట్లు చూసుకోవచ్చని సూచించారు. ప్రాథమిక కీపై ఈనెల 24వరకు అభ్యంతరాలు పంపొచ్చని తెలిపారు. కాగా, మంగళవారం జరిగిన పీజీటీ జువాలజీ, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ సోషల్ పరీక్షలకు 35540 మంది అభ్యర్థులకుగాను 33923(95.45శాతం) మంది హాజరయ్యారని వివరించారు.

విద్యార్థి కిట్ల పంపిణీ వేగవంతం చేయండి

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని సమగ్రశిక్షణ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండలాలకు చేరిన బ్యాగులు, బూట్లు, సాక్సులు, బెల్టులు, యూనిఫాం పంపిణీ వెంటనే ప్రారంభించాలని ఎంఈవోలను ఆదేశించారు. జూలై మొదటి వారంలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు విద్యార్థులు కొత్త యూనిఫాంతో హాజరయ్యేలా చూడాలని హెచ్ఎంలకు సూచించారు.

మోడల్ స్కూల్ టీచర్స్ నేడు విధుల్లో చేరాలి

బదిలీ అయిన మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ పీజీటీలు, టీజీటీలు బుధవారం కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాలని పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. 1312 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా1009 మందిని బదిలీ చేసినట్లు తెలిపింది.

ఫైబర్ నెట్ సాంకేతిక కమిటీ ఏర్పాటు

ఫైబర్ నెట్ సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో అల్పపీడనం

- కోస్తా తీరంలో బలమైన గాలులు

విశాఖపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం బంగ్లాదేశ్, దానికి ఆనుకుని పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో భూ ఉపరితలంపై అల్పపీడనం ఏర్పడింది. ఇది బుధవారానికల్లా పశ్చిమ వాయువ్యంగా పయనించి మరింత బలపడనుంది. ఇదే సమయంలో గుజరాత్ పరిసరాల్లో మంగళవారం మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర దిశగా పయనించనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రెండింటి ప్రభావంతో దేశంలో గుజరాత్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకూ పలు ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. రానున్న రెండు రోజుల్లో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌ల వరకు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో పలుచోట్ల మంగళవారం వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

'చెత్త'లా వాహనాలు!





పదుల సంఖ్యలో మినీ ట్రాక్టర్లు, హైడ్రాలిక్ ట్రక్కులు, బ్యాటరీ ఆటోరిక్షాలు... ఒకే చోట పోగేసి కనిపిస్తున్నాయి కదా! పనికిరాని, తుక్కుగా మారిన వాహనాలను 'డంపింగ్' చేసినట్లు అనిపిస్తోంది కదా! కానే కాదు! ఇవన్నీ... ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు! ఒక్కసారంటే ఒక్కసారీ వాడకుండానే ఇలా ఎండకు ఎండీ, వానకు తడిసీ... తుక్కైపోతున్నాయి. బుజబుజ నెల్లూరులో నాలుగైదేళ్లుగా ఇలాగే పడిఉన్నాయి. ఈ వాహనాలను వైసీపీ హయాంలో 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్' ద్వారా కొనుగోలు చేశారు. చెత్త సేకరణ కోసం వాటిని పంచాయతీలకు అందించాలి. కానీ... అలాగే వదిలేశారు. ఆటోలు దాదాపుగా తుక్కుగా మారాయి. కొన్ని వాహనాల్లోని బ్యాటరీలు చోరీ అయ్యాయి. తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన వాహనాలన్నింటినీ గ్రామాలకు పంపిణీ చేసేశామని పంచాయతీ విభాగం అధికారులు చెబుతున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులేమో అవి తమవి కావని అంటున్నారు. మరి... ఇన్ని వాహనాలు ఎవరివి? ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

రాజకీయ దురుద్దేశాలతోనే ఆ రాష్ట్ర నేతల ఫిర్యాదులు: నిమ్మల

- కాళేశ్వరం అవినీతిపై విచారణను డైవర్ట్ చేసేందుకే!
- కడలిపాలయ్యే వరద జలాలనే తరలిస్తాం
- అనుమతులన్నీ పొందాకే పథకం నిర్మిస్తాం
- మంత్రి రామానాయుడు స్పష్టీకరణ



అసెంబ్లీలో మాజీ సీఎం జగన్ మాట్లాడిన వీడియో చూపిస్తున్న మంత్రి నిమ్మల



రాయలసీమను రతనాల సీమను చేస్తామంటూ కేసీఆర్ చేసిన ప్రకటనను చూపిస్తున్న మంత్రి నిమ్మల

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అనుమతులన్నీ పొందాకే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం నిర్మిస్తామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు ఎలాంటి నష్టమూలేదన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న వరద నీటిని మాత్రమే తరలిస్తామని చెప్పారు. రాజకీయ దురుద్దేశాలతోనే తెలంగాణ నేతలు కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నార ని ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులకు సీఎం చం ద్రబాబు వ్యతిరేకం కాదని.. అందుకే కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టులను అక్కడి ప్రభుత్వం పూర్తి చేసుకోగలిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణను డైవర్ట్ చేసేందుకే బీఆర్ఎస్ నేతలు బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని తె లిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో పోలవరం-బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంలో గోదావరి జలాలను తెలంగాణ భూభాగం నుంచి నాగార్జునసాగ ర్, శ్రీశైలం జలాశయాలకు రోజు కు 4 టీఎంసీల చొప్పున వంద రోజుల పాటు 400 టీఎంసీలను తరలిస్తామని.. నాటి ఉభయ రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ ఉమ్మడిగా ప్రకటించలేదా అని నిలదీశారు. రాష్ట్రానికి ద్రోహం చేసేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. మాజీ సీఎం జగన్ ఎందు కు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ అసెంబ్లీలో, రాయలసీమ ప్రాంతం నగరిలో, అమరావతిలో జగన్‌ను కేసీఆర్ కలిసిన సందర్భంలోనూ.. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాల్లో 1000 టీఎంసీలను అనుసంధానం ద్వారా మళ్లిస్తేనే రాయలసీమ అభివృద్ధి చెందుతుందని అన్నారని.. ఆ మాటలను ఇప్పు డు బీఆర్ఎస్ నేతలే ఎందు కు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. తెలంగాణ ప్రాజెక్టులను చంద్రబాబు అడ్డుకుంటున్నారంటూ విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'గోదావరి, కృష్ణా బోర్డుల అనుమతులు లేకుండా కేసీఆర్ ప్రాజెక్టులను నిర్మించలేదా? విభజన చట్టానికి భిన్నంగా.. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందకుండానే ప్రాజెక్టులకు టెండర్లను పిలిచి పనులు చేయలేదా? కాళేశ్వరం, సీతారామ సాగర్ తదితర ప్రాజెక్టులను అనుమతుల్లేకుండానే చేపట్టలేదా? చంద్రబాబు అడ్డుకుని ఉంటే అవి పూర్తయ్యేవా? తెలంగాణ ప్రభుత్వం పాటించని నిబంధనలు ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వర్తిస్తాయా' అని నిలదీశారు.

బనకచర్లతో సముద్రానికే నష్టం

నదీ జలాలపై పూర్తి హక్కులు ఉన్న దిగువ రాష్ట్రంగా ఏపీ బనకచర్ల అనుసంధాన పథకాన్ని నిర్మిస్తే.. ఎగువ రాష్ట్రమైన తెలంగాణకు ఎలాంటి నష్టమూ ఉండదని నిమ్మల స్పష్టం చేశారు. దీని ద్వారా రోజుకు 2 టీఎంసీల వరద జలాలను 100 రోజులు తీసుకెళ్తామన్నారు. సముద్రం లో కలుస్తున్న 3,000 టీఎంసీలలో 200 టీఎంసీలు తగ్గుతాయని.. ప్రాజెక్టును నిర్మిస్తే 200 టీఎంసీలను సముద్రమే కోల్పోతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నేతల ఆరోపణలను లోతుగా పరిశీలిస్తే.. సాంకేతికాంశాల కంటే రాజకీయాంశాల మీదే తపన ఉన్నట్లుగా ఉందన్నారు. బనకచర్లకు కావలసిన అన్ని అనుమతులనూ నిబంధనల ప్రకారం తీసుకుంటామని తెలిపారు. గత నెల 22న ప్రాజెక్టు ప్రాథమిక నివేదికను కేంద్ర జల సంఘానికి సమర్పించామన్నారు. దీనిని జలసంఘం ఆమోదించాకే.. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారు చేస్తామని వెల్లడించారు. టెర్మ్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్) ఆమోదం కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అవసరమైన అన్ని అనుమతులూ సాధించా కే.. టెండర్లు పిలిచి.. నిర్మాణం చేపడతామని తేల్చిచెప్పారు. ఆలోపు తెలంగాణ నేతల విమర్శలపై రాయలసీమకు చెందిన వ్యక్తిగా.. రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా జగన్ నోరువిప్పాలని మంత్రి కోరారు. జగన్ మౌనం దాల్చడం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు.

ఏపీ పారిశ్రామిక

కారిడార్లలో ప్రత్యేక జోన్లు

- ఎంఎస్ఎంఈలకు, స్టార్టప్‌లకు కేటాయించాలి
- పెట్టుబడిదారులను ఆకర్షించే వాతావరణం కల్పించాలి
- అధికారులకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక కారిడార్లలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక జోన్లను కేటాయించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అధికారులను ఆదేశించారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతంలో ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా పెట్టుబడిదారులను, స్టార్టప్ సంస్థలను ఆకర్షించాలని చెప్పారు. బలమైన స్టార్టప్ ఎకోసిస్టమ్ కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) నేతృత్వంలోని పారిశ్రామిక నోడ్‌ల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలను మంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పర్యవేక్షించడానికి కేంద్రీకృత డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు.

పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపుపై పునఃపరిశీలన చేయండి

- అమిత్ షాకు రాష్ట్రప్రభుత్వం వినతి
- సీఎం రాసిన లేఖను అందజేసిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ముడి పామాయిల్ దిగుమతిపై సుంకం తగ్గింపును పునఃపరిశీలించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సీఎం చంద్రబాబు కోరారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీపీ నేత లావు కృష్ణ దేవరాయలు, ఇతర టీడీపీ ఎంపీల బృందం అమిత్ షాను మంగళవారం ఆయన నివాసంలో కలిసింది. ముడి పామాయిల్ సుంకం తగ్గింపును రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 6న సీఎం చంద్రబాబు రాసిన లేఖను అమిత్‌షాకు అందజేశారు. 'సుంకం తగ్గింపు వల్ల పామాయిల్ సాగుదారులకు ఆర్థికంగా నష్టం కలుగుతుంది. రైతులను నిరుత్సాహపరుస్తుంది' అని సీఎం లేఖలో పేర్కొన్నారు. కేంద్ర విధాన నిర్ణయాలు రాష్ట్రాలు చేస్తున్న సమిష్టి కృషిని దెబ్బతీసే ప్రమాదం ఉందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత కేంద్ర మంత్రి చిరాగ్‌పాశ్వాన్‌ను ఎంపీలు కలిసి పామాయిల్ రైతులను ఆదుకోవాలని కోరారు.



రాజధాని అమరావతిలో రాత్రివేళా సాగుతున్న నిర్మాణ పనులు

అమరావతికి మరింత జోష్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించేందుకు సంబంధించిన అనుమతులను కేంద్ర ఆర్థిక శాఖకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంగళవారం జారీ చేసింది. ఇందులో జీపీఆర్ఏకు రూ.1,329 కోట్లు, సీఎస్ఎస్‌కు రూ. 1,458 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఐనవోలు గ్రామంలో గతంలోనే 17 ఎకరాలను సీఆర్‌డీఏ కేటాయించింది. ఇప్పుడు మరోసారి అదే ప్రాంతంలో వీటి కోసం భూములు కేటాయించడానికి సిద్ధమైంది. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) నేతృత్వంలో పనులు చేపడతారు. రాష్ట్రాల రాజధానుల్లో ఈ ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేస్తుంది. 2018లోనే వీటికి నిధులు మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ, ప్రతిపాదనల అనంతరం ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పడ్డాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో రాజధానిలో నిర్మాణాల ప్రసక్తే లేకుండా పోయింది. దీంతో ఇప్పటివరకు ఆర్థిక ఆమోదం లభించక నిర్మాణం ఆలస్యమైంది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత శాఖలతో సంప్రదించి, ప్రతిపాదనలు ఆమోదానికి కృషి చేశారు. ఈ ప్రాజెక్టుల మంజూరుతో అమరావతిలో కేంద్ర మౌలిక అవసరాలకు సంబంధించిన నిర్మాణం వేగవంతం కానుంది.

సీసీఎస్ ప్రత్యేకతలివీ..

కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ (సీసీఎస్) కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ అధీనంలో నడుస్తుంది. ఢిల్లీలో నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ మాదిరిగానే ఈ భవనం కూడా ఉంటుంది. ఇందులో సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కేబినెట్ సెక్రటరీ విభాగం, అదనపు సెక్రటరీలు, డైరెక్టర్లు, అండర్ సెక్రటరీలతో కూడిన వ్యవస్థలు పనిచేస్తాయి. రాష్ట్ర, కేంద్ర సెక్రటేరియట్ల మధ్య ఇది వారధిగా పనిచేస్తుంది. తరచూ ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేకుండా కేంద్ర మంత్రిత్వ శాఖలతో ఇక్కడినుంచే సంప్రదింపులు జరపవచ్చు. మైజీవోవీ పోర్టల్ ద్వారా ఇంటర్ మినిస్ట్రీ కమ్యూనికేషన్స్ జరుగుతుంటాయి. నూరు శాతం డిజిటల్ గవర్నన్స్ దీని ప్రత్యేకత.

సీఆర్‌డీఏ పరిధిపై స్పష్టత

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీసీఆర్‌డీఏ పరిధిని తిరిగి నిర్వచిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న మంగళగిరి వై-జంక్షన్‌ను నవులూరు గ్రామానికి సౌత్-ఈస్ట్ బోర్డర్‌గా మారుస్తూ ఆదేశాలిచ్చారు. రాజధాని నగరం పరిధిపై అయోమయం లేకుండా స్పష్టతనివ్వాలని ఇటీవల నిర్వహించిన సీఆర్‌డీఏ 48వ అథారిటీ సమావేశంలో తీర్మానించారు.

జీపీఆర్ఏ విశేషాలివీ..

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తత్సమాన కేడర్ ఉద్యోగులు, కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులు, పీఎస్‌యూలు తదితరాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల నివాసం కల్పించే వ్యవస్థ జీపీఆర్ఏ. ఉద్యోగులకు ఇందులో సబ్సిడీతో కూడిన వసతి సదుపాయం అందిస్తారు. వీటిలో టైప్-1 రకాన్ని అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి కలిగిన వారికి, టైప్-2ను డిప్యూటీ సెక్రటరీ స్థాయి, టైప్-3ని అదనపు సెక్రటరీ స్థాయి అధికారులకు కేటాయిస్తారు. టైప్-4 గృహాలను సెక్రటరీ, కేబినెట్ స్థాయి అధికారులకు కేటాయిస్తారు. కాగా, సీసీఎస్ ప్రాజెక్టు ఆమోదం పొందడంలో కూటమి ప్రభుత్వ సహకారం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కీలక పాత్ర పోషించారని కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వ సారథ్యంలో, రాష్ట్రాభివృద్ధి పట్ల కేంద్రం చూపిన విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరులో కేంద్ర కమిటీ పర్యటన

- తొలిరోజు ఆరున్నర గంటలకు పైగా పరిశీలన

ఏలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణతో పాటు ప్రజల స్థితిగతులను కూడా పరిశీలించి సుప్రీంకోర్టు పరిమితులకు లోబడి నివేదిక అందిస్తామని కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్ స్పష్టం చేశారు. కొల్లేరులో రెండురోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ పరిధిలోని పక్షుల సంరక్షణ కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాలను కమిటీ మంగళవారం పరిశీలించింది. దాదాపు ఆరున్నర గంటలకు పైగా ఈ పర్యటన సాగింది. కొల్లేరులో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, ధర్మరాజు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణం, పక్షులతో పాటు ఈ ప్రాంతంలోని ప్రజలకు కడుపు నిండా ఆహారం అందించేలా, వారికి తగు న్యాయం చేసేలా చూస్తామని వర్మ భరోసా ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటామని కొల్లేరు వాసులతో రఘురామ ప్రతిజ్ఞ చేయించడంపై కమిటీ సభ్యులు ఆసక్తి కనబరిచారు. కమిటీ పర్యటించిన ప్రాంతాలన్నింటిలోనూ స్థానికులు పెద్దఎత్తున వినతులు అందజేశారు. కమిటీ సభ్య కార్యదర్శులు డాక్టర్ జేఆర్ భట్, జి. భానుమతి, సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాశ్ చంద్రభట్, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి మీనాను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి: మీనా

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాలు ఉద్యోగ సంబంధిత అంశాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతోనూ వ్యవహరించాలని ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా కోరారు. కొత్తగా ఎన్నికైన ఎక్సైజ్ గజిటెడ్ అధికారుల సంఘం నేతలు మంగళవారం సచివాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు కుమారేశ్వరన్, ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు, ఇతర ప్రతినిధులు శ్రీలత, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య తదితరులను మీనా అభినందించారు. ఈసందర్భంగా మీనాను ఉద్యోగసంఘాల నేతలు జ్ఞాపికతో సత్కరించారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు నేరం

- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన స్పష్టీకరణ



విజయవాడ, మంగళగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హుందాతనానికి భంగం కలిగించేలా వ్యాఖ్యానించడం పెద్ద నేరమని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో మహిళలను కించపరిచేలా టీవీ చర్చా కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను ఇప్పటికే సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, సభ్యురాలు బూసి వినీత ఆమెకు స్వాగతం పలికారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలను ఆమె సందర్శించారు. పది మంది మహిళా సిబ్బంది పనిచేస్తున్న ప్రతి సంస్థలోను అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశారా? అని ఆమె ప్రశ్నించగా, వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని కళాశాల అధికారులు తెలిపారు. మహిళల రక్షణ కోసం మహిళా కమిషన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని, ఏ సమయంలో అయినా బాధితులు కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని అర్చన తెలిపారు. బాలికలు, మహిళలపై దాడులకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రిని ఆమె పరిశీలించారు. స్వధార్ హోంలో పునరావాసం పొందుతున్న మహిళలతో మాట్లాడారు. వివిధ అంశాలపై ఫిర్యాదులకు సంబంధించి మహిళా జన్ సున్వాయ్‌లో భాగంగా కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల్లో మూడు రోజులు పర్యటించనున్నట్లు తెలిపారు. ఏపీ మహిళా కమిషన్ కార్యదర్శి అనురాధ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఈడీ ప్రవీణ్, ఏడీ కుమారి, లీగల్ కౌన్సిలర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

11 రోజుల్లో.. 6 దేశాలు తిరిగాం

- పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటాం
- ఉగ్రవాదం అంతానికి ఆయా దేశాల మద్దతు: ఎంపీ హరీష్

అమలాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలపై ప్రపంచ దేశాలకు తెలియజేసి, ఆపరేషన్ సిందూర్‌కు వారి మద్దతు కూడగట్టేందుకు 11 రోజులపాటు ఆరు దేశాల్లో పర్యటించామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తెలిపారు. మే 25 నుంచి జూన్ 5 వరకు వివిధ దేశాల్లో పర్యటించామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మంగళవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని తమ ఎంపీల బృందం అమెరికా, పనామా, ఢయానా, బ్రెజిల్, కొలంబియా దేశాల్లో పర్యటించిందని, ఉగ్రవాదం అంతానికి భారత్ తీసుకున్న చర్యలకు ఆయా దేశాలు మద్దతు తెలిపాయన్నారు. తమకు ప్రవాస భారతీయులు అపూర్వ స్వాగతం పలికారని తెలిపారు. పర్యటన తర్వాత ఢిల్లీలో ప్రధాని మోదీ ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నామని, పర్యటన విశేషాలు తెలుసుకుని ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారని హరీష్ చెప్పారు.

యోగా.. ప్రపంచ ఐక్యత స్ఫూర్తికి ప్రతిబింబం



- యోగా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సందేశం విడుదల

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగా వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా.. మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యత స్ఫూర్తిని కూడా ప్రతిబింబిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోదీ సందేశంతో కూడిన లేఖను మంగళవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా గ్రామీణ ప్రజలందరూ యోగా కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'యోగా మన గొప్ప సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగం. శరీరం, మనస్సు మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా సమగ్ర, ప్రశాంత, సంతృప్తికరమైన జీవనశైలి వైపునకు మార్గనిర్దేశం చేస్తుంది. శారీరకంగా, మానసికంగా సాధికారత పొందిన పౌరులు దేశ నిర్మాణంలో అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో యోగా ఒక శక్తివంతమైన సాధనం. యోగా ద్వారా మనం స్వావలంబన, అభివృద్ధి చెందిన భారతదేశం అనే మన జాతీయ సంకల్పాన్ని మరింత బలంగా, వేగంగా సాధించగలుగుతాం' అని ప్రధాని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహోత్తర కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా బహిరంగ ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పంచాయతీ భవన్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రదేశాల్లో నిర్వహించాలని సూచించారు. దీని వల్ల పిల్లలు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు యోగా ప్రయోజనాలు పొంది, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోగలరన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ప్రధాని పిలుపునిచ్చారు.

ప్రపంచానికి మోదీ... ప్రతి ఇంటికీ బాబు...

- యోగా దినోత్సవంపై బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించేలా మన ప్రధాని నరేంద్ర మోదీ ప్రణాళికలు తీర్చిదిద్దితే... మన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం నలుమూలలకు యోగాను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు' అని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పదకొండేళ్ల మోదీ పాలనలో దేశంలోని వివిధవర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

ఢిల్లీ చేరుకున్న లోకేశ్



- ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులతో నేడు భేటీ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ బయలుదేరిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. బుధ, గురువారాల్లో ఆయన ఢిల్లీలోనే ఉంటారు. బుధవారం ఉదయం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో లోకేశ్ సమావేశం అవుతారు. అనంతరం కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, ధర్మేంద్ర ప్రదాన్, అర్జున్‌రామ్ మేఘవాల్‌ను కలుస్తారు. గురువారం కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాతో భేటీ తర్వాత.. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో లోకేశ్ సమావేశం అవుతారు.

సరికొత్తగా... నాణ్యమైన యూనిఫాం

- రాజకీయ రంగులు, ఫొటోలు లేవు: మంత్రి మనోహర్



విద్యార్థులకు పంపిణీ చేసే కిట్‌లను చూపుతున్న మనోహర్

తెనాలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల ఫొటోలు.. పార్టీ జెండాల రంగులూ లేకుండా సరికొత్త యూనిఫాంను కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాంపై ఎటువంటి రాజకీయ రంగులు, నాయకుల ఫొటోలను కానీ కూటమి ప్రభుత్వం ముద్రించనివ్వలేదన్నారు. సరికొత్త రంగుల్లో, నాణ్యతతో ఉన్న వస్తువులు అందించామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన బ్యాగ్‌లు, బూట్ల కొనుగోళ్లలోనూ కక్కుర్తి చూపించిందని, అందుకే అవి పట్టుమని పది రోజులు కూడా చిన్నారులకు ఉపయోగపడలేదన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థుల భోజనానికి సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల కోసం తక్కువ ధరకు ధాన్యం అందజేసిన రైతులకు సత్కార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

కార్పొరేషన్ సమావేశానికి భద్రత కల్పించండి

- కడప జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే కడప మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ మీటింగ్‌కు తగిన భద్రత కల్పించాలని మంగళవారం కడప జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. బయట వ్యక్తులను కార్పొరేషన్ ప్రాంగణంలోకి అనుమతించవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ బాడీ మీటింగ్‌కు గట్టి భద్రత కల్పించేలా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ మేయర్ కె.సురేశ్‌బాబు, పలువురు కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. కాగా, తన వాదనలను వినకుండానే విచారణ పూర్తయినట్లు పేర్కొంటూ పురపాలక ముఖ్యకార్యదర్శి ఈ నెల 10న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ మేయర్ కె.సురేశ్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈ నెల 19కి వాయిదా వేసింది.



విశాఖ బీచ్‌రోడ్డుపై పచ్చ తివాచీ

- 5 లక్షల మంది కూర్చునేలా రోడ్డు పొడవునా ఏర్పాటు
- వాహనాల రాకపోకలు నిలిపివేత.. యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు

విశాఖపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్ రోడ్డుపై ఐదు లక్షల మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహించి గిన్నీస్ రికార్డు సాధించడానికి విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 21న విశాఖపట్నంలోని రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ తీరం పొడవునా లక్షలాది మంది యోగాసనాలు వేయనున్నారు. ఇందుకోసం బీచ్ రోడ్డు మొత్తం గ్రీన్ మ్యాట్ వేస్తున్నారు. అలాగే ఆసనాలు వేసే ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన మ్యాట్, టీ షర్ట్, ఓఆర్ఎస్ బాటిల్‌ను కిట్‌గా ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఈ భారీ కార్యక్రమం కోసం గత కొద్దిరోజులుగా ఎక్కడికక్కడ యోగాపై శిక్షణ ఇస్తున్నారు. అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతోపాటు అపార్ట్‌మెంట్లు, కల్యాణ మండపాలు, పార్కుల్లో యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు. సముద్రంలో యుద్ధనౌకలపై కూడా యోగాసనాలు వేయడానికి తూర్పు నౌకాదళం ఏర్పాట్లు చేసింది. బీచ్ రోడ్డుపై ఏర్పాట్లు జరుగుతున్నందున మంగళవారం నుంచే ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

ప్లాస్టిక్ రహితంగా నగరాలు

- అక్టోబరు 2కల్లా ప్రధాన నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కట్టడి చేయాలి
- సర్క్యులర్ ఎకానమీపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం


సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈఏడాది అక్టోబరు 2కల్లా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనగరాల్లో క్లాత్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలని చెప్పారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠ పరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీపై తుది పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మొదటగా మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటి దశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

11 రంగాలు, 3 శాఖలపై దృష్టి

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్రప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. దీంతో పాటు అదనంగా గనులు, చేనేత, పశు సంవర్థక శాఖలతో కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన వారికి ప్రోత్సాహకంగా స్వచ్ఛత అవార్డులను వచ్చే ఏడాది అక్టోబరు 2 నుంచి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్జీఓల వారీగా అవార్డులు ఇవ్వాలని నిర్దేశించారు.

రాష్ట్రంలో 52 వ్యర్థాల క్లస్టర్లు

జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలోని పట్టణాలు, పంచాయతీ ప్రాంతాల్లో మొత్తం 52 వ్యర్థాల క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యర్థాల్లో ఎక్కువగా వ్యవసాయరంగం నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నులు, పశువులు-ఆక్వా-పౌల్ట్రీ రంగాల 347 లక్షల మెట్రిక్ టన్నులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు 88 లక్షల గృహాల నుంచి 1,329 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్రలో సర్క్యులర్ ఎకానమీ కోసం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ప్రత్యక్షంగా లక్ష ఉద్యోగాలు..

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ సమర్థంగా అమలు చేయగలిగితే జీఎస్డీపీకి ఏడాదికి రూ. 15 వేల కోట్లు జత చేరుతుందని అంచనా. అలాగే మరో రూ. 10 వేల కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జీఎస్టీ రూపంలో రూ. 3 వేల కోట్ల ప్రతి ఏటా ఆర్జించవచ్చు. మరో వైపు ప్రత్యక్షంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. 10 వేల మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఉపాధి లభిస్తుంది. దీంతో పాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. భూ, జల, వాయు కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చు.

తలసరి ఆదాయం పెరిగింది!

- 2024-25లో 11.89 శాతానికి చేరింది
- జాతీయ సగటు 8.7 శాతమే: ముఖ్యమంత్రి

గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే ఎక్కువగా పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయిలో తలసరిఆదాయం 8.7 శాతం మేర పెరిగితే.. ఏపీలో 11.89 శాతం పెరిగిందని తెలిపారు. ప్రణాళికా శాఖపై మంగళవారం ఆయన సమీక్ష జరిపారు. రాష్ట్రం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన సమాచార విశ్లేషణ కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థికాభివృద్ధికి అనువుగాఉన్న రంగాలపై దృష్టి పెట్టడంతో పాటు సేవల రంగం వృద్ధిచెందే ప్రణాళికలు రూపొందిస్తే ఆర్థిక సుస్థిరతను త్వరితగతిన సాధించగలమన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయులతో పాటు గ్రామ స్థాయిలో కూడా కీలక రంగాల్లో పురోగతి సూచీలు పెట్టుకుంటే పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. 2028-29 నాటికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రుణభారం తగ్గించుకుంటూ సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం అత్యంత కీలకమని చెప్పారు. పెట్టుబడులు ఆకర్షించేవిధంగా రాష్ట్రంలో బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కేబినెట్ సమావేశాలు, 6 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి, పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు వాటిని అమల్లోకి తెచ్చేలా నిరంతరం పనిచేస్తున్నామన్నారు. సాంకేతికతను జోడించి నీటి యాజమాన్య నిర్వహణ కూడా సమర్థంగా జరపాలని అధికారులకు స్పష్టం చేశారు. కరువు వచ్చినా ఎదుర్కొనేలా సరైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, నేలలో తేమ శాతం, భూగర్భ జలాల వంటి వివరాలు నమోదు చేసే బాధ్యతను ప్రణాళిక శాఖ తీసుకోవాలని సూచించారు. పీ-4 పథకంలో బంగారు కుటుంబాలు- మార్గదర్శుల మధ్య సమన్వయం చేసుకునే ప్రక్రియను ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

మరో రచ్చకు జగన్ రెడీ!

- యోగా దినోత్సవానికి ముందు రగడ
- నేడు పల్నాడు జిల్లాలో పర్యటన
- ఏడాది కిందట ఆత్మహత్య చేసుకుంటే... ఇప్పుడు పరామర్శ, విగ్రహావిష్కరణ
- వైసీపీ గెలుస్తుందని కోటిన్నర బెట్టింగ్!
- ఇతరుల సొమ్ముతో నాగమల్లేశ్వరరావు పందెం
- డబ్బులివ్వలేక పురుగుమందు తాగి ఆత్మహత్య

వేధింపులే కారణమట...



నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడింది గత ఏడాది జూన్ 6న. మరణించింది జూన్ 9న. కూటమి ప్రభుత్వం ఏర్పడింది జూన్ 12న. అయినా ప్రభుత్వ వేధింపుల వల్లే ఆయన ఆత్మహత్య చేసుకున్నారంటూ వైసీపీ విష ప్రచారం మొదలుపెట్టింది. గ్రామంలో నాగమల్లేశ్వరరావు విగ్రహం కూడా పెడుతున్నారు. దానిని ఆవిష్కరించేందుకే జగన్ బుధవారం రెంటపాళ్లకు వస్తున్నారు. చిన్న గ్రామం, ఇరుకైన వీధులు కావడంవల్ల... జగన్‌తోపాటు వందమంది మాత్రమే రావాలని పోలీసులు స్పష్టం చేసినా పట్టించుకోవడంలేదు. వేలమందిని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విశాఖ వేదికగా జరిగే యోగా దినోత్సవానికి ముందు రచ్చ చేసేందుకే జగన్ రెంటపాళ్ల పర్యటన పెట్టుకున్నట్లు ప్రభుత్వం అనుమానిస్తోంది.

మేడికొండూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మొన్నటికి మొన్న... తెనాలిలో రౌడీ షీటర్లను పరామర్శించారు! తర్వాత రైతులకు పరామర్శ పేరుతో పొదిలిలో రచ్చ చేశారు. ఇప్పుడు... ఏడాది కిందట ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబానికి పరామర్శ పేరుతో మరోసారి రగడకు సిద్ధమయ్యారు. అదికూడా... స్వయంగా ప్రధాని పాల్గొననున్న యోగా దినోత్సవానికి ముందు! ఇదీ మాజీ సీఎం వైఎస్ జగన్ తీరు! పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల ఉపసర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందన్న సర్వేలు నమ్మి, బెట్టింగులు పెట్టి, డబ్బులు పోగొట్టుకుని, దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2024 ఎన్నికల ఫలితాలపై భారీగా బెట్టింగులు జరిగిన సంగతి తెలిసిందే. నాగమల్లేశ్వరరావుతోపాటు సత్తెనపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడొకరు... పెద్దమనుషులుగా ఉంటూ బెట్టింగ్ సొమ్ములను తమ దగ్గర ఉంచుకున్నారు. ఫలితాల తర్వాత... గెలిచిన వాళ్లకు వీళ్లే డబ్బు అప్పగించాలి. అయితే 'ఆరా' మస్తాన్ సర్వే తర్వాత నాగమల్లేశ్వరరావుకూ ఆశ పుట్టింది. స్వయంగా వైసీపీ నాయకుడైన ఆయన.. మళ్లీ జగన్ సీఎం అవుతారంటూ కోటిన్నరకు పైగా సొమ్మును బెట్టింగ్‌లో పెట్టారు. ఇతర బెట్టింగ్‌రాయుళ్ల తన దగ్గర ఉంచిన డబ్బులతో పందెం కాశారు. వైసీపీ ఓడిపోవడంతో మొత్తం డబ్బు కోల్పోయారు. పందేలు వేసిన వారు డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ఇక గ్రామంలో తలెత్తుకొని తిరగలేనని భావించి, నాగమల్లేశ్వరరావు గత ఏడాది జూన్ 6న గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగు అడ్డరోడ్డు వద్ద పురుగు మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను.. పోలీసులు సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత, అంటే జూన్ 9న మరణించారు. స్థాయికి మించి కోట్లలో బెట్టింగ్‌లు కాయడమే ఆయన ఆత్మహత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. అప్పులు తీర్చే మార్గం లేదనే ఆందోళనతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు చెబుతారు. నాగమల్లేశ్వరరావు మరణం తర్వాత ఆయన భార్యాపిల్లలు కూడా గ్రామంలో ఉండట్లేదని, ఆమె పుట్టింట్లో ఉంటున్నట్టు తెలిసింది. అయినా జగన్ పరామర్శకు ఎందుకు వస్తున్నారోనని రెంటపాళ్లలో చర్చించుకుంటున్నారు.

తిరుపతి ఎయిర్‌పోర్టుకు శ్రీవారి పేరు!



- సీఎస్ఐఆర్ నూతన ల్యాబ్‌కు తిరుపతిలో స్థలం
- దళితవాడల్లోని వారికి అర్చక శిక్షణ: టీటీడీ చైర్మన్

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీవేంకటేశ్వర ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు' అని పేరు పెట్టాలనే ప్రతిపాదనపై త్వరలో సెంట్రల్ ఏవియేషన్ విభాగానికి లేఖ రాస్తామని తిరుమల తిరుపతి బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అలాగే కేంద్రం నుంచి అనుమతులు రాగానే తిరుమల, తిరుపతి వైభవం ఉట్టిపడేలా విమానాశ్రయ ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం జరిగింది. అనంతరం వివరాలను పలువురు సభ్యులతో కలిసి చైర్మన్ మీడియాకు వివరించారు. మిరాశీ వ్యవస్థపై జూలై 1న వాయిదా ఉన్న క్రమంలో ఆ వ్యవస్థపై అవగాహన కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సుప్రీం కోర్టులో ఉన్న అంశం కావడంతో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని చెప్పారు. బెంగళూరులో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ కోరారు. అక్కడ టీటీడీకి 47 ఎకరాల స్థలం ఉంది. దానికి సంబంధించిన ఫైల్ రెవెన్యూ విభాగంలో పెండింగ్ ఉందనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ స్కీం కింద టీటీడీకి వంద ఎలక్ట్రిక్ బస్సులను ఉచితంగా ఇస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి తెలిపారు. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే ఆటో, ట్యాక్సీల నిలువుదోపిడీ నుంచి భక్తులను రక్షించవచ్చు. కేంద్రానికి చెందిన సీఎస్ఐఆర్ అత్యాధునిక పరికరాలతో తిరుపతిలో ల్యాబ్ పెట్టేందుకు ముందుకొచ్చిన క్రమంలో ఎకరా స్థలాన్ని లీజుకు ఇవ్వాలని తీర్మానించాం. ఇందులో టీటీడీకి చెందిన నెయ్యి, ముడిసరుకులను ఉచితంగా పరీక్షించి ఇస్తారు. త్వరలోనే స్థలాన్ని ఎంపిక చేస్తాం. ఎస్వీ కాలేజీలో సుమారు 200 మంది లెక్చరర్లు 22 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ వారికి న్యాయం చేయకుండా నూతన భర్తీలు చేయడం సరికాదని, నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఏపీపీఎస్సీ 2రోజుల ముందు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చింది. దీన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో దేవదాయశాఖ మంత్రితో పాటు చైర్మన్‌గా నన్ను, ఈవోతో కలిపి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ అంశంపై స్టడీ చేసి జూలై మొదటివారంలో సీఎంకు నివేదిస్తాం. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళితవాడల్లోని వారికి అర్చక శిక్షణతో పాటు వివిధ వ్రతాలు, పూజా విధానాలపై శిక్షణ ఇవ్వాలని తీర్మానించాం. జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కోసం టీటీడీ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సన్మార్గం' పేరుతో త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

రాత్రి చంపి ఉదయాన్నే శవానికి దండేసినట్లుగా..!



- నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పరోక్షంగా జగనే కారణం: కన్నా

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సినిమాల్లో విలన్లు ఒక వ్యక్తిని రాత్రి చంపి.. ఉదయాన్నే వెళ్లి శవానికి దండేసి సానుభూతి తెలిపినట్లుగా వైసీపీ అధినేత జగన్ సత్తెనపల్లి పర్యటన ఉందని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు గత ఎన్నికల్లో వారి పార్టీ అధికారంలోకి వస్తుందని నమ్మి ఇంట్లో సొమ్మంతా పోసి రూ.2 కోట్లు పైనే బెట్టింగ్‌లు పెట్టాడని, చివరకు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. వైసీపీ తప్పుడు సర్వేలతోనే ఆయన మృతిచెందాడని, దానికి పరోక్షంగా జగనే కారణమని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో వైసీపీ తప్పుడు సర్వేలు నమ్మి చాలా మంది కార్యకర్తలు ఆస్తులు పోగొట్టుకొని రోడ్డున పడ్డారని అన్నారు. గత ఏడాది జూన్ 9న నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నాడని, కూటమి ప్రభుత్వం 12న అధికారం చేపట్టిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగమని మాట్లాడే వారు జగన్ హయాంలో చలో ఆత్మకూరుకు వెళ్లకుండా చంద్రబాబును అడ్డుకున్నది మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఇటీవల తెనాలి పర్యటనలో జగన్ నేరచరిత్ర ఉన్నవారిని పరామర్శించడం అరాచకశక్తులను ప్రోత్సహించడమేనన్నారు. ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా దక్కవన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలో నలుగురు వైసీపీ కౌన్సిలర్లు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు.

గ్రామం ఇరుకు.. జనసమీకరణ ప్రమాదకరం

- వంద మంది కంటే ఎక్కువ అనుమతించలేం
- పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు స్పష్టీకరణ
- నేడు రెంటపాళ్లలో విగ్రహావిష్కరణకు జగన్



నరసరావుపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్న తమ పార్టీ నేత నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ, ఆయన విగ్రహ ఆవిష్కరణ పేరుతో మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్ బుధవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లకు వెళ్లనున్నారు. జగన్ పర్యటనకు ఆ పార్టీ నేతలు జనసమీకరణకు సిద్ధమయ్యారు. అయితే గ్రామంలో రోడ్లు చాలా చిన్నవిగా ఉన్నందున, జనసమీకరణ ప్రమాదకరమని అనుమతి నిరాకరిస్తూ పోలీసులు ఆ పార్టీ నేతలకు సూచనలు చేశారు. జగన్ సహా వంద మందిని మాత్రమే అనుమతిస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పొదిలి ఘటనల నేపథ్యంలో జగన్ పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఏడాది క్రితం మృతిచెందితే.. ఇప్పుడు పరామర్శలు ఏంటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ తరఫున రూ.కోట్లు బెట్టింగ్‌లు కట్టి నష్టపోయి నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే.. దీనిని రాజకీయం చేయడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. జగన్ పర్యటనను అడ్డుకుంటామని సత్తెనపల్లి కూటమి నేతలు ప్రకటించారు.

జగన్ రెంటపాళ్ల రావడం ఖాయం: వైసీపీ

ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా జగన్ రెంటపాళ్లకు రావడం ఖాయమని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. జగన్ పర్యటనకు అనుమతి కోసం వైసీపీ నేతలు మంగళవారం ఎస్పీని కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు, టీడీపీ నేతల వేధింపులు భరించలేకే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారని రజిని ఆరోపించారు. జగన్ పర్యటనకు అనుమతుల విషయంలో పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. జగన్ పర్యటనను విఫలం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కూటమి సర్కారు వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయన్నారు. జగన్ పర్యటనను అడ్డుకోవాలని చంద్రబాబు, లోకేశ్ అధికారులను ఆదేశించారని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. జగన్ ఒక్కడైనా రెంటపాళ్ల వస్తారని, బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని అన్నారు. రక్షణ సమస్య అంటున్న నేపథ్యంలో జనసమీకరణ చేయబోమని ఎస్పీకి తెలియజేశామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు.

ఆత్మహత్యకు కారణం మీరే.. విగ్రహం పెట్టేదీ మీరే!



- శాంతిభద్రతల విఘాతానికి జగన్ స్కెచ్: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా అంతర్జాతీయ యోగా డే నిర్వహించుకునే సమయంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ స్కెచ్ వేశారని, అందులో భాగమే సత్తెనపల్లి పర్యటన అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు జగన్‌రెడ్డే కారణమని అన్నారు. గత ఎన్నికల సమయంలో తాడేపల్లి ప్యాలెస్ నుంచి అబద్ధాలను ప్రచారం చేయించి, వైసీపీపై పెద్దఎత్తున బెట్టింగ్‌లు పెట్టేలా చేశారని పేర్కొన్నారు. వైసీపీ ఫేక్ ప్రచారాలు నమ్మి.. బెట్టింగ్ పెట్టిన నాగమల్లేశ్వరరావు ఆ డబ్బులు కట్టలేక 2024 జూన్ 9న ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అప్పటికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాలేదని, నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు కారణమైన జగన్.. ఇప్పుడు ఏడాది తర్వాత విగ్రహం పెట్టించి శవ రాజకీయాలు చేస్తున్నారని, ఆయన నటనకు ఆస్కార్ ఇవ్వొచ్చని విమర్శించారు. సత్తెనపల్లి పర్యటనపై తమకు అభ్యంతరం లేదని, అయితే ప్రత్యేక కుట్రకోణంలోనే పర్యటనలు పెట్టుకుంటున్నారని, సత్తెనపల్లి పర్యటన కూడా అందులో భాగమేనన్నారు. ప్రజాసమస్యల పేరుతో జగన్ చేస్తున్న హింసా రాజకీయాలు, కుట్ర ఆలోచనలను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పినా ఆయన వైఖరిలో మార్పు రాలేదన్నారు.

‘సిట్’ అధికారులు హింసించారు

- డీజీపీకి చెవిరెడ్డి గన్ మ్యాన్ లేఖ.. మమ్మల్నే ఆయన బెదిరించారు
- మదన్ రెడ్డి ఆరోపణలు అవాస్తవం.. హక్కుల ఉల్లంఘన జరగలేదు: సిట్


చికిత్స పొందుతున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డి

అమరావతి/చంద్రగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులపై ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాజీ గన్ మ్యాన్ మదన్ రెడ్డి పలు ఆరోపణలు చేశారు. సాక్షిగా విచారణకు పిలిచి తనను హింసించారని.. ఒత్తిడికి గురిచేశారని, పిడిగుద్దులు గుద్దారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు లేఖ రాశారు. అయితే, మదన్ రెడ్డి చేసిన ఆరోపణలను సిట్ అధికారులు ఖండించారు. విచారణలో తాము హక్కుల ఉల్లంఘనలకు పాల్పడలేదని ఓ ప్రకటనలో తెలిపారు.

మదన్ లేఖ ఇదీ..

సిట్ అధికారులు.. తాము చెప్పినట్లు రాసి, సంతకాలు పెట్టమంటూ తనను మానసికంగా, శారీరకంగా హింసించారంటూ మదన్‌రెడ్డి డీజీపీకి లేఖ రాసిన లేఖలో పేర్కొన్నారు. “నేను సాక్షిగా వచ్చా. నాకు తెలిసిన వాస్తవాలు రాసిస్తానని చెప్పడంతో వారు తిట్టారు. చెవిరెడ్డి మద్యాన్ని ప్రోత్సహించరని, కనీసం ఎన్నికలలో కూడా లిక్కర్ ఇవ్వరని చెప్పా. మళ్లీ మరుసటి రోజు విచారణకు రమ్మన్నారు. నా గదికి వచ్చి బెడ్‌పై కూర్చోగానే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయా. ఆ తర్వాత విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి చేరా. గత మూడు రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్స తీసుకొంటున్నా. సిట్ విచారణకు ఒంటరిగా వెళ్లలేను” అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇదంతా డ్రామా: సిట్

మదన్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని సిట్ ఖండించింది. ఆయనే తమను బెదిరించినట్టు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. “మూడున్నర వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడైన రాజ్ కసిరెడ్డి నుంచి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి డబ్బులు తీసుకున్నట్లు మావద్ద ఉన్న ఆధారాల మేరకే చెవిరెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్న వ్యక్తుల్ని విచారిస్తున్నాం. ఈ క్రమంలోనే మదన్ రెడ్డిని పిలిచి ప్రశ్నించాం. విచారణకు సహకరించకపోగా ‘మీ అందరి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటా’ అంటూ మమ్మల్నే బెదిరించారు. ఇప్పటి వరకు ఈ కేసులో 200 మందికి పైగా నిందితులు, అనుమానితులు, సాక్షులు, వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులను పిలిచి విచారించాం. ఎక్కడా మానవ హక్కుల ఉల్లంఘన జరగలేదు. హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డిపై ఎలాంటి వేధింపులకు పాల్పడలేదు. ఆయన చెబుతున్నదంతా ఓ డ్రామా. ఏపీఎస్‌బీసీఎల్ మాజీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి బాలాజీని నిర్బంధించారంటూ కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం వెనుక దర్యాప్తును నీరుగార్చే కుట్ర ఉంది. ఇలా చేస్తున్న వ్యక్తుల ముసుగు తొలగించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం” అని సిట్ వివరించింది. నిజాలు నిగ్గుతేల్చి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు లేఖ రాయనున్నట్టు సిట్ తెలిపింది.

హైకోర్టులో మదన్ పిటిషన్.. విచారణ నేటికి వాయిదా

మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు తనను చిత్రహింసలకు గురిచేశారని పేర్కొంటూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. “మద్యం కేసులో సాక్షిగా ఈ నెల 10న సిట్ ముందుకు హాజరైన పిటిషనర్‌ను.. కొంతమంది నాయకులకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలంటూ అధికారులు ఒత్తిడికి గురిచేశారు. దీంతో పిటిషనర్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు 15 రోజులపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు.” అని వివరించారు. పిటిషనర్‌ను విచారించే సమయంలో న్యాయవాదిని అనుమతించేలా సిట్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందన కోసం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కుప్పం దా..రుణంపై సీఎం సీరియస్


బాధితురాలు శిరీషతోఫోన్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- మహిళను కట్టేసిన వారిపై కఠిన చర్యలు
- బాధితురాలికి రూ.5 లక్షల తక్షణ సాయం
- స్వయంగా శిరీషకు ఫోన్ చేసి పరామర్శ
- బాధితురాలికి హోం మంత్రి అనిత వీడియోకాల్
- నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు.. అరెస్టు


పసుపు తాడు తప్ప మరేదీ తన వద్ద లేదని చెబుతున్న బాధిత మహిళ శిరీష

కుప్పం, అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో భర్త చేసిన అప్పునకు భార్యను చెట్టుకు కట్టేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠను ఆదేశించారు. బాధిత మహిళ శిరీషకు ఫోన్ చేసి పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమెకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షలు తక్షణ సాయంగా ప్రకటించారు. కుప్పం మండలం దాసేగానూరు పంచాయతీ నారాయణపురం గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప చాలామంది దగ్గర అప్పులు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన మునికన్నప్ప తాను అప్పుగా ఇచ్చిన రూ. 80 వేలు కోసం ఒత్తిడి చేయడంతో తిమ్మరాయప్ప పరారయ్యాడు. ఆ తర్వాత శిరీష తన ముగ్గురు బిడ్డలను రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామంలోని పుట్టింట్లో ఉంచారు. వారిని అక్కడి పాఠశాలలో చేర్చి తాను బెంగళూరు చేరుకుని దొరికిన పని చేసుకుని బతుకుతోంది. ఈ క్రమంలో తన చిన్న కుమారుడు అభి టీసీకోసం సోమవారం నారాయణపురం వచ్చిన శిరీషను మునికన్నప్ప చెట్టుకు కట్టేసి వేధించడం తెలిసిందే. ప్రస్తుతం ఆమె కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, సీఎం ఆదేశాలతో మునికన్నప్పతోపాటు ఆయన భార్య వెంకటమ్మ, కుమారుడు రాజా, కోడలు జగదీశ్వరిలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, నలుగురినీ పోలీసులు అరెస్టు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిరీషతో ముఖ్యమంత్రి మంగళవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. తక్షణ సాయంగా రూ.5 లక్షలు ఇస్తామన్నారు. హోం మంత్రి అనిత కూడా వీడియో కాల్‌లో ఆమెతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సైతం జిల్లా ఎస్పీతో మాట్లాడి నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పలువురు టీడీపీ నాయకులు సైతం బాధితురాలిని పరామర్శించారు. ఆమె ముగ్గురు పిల్లల చదువుకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్నారు. జరిగిన ఘటనకు, రాజకీయాలకు సంబంధం లేదని కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. అప్పు ఇచ్చిపుచ్చుకోవడంలో జరిగిన తేడా వల్లే ఇది చోటు చేసుకుందని వివరించారు.

పసుపుతాడు తప్ప ఏమీలేదు: శిరీష

ఇదిగో.. మెడలో ఉన్న పసుపుతాడు తప్ప నా దగ్గర ఇంకేమీ లేదు. ఆయన (భర్త) అప్పులు చేసి తీర్చలేక మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ముగ్గురు బిడ్డలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నా. అందుకోసం బెంగళూరులో కూలిపనులు చేస్తున్నా. నన్ను చెట్టుకు కట్టేసి చావబాదారు. నా కొడుకు మా అమ్మను కొట్టొద్దని ఏడుస్తుంటే పక్కకు తోసేశారు. ఊళ్లో 200 మంది చూస్తూ ఉన్నారు. ఎవరూ పట్టించుకోలేదు. నా భర్త అప్పులు చేసింది నిజమే. రూ.80 వేల అప్పునకు పత్రం రాయించి నాచేత బలవంతంగా సంతకం పెట్టించుకున్నారు. నిదానంగా తీరుస్తానని చెప్పినా వినకుండా గొడ్డును బాదినట్లు బాదారు. నాకు న్యాయం కావాలి. నా బిడ్డలకు ఆదరువు కావాలి.

చెల్లిపైనా దొంగ చెవులు!




(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. తన ఫోన్‌ను తెలంగాణ ఎస్ఐబీ అధికారులు ట్యాప్ చేశారని, తన ఫోన్ కాల్స్‌కు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లు సేకరించారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా మంగళవారం ఆరోపించారు.

కోడ్ నేమ్...

జగన్ హయాంలో ఏపీలోనూ భారీ స్థాయిలో ఫోన్లపై నిఘా ఉంచినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో సొంత పార్టీ నేతలు కూడా నేరుగా ఫోన్లలో మాట్లాడుకోవడానికి భయపడేవారు. వాట్సాప్, ఫేస్ టైమ్ వంటి యాప్‌లు ఉపయోగించుకునేవారు. స్మార్ట్‌ఫోన్‌లు కాకుండా, పాతకాలపు బటన్ ఫోన్లు వాడిన వారూ ఉన్నారు. అదే సమయంలో తెలంగాణలోనూ విచ్చలవిడిగా ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. వైఎస్ షర్మిల 2021లో ‘వైఎస్సార్ తెలంగాణ పార్టీ’ ఏర్పాటు చేశారు. తెలంగాణలో షర్మిల రాజకీయ అరంగేట్రం అప్పటి ఏపీ సీఎం జగన్‌కు ఎంతమాత్రం ఇష్టం లేదు. అదే సమయంలో ఇరువురి మధ్య ఆస్తి వివాదాలూ తలెత్తాయి. ఈ క్రమంలోనే... అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ద్వారా చెల్లెలి ఫోన్‌పై నిఘా పెట్టించినట్లు తెలిసింది. షర్మిలతో పాటు, ఆమె ఎవరెవరితో మాట్లాడుతుంటే వారందరి సెల్‌ఫోన్లపైనా ఎస్ఐబీ ‘నిఘా’ పెట్టినట్లు సిట్ విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. షర్మిలకు సంబంధించి ఒక కోడ్ నేమ్ వాడారని... షర్మిల కదలికలు, సంభాషణలు అన్నీ రికార్డు చేసి నాటి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పంపించారని సమాచారం. కొన్ని ఫోన్లను నెలల తరబడి అబ్జర్వేషన్‌లో పెట్టారని సిట్ గుర్తించినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ నేతలే లక్ష్యం...

తెలంగాణలో కేసీఆర్ హయాంలో భారీ స్థాయిలో రాజకీయ నాయకులు, పాత్రికేయులు, ఇతర ప్రముఖుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు బలమైన ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్‌కి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి అగ్రనాయకత్వం వరకు.. అనేక మంది ఫోన్లను ట్యాప్ చేశారని తెలుస్తోంది. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు 650మందికి పైగా నాయకుల ఫోన్లను ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు బృందం ట్యాపింగ్ చేయించిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ‘సిట్’ను నియమించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అంటే 2023 నవంబరులో ఒకేరోజున 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీం ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌పై అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ‘సిట్’ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ట్యాపింగ్ బాధితులైన నేతలు, పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, గద్వాలకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు సరిత, ఆమె భర్త వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు.

‘చట్టబద్ధం’ అనిపించేలా...

ఎవరి ఫోన్ ట్యాప్ చేయాలన్నా... అందుకు అధికారిక అనుమతులు ఉండాలి. ‘రివ్యూ కమిటీ’ ఆమోదం మేరకే ఫోన్లపై నిఘా వేయాలి. అయితే... పైకి లీగల్‌గా కన్పించేలా ‘ఇల్లీగల్’ పని చేసినట్లు సిట్ ఇప్పటికే గుర్తించింది. మావోయిస్టు సానుభూతిపరుల పేరిట రివ్యూ కమిటీకి ప్రతిపాదనలు పంపించి... అందులో ఫోన్ నంబర్లు మాత్రం రాజకీయనేతలవి పెట్టారని గుర్తించింది. వెరసి... ఇది మావోయిస్టుల ముసుగులో జరిగిన రాజకీయ ఆపరేషన్! ఎవరి ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావు ఇదంతా చేశారనే విషయాన్ని నిర్ధారించుకోవడానికి సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో ప్రభాకర్ రావు బుధవారం నాలుగోసారి సిట్ ముందు విచారణకు హాజరవుతున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

- వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయద్దు
- మోసాలపై 1930కి ఫిర్యాదు చేయండి: డీజీపీ గుప్తా



అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ‘సైబర్ నేరగాళ్లు రైతులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ ద్వారా వచ్చే నకిలీ ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవద్దు’ అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సూచించారు. ఇటీవల సత్యసాయి జిల్లా కనగానిపల్లికి చెందిన ఒక రైతుకు పీఎం కిసాన్ యోజన పేరుతో ఒక ఫేక్ ఏపీకే ఫైలు వాట్సాప్ ద్వారా వచ్చింది. దాన్ని అధికారిక యాప్‌గా భావించిన రైతు డౌన్‌లోడ్ చేయడంతో ఆయన ఖాతాలో ఉన్న రూ.94 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఇలాంటివి దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తేలడంతో రాష్ట్ర పోలీసు శాఖలోని సైబర్ విభాగాన్ని డీజీపీ అప్రమత్తం చేశారు. మరో వైపు ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆయన... గూగుల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్లే ప్రొటెక్ట్ సదుపాయాన్ని ఆన్ చేసుకోవాలని.. అవాస్ట్, నార్టన్, బిట్ డిఫెండర్ లాంటి యాంటీ వైరస్ యాప్‌లను ఉపయోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే లింక్‌లు క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్‌తో ఎవరైనా వారి బారిన పడితే తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. రాష్ట్రంలో సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలు అరికట్టేందుకు జిల్లాకొక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు.

చెవిరెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అటు నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోయేందుకు రహస్యంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ముందే ఈ విషయం పసిగట్టిన సిట్ అధికారులు చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడులపై ఎల్‌వోసీ (లుకౌట్ నోటీసు) జారీ చేసింది. ఈ విషయం తెలియని చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడు తమ పథకంలో భాగంగా మంగళవారం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎయిర్‌పోర్టులోనే వారిద్దరినీ నిర్బంధించి ఏపీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిట్ అధికారుల బృందం బెంగళూరుకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకుంది.

రూ.కోట్ల నగదు అభ్యర్థులకు పంపిణీ..

గత ఎన్నికల్లో తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి అప్పటి అధికార వైసీపీ మద్యం ముడుపులను వాడినట్టు సిట్ గుర్తించింది. ఎన్నికల సందర్భంగా రూ.ఎనిమిది కోట్లు ప్రకాశం జిల్లాలోని ఒక అసెంబ్లీ అభ్యర్థికి ఇచ్చేందుకు తీసుకెళ్తుండగా ఈసీ పట్టుకుంది. అప్పట్లో ఆ డబ్బులను సీజ్ చేసిన తహశీల్దారు మొదలుకొని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వాహన డ్రైవర్, గన్‌మ్యాన్, వ్యక్తిగత సహాయకుడి వరకు అందరినీ పిలిపించి సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆ రూ.8 కోట్లు తనవంటూ అప్పట్లో చెవిరెడ్డి మిత్రుడు, బినామీ వెంకటేశ్ నాయుడు ఆధారాలు చూపించి వెనక్కు తీసేసుకున్నారు. అవి లిక్కర్ ముడుపులేనని తాజాగా తేలడంతో వెంకటేశ్‌నాయుడిని సిట్ విచారించింది. ఆయనను ఈ కేసులో 34వ నిందితునిగా చేర్చింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు, కోడ్ రాష్ట్రంలో అమలులోఉండగా రాజ్ కసిరెడ్డి (ఏ1) నుంచి సుమారు రూ.285కోట్ల వరకూ పలు దఫాలుగా, పలు ప్రాంతాలనుంచి చెవిరెడ్డి తీసుకుని ఐదుచోట్ల నిల్వ చేశారని సిట్ గుర్తించింది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పలువురు వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం ఆ డబ్బులు పంచినట్లు తేలింది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తన కోసమూ ఆ ముడుపులు ఖర్చుచేసిన భాస్కర్ రెడ్డి, తన కుమారుడు మోహిత్‌రెడ్డి కోసం చంద్రగిరిలోనూ వాటిని ఖర్చు చేసినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డితోపాటు ఆరుగురిని ఇటీవల నిందితులుగా చేర్చి, కోర్టులో వారిపై మెమో దాఖలుచేసింది.

డ్రైవర్లు, చిన్న ఉద్యోగులతో నగదు తరలింపు

ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బాలాజీ యాదవ్‌ను ఏ-35గా నిందితుల జాబితాలో చేర్చింది. అలాగే, చెవిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు నవీన్ ఏ-36, ఆయన వాహన డ్రైవర్ హరీశ్ ఏ-37, చెవిరెడ్డి కుమారుడు, మోహిత్ రెడ్డిని ఏ-39గా చేర్చింది. చెవిరెడ్డికి బాలాజీ యాదవ్ అత్యంత నమ్మకస్తుడు. తుడా ఆఫీసులో ఉన్న బాలాజీని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లోకి తెచ్చి...ఎప్పటికప్పుడు మద్యం వ్యాపార వివరాలు (ఏ1) రాజ్ కసిరెడ్డికి అందించే బాధ్యతను ఆయనకు అప్పగించింది చెవిరెడ్డేనని సమాచారం. డబ్బులు ఎవరెవరికి ఎంత, ఎక్కడ అందజేయాలనేది నవీన్‌కు చెప్పి, ఆయనతో చెవిరెడ్డే ఆ పనులు చేయించినట్టు సిట్ గుర్తించింది. పలుమార్లు డబ్బులు తీసుకొచ్చిన వాహనానికి డ్రైవర్‌గా వ్యవహరించిన హరీశ్‌ను కేసులో నిందితుడిగా చేర్చింది. లిక్కర్ ముడుపులను చంద్రగిరి ఎన్నికల్లో పంచిన మోహిత్ రెడ్డిని కూడా నిందితుల జాబితాలో చేర్చింది.

ముడుపులు కట్టారిలా..

వైసీపీ ప్రభుత్వంలో కీలక నేత, జగన్ దంపతుల వద్దకు ఏకంగా తిరుమల వెంకటేశ్వర స్వామినే తీసుకొచ్చేంత భక్తి చూపించిన చెవిరెడ్డికి ఆరు జిల్లాల్లో ఎన్నికల బాధ్యతను వైసీపీ అధినేత అప్పట్లో అప్పగించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సర్వేలు చేస్తూ ఎక్కడెక్కడ అభ్యర్థులు ఎలా ఉన్నారో అధ్యక్షుడికి చెవిరెడ్డి నివేదికలు ఇచ్చేవారు. జగన్ కుటుంబంతో బంధుత్వం కలుపుకొనే స్థాయికి వీరి బంధం చేరినట్లు ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లోనే తన కుమారుడు మోహిత్ రెడ్డికి చంద్రగిరి అసెంబ్లీ టికెట్‌ను ఇప్పించుకున్నారు. చెవిరెడ్డికి ఒంగోలు ఎంపీ అభ్యర్థిత్వానికి బీ ఫారమ్ జగన్ ఇచ్చారు. దీనితో పాటు పార్టీకి చెందిన పలువురు అభ్యర్థులను గెలిపించే బాధ్యతను కూడా చెవిరెడ్డికే అప్పగించారు. అందుకు అవసరమైన ధనం హైదరాబాద్‌లో తీసుకోవాలని సూచించారు. దీంతో (ఏ1) రాజ్ కసిరెడ్డి నుంచి రూ.కోట్లు అందుకుని టార్గెట్ జిల్లాల్లోని పలువురు వైసీపీ అభ్యర్థులకు చెవిరెడ్డి పంపిణీ చేసినట్లు సిట్ గుర్తించింది.

తోపుదుర్తికి బిగుస్తున్న ఉచ్చు!

- హెలిప్యాడ్ ఘటనలో మళ్లీ విచారణకు పిలుపు
- ‘చలో పేరూరు’ కేసులో అరెస్టు భయంతో ఇప్పటికే అజ్ఞాతంలోకి మాజీ ఎమ్మెల్యే
- కోర్టులో ముందస్తు బెయిల్ కోసం యత్నాలు
- ఆయన కోసం పోలీసుల గాలింపు



పుట్టపర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి పోలీసుల నుంచి మళ్లీ పిలుపు వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా కుంటిమద్ది హెలిప్యాడ్ ఘటనకు సంబంధించిన కేసులో వారంలో రోజుల్లో తమ ఎదుట హాజరు కావాలని రామగిరి సర్కిల్ పోలీసులు మంగళవారం ఆయనకు నోటీసులు జారీ చేశారు. పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్యను పరామర్శించేందుకు ఏప్రిల్ 8న మాజీ సీఎం జగన్ వచ్చిన సమయంలో హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. అక్కడ నానా రచ్చచేసి.. జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు ఈ ఘటన వెనుక కుట్రకోణం ఉందన్న అనుమానంతో విచారణ చేపట్టారు. తోపుదుర్తి సహా పలువురిపై కేసు నమోదుచేశారు. దాంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును అప్పట్లో ఆశ్రయించగా.. ఆయనకు సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి విచారించాలని.. దర్యాప్తునకు సహకరించకుంటే చట్టప్రకారం పోలీసులు చర్యలు తీసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. నోటీసులివ్వడంతో తోపుదుర్తి గతనెల 16న పోలీసుల ఎదుట హాజరయ్యారు. కానీ వారి ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. ఈ కేసులో పైలట్ అనిల్ కుమార్, కో-పైలట్ శ్రేయాస్ జైన్, సీకే పల్లి, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో వంద మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలను రామగిరి సర్కిల్ కార్యాలయానికి పిలిపించి పోలీసులు విచారించారు. ఈ కేసు దర్యాప్తు జరుగుతుండగానే ఇటీవల రామగిరి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారం వివాదాస్పదమైంది. బాధితురాలిని పరామర్శించేందుకు ‘చలో పేరూరు’ పేరిట ఈ నెల 12న తోపుదుర్తి శాంతిభద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేశారు. పోలీసులు అనుమతి నిరాకరించినా బలప్రదర్శన చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగానే పేరూరుకు వెళ్లడానికి ప్రయత్నించారని తోపుదుర్తితోపాటు మరి కొందరు వైసీపీ నేతలపై రామగిరి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో విచారణకు రావాలని ఈ నెల 13న పోలీసులు 41ఏ నోటీసు ఇచ్చారు. అయితే అరెస్టు భయంతో ఆయన పోలీసుల కళ్లుగప్పి.. శంషాబాద్ చేరుకుని విమానంలో ముంబై వెళ్లిపోయారు. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న ఆయన కోసం పోలీసులు పెద్దఎత్తున గాలిస్తున్నారు. రెండు కేసుల్లో ఉచ్చు బిగుసుకుంటుండడంతో ఆయన కూడా ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం.


రాజ్ కసిరెడ్డి | గోవిందప్ప | శ్రీధర్‌రెడ్డి | కృష్ణమోహన్‌రెడ్డి | ధనుంజయ్‌రెడ్డి

మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

- 1 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

విజయవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో అరెస్టయి విజయవాడ జిల్లా జైల్లో ఉన్న నిందితులకు న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో పాటు బాలాజీ గోవిందప్ప, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనుంజయ్‌రెడ్డి, పైలా దిలీప్, చాణక్యలను విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. వారికి జూలై ఒకటో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. తనకు కొత్తగా పెళ్లయిందని, బెయిల్ మంజూరు చేయాలని దిలీప్ న్యాయాధికారికి విన్నవించుకున్నారు. శ్వాసలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జైల్లో సరైన సదుపాయాలు లేవని న్యాయాధికారికి చెప్పిన కృష్ణమోహన్ రెడ్డి.. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కాగా, ఈ బెయిల్ పిటిషన్లపై విచారణను న్యాయాధికారి వాయిదా వేశారు. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, దిలీప్, చాణక్య బెయిల్ పిటిషన్లపై విచారణను 19కి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణను 20కి, బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్‌ను 23వ తేదీకి వాయిదా వేశారు.

బెయిల్ మంజూరు చేయండి: జర్నలిస్ట్ కృష్ణంరాజు

రాజధాని మహిళలపై ఓ చానల్ డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో గుంటూరు జిల్లా, తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జర్నలిస్ట్ వీవీఆర్ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వద్ద విచారణకు రాగా, విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు ఇద్దరు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాది ఎస్‌వీఎస్‌ఎస్ శివరామ్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ)కు స్టాండింగ్ కౌన్సిల్ నియమితులయ్యారు. న్యాయవాది ఓరుగంటి ఉదయ్‌కుమార్ అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యునివర్సిటీకి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులిచ్చారు. న్యాయవాది కె.మణికంఠేశ్వరరావును ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

కిక్కురుమనని ఎక్సైజ్ శాఖ

- కానిస్టేబుళ్లపై వేధింపులు కొనసాగింపు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లపై వేధింపుల అంశంపై ఎక్సైజ్ శాఖ మౌనం దాల్చింది. శాఖలోని ఓ కీలక అధికారి కొన్ని నెలలుగా ఆరుగురు కానిస్టేబుళ్లను ఇంటి పనులకు వినియోగించుకుంటున్న విషయాన్ని మంగళవారం ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనంతో శాఖలోని ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ఈ విషయం ఎలా బయటికి వచ్చిందని ఆరా తీశారు. మరోవైపు ప్రభుత్వ స్థాయిలోనూ ఈ వేధింపులపై సమాచారం సేకరించారు. విషయం బయటికొచ్చినా మంగళవారం కూడా కానిస్టేబుళ్లను ఉన్నతాధికారి ఇంటి పనులకు వినియోగించుకున్నారు. ఏ పని చెప్పినా చేయాల్సిందేనని, ఫోన్లు ఇంటిబయటే పెట్టి రావాలని ఉన్నతాధికారి కుటుంబసభ్యులు వేధిస్తున్నట్లు తెలిసింది.

పోస్టాఫీసులకు పోటెత్తిన తల్లులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ‘తల్లివందనం’ పథకంలో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసింది. ఈ నగదు విత్‌డ్రా చేసుకునేందుకు మహిళలు బ్యాంకులు, పోస్టాఫీసులకు పోటెత్తారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మంగళవారం తల్లులు తమ ఖాతాల్లోని నగదును తీసుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన చిత్రమిది. మహిళలను నియంత్రించేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగదు డ్రా చేసుకున్న అనంతరం తల్లులు పిల్లలకు బ్యాగులు, పుస్తకాలతో పాటు బంగారం, బట్టలు కొనుగోలు చేశారు.




అనంతపురం నగరంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద తల్లికి వందనం సొమ్ము కోసం బారులు తీరిన మహిళలు. నగదు ఇచ్చేందుకు పోస్టాఫీసు సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.